



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1  సంచిక : 64  పేజీలు : 12  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  ప్రచురణ : హైదరాబాద్  గురువారం 15 జనవరి 2026  వెల : 1/-రూ ॥

VOLUME :1  ISSUE : 64  PAGES : 12  EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )  PUBLISHED : HYDERABAD  THU 15 JANUARY 2026  PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur





సంక్రాంతి పండుగ సందర్భంగా పత్రిక కార్యాలయానికి నేడు (గురువారం) సెలవు. కావున రేపు (శుక్రవారం) పత్రిక వెలువడదు.. తిరిగి పునర్దర్శనం శనివారం.

## గ్రామాల పరిపాలనపై
# శిక్షణ

- పంచాయతీరాజ్ చట్టంపై శిక్షణకు అధికారుల ఏర్పాట్లు
- ఈ నెల 19 నుంచి 5 విడతలుగా ప్రారంభం కానున్న శిక్షణ
- పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం
- వంద మందికి ఒక బ్యాచ్ చొప్పున విభజించి శిక్షణ
- గ్రామ పంచాయతీల అధికారాలు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు తదితర 24 అంశాలకు సంబంధించి అవగాహన
- జిల్లాకు 8 మంది చొప్పున రీసోర్స్ పర్సన్‌లను అధికారులు ఎంపిక




హైదరాబాద్ పెన్ పవర్:
తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో నూతనంగా ఎన్నికైన పాలక వర్గాలకు పల్లె పాలనతో పాటు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 19 నుంచి సర్పంచులకు శిక్షణ ఇచ్చేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో సర్పంచులకు ఈ నెల 19 నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో 5 రోజుల పాటు గ్రామాల పరిపాలనపై శిక్షణ ఇవ్వనున్నారు. అందరికీ ఒకేసారి కాకుండా వంద మందికి ఒక బ్యాచ్ చొప్పున విభజించి ఐదు విడతలుగా అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 12,702 మంది సర్పంచిలతో పాటు ఉపసర్పంచిలు వార్డు మెంబర్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందుకోసం కరదీపికలను సిద్ధం చేశారు. ఒక్కో బ్యాచ్‌లో 50 మందికి ఒకటి చొప్పున రెండు తరగతులుగా ట్రైనింగ్ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు, ఎంపీవోలతో పాటు రిటైర్డ్ ఎంపీడీవోలను రిసోర్సు పర్సన్లుగా ఎంపిక చేశారు. వారికి హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధి సంస్థ(ఐఆర్‌డీ)లో ఈ నెల 5 నుంచి 10 వరకు శిక్షణకు సంబంధించిన వివరాలపై తర్ఫీదునిచ్చారు. దానికి హాజరైన వారంతా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో భాగస్వాములవుతారు. సర్పంచుల శిక్షణ పూర్తయిన తర్వాత ఉప సర్పంచులు, వార్డు - మిగతా2లో




నోటీసులు ఇస్తే సరిపోతుంది కదా...
## ఇంత దౌర్జన్యం అవసరమా?

- తెలంగాణలో ముగ్గురు జర్నలిస్టులను పోలీసులు కిడ్నాప్ చేశారన్న కేటీఆర్
- రాజ్యాంగ హక్కులను రేవంత్ సర్కార్ కాలరాస్తోందని తీవ్ర ఆరోపణ
- ఇదేనా మీ 'మొహబ్బత్ కీ దుకాన్' అంటూ రాహుల్ గాంధీకి ప్రశ్న
- మీడియాపై దాడులు రేవంత్ పాలనకు నిదర్శనమని విమర్శ
- బెయిల్ వచ్చే సెక్షన్లకే ఇంత దౌర్జన్యమా అని నిలదీత

హైదరాబాద్ పెన్ పవర్:
తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ముగ్గురు జర్నలిస్టులను పోలీసులు అపహరించారని ఆరోపిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆయన ఘాటుగా స్పందించారు. "రాహుల్ గాంధీ గారూ.. మీరు నడుపుతున్న 'మొహబ్బత్ కీ దుకాన్' తెలంగాణ శాఖ, పౌరుల రాజ్యాంగ హక్కులను ఎలా కాలరాస్తోందో గమనిస్తున్నారని ఆశిస్తున్నా"

వివరాలు 2లో..

## మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ..



- ఈడీకి వ్యతిరేక పిటిషన్ కొట్టివేత..
- ఇటీవలే ఐ-ప్యాక్ సంస్థపై ఈడీ జరిపిన దాడుల్ని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అడ్డుకున్నారు
- మమత బెనర్జీ కీలక డాక్యుమెంట్లు తీసుకెళ్లి, నేరానికి పాల్పడ్డారని ఆరోపించింది

వివరాలు 2లో..

మళ్లీ చెప్తున్నా.. క్యారెక్టర్
## అసాసినేషన్ చేస్తే సీరియస్ యాక్షన్



హైదరాబాద్ పెన్ పవర్:
సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననం(క్యారెక్టర్ అసాసినేషన్)పై డీజీపీ శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలోనే తమ విధానాన్ని వెల్లడించినట్లు గుర్తు చేశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అక్టోబర్ ఒకటో తేదీన జరిగిన విలేకరుల సమావేశంలో.. సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశం

వివరాలు 2లో..

## మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు నమోదు



హైదరాబాద్ పెన్ పవర్:
మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని తలసానిపై కాంగ్రెస్ నేత రవి

వివరాలు 2లో..

## 'బర్ప్ సూట్' మోడ్రన్ సాఫ్ట్‌వేర్‌తో
# అక్రమాలు

- భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల దారి మళ్లింపు వ్యవహారం
- ఆధునిక సాఫ్ట్‌వేర్‌తో చలానాల చెల్లింపు ప్రక్రియలోకి చొరబాటు
- సాగు భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల దారిమళ్లింపు వ్యవహారంలో వెలుగులోకి
- కొట్టేసిన సొమ్ముతో నిందితుడు బస్వరాజ్ విలాసాలు




హైదరాబాద్ పెన్ పవర్:
సాగు భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి జనగామ కేంద్రంగా జరిగిన ఛార్జీల దారి మళ్లింపు వ్యవహారంలో అక్రమార్కులు 'బర్ప్ సూట్' అనే ఆధునిక సాఫ్ట్‌వేర్ వాడినట్లు వెలుగులోకి వచ్చింది. చలానాల చెల్లింపు ప్రక్రియలోకి చొరబడ్డ నిందితులు, ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి అక్రమాలకు పాల్పడి ఉంటారని, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల చాలాకాలంగా ఇది జరుగుతోందని అధికారులు అనుమానిస్తున్నారు. జనగామలోని ప్రైవేటు ఆన్‌లైన్ కేంద్రం ద్వారా జరిగిన ఒక లావాదేవీలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఇటీవల కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఉదంతం బయటకు రావడంతో రెవెన్యూ అధికారులు జరిపిన ప్రాథమిక విచారణలో మొత్తం 4,800 లావాదేవీల ద్వారా ప్రభుత్వ ఖాజానాకు రూ.52 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు తేలింది. రంగారెడ్డి, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఇలాంటి - మిగతా2లో



## ఇది రేవంత్ సర్కార్ రాజకీయ వికృత క్రీడ

- పండగ పూట జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటు
- ఎలాంటి నోటీసులు లేకుండా అరెస్టు చేయడం అక్రమం
- "మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా?
- ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా?



## తక్షణమే ఇరాన్‌ను వీడండి

- భారతీయులకు రాయబార కార్యాలయం కీలక సూచనలు
- ఇరాన్‌లో తీవ్ర ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు
- కీలక ఆదేశాలు జారీ చేసిన భారత రాయబార కార్యాలయం
- అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచన

వివరాలు 2లో..



## శబరిమలలో కనులపండువగా మకరజ్యోతి దర్శనం

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన శబరిగిరి కొండలు
పొన్నాంబలమేడుపై మూడుసార్లు కనిపించిన దివ్యజ్యోతి
తిరువాభరణాల అలంకరణ తర్వాత జరిగిన ప్రత్యేక పూజలు
లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో నిండిపోయిన సన్నిధానం

వివరాలు 2లో..



## 40 ఏళ్లుగా ఉగ్రవాదంపై కెనడాకు చెబుతున్నాం.. కానీ!

- భారత రాయబారి విమర్శలు
- ఉగ్రవాదాన్ని అరికట్టడంలో 40 ఏళ్లుగా విఫలమవుతున్నారని ఆగ్రహం
- భారత్ వ్యతిరేక కుట్రలకు ఒట్టావా కేంద్రంగా మారుతోందని ఆరోపణ
- భారత్‌ను ఆధారాలు అడుగుతున్న కెనడా, తాను మాత్రం ఆధారాలు చూపించడం లేదని విమర్శ

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### 'బర్ఫ్ సూట్' మోడ్రన్ సాఫ్ట్‌వేర్‌తో అక్రమాలు

-మొదటిపేజీ తరువాయి

లావాదేవీలు అత్యధికంగా జరిగినట్లు గుర్తించారు. ఈ అక్రమాలపై విచారణకు ప్రభుత్వం రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్ తదితర విభాగాలకు చెందిన అధికారులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఇప్పటికే స్లాట్లు బుక్ చేసిన ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. పోర్టల్‌లోని లోపాలను అడ్డం పెట్టుకొని నిందితులు అక్రమాలకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

**బయటకు రాకుండా అధికారులకు మామూళ్లు!**

సాధారణంగా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఛార్జీలను రైతులు నగదు రూపంలో ఆన్‌లైన్ సేవా కేంద్రాల్లో చెల్లిస్తుంటారు. ఆన్‌లైన్ సేవా కేంద్రాల నిర్వాహకులు రోజంతా ఇలా జమ అయిన డబ్బును తమ అకౌంట్లో వేసుకుంటారు. తమ డెబిట్ కార్డు ఉపయోగించి తమ అకౌంట్లో ఉన్న డబ్బుతో లావాదేవీ పూర్తి చేస్తారు. ఇక్కడే వారు మతలబు చేస్తున్నారు. ఉదాహరణకు రిజిస్ట్రేషన్ ఛార్జీల కింద రూ.15 వేలు చెల్లించాల్సి ఉంటే, ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ సేవాకేంద్రం నిర్వాహకుడికి రైతు ఇస్తాడు. నిర్వాహకుడు మాత్రం అందులో రూ.150 మాత్రమే బ్యాంకుకు చెల్లిస్తాడు. కానీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉపయోగించి ప్రభుత్వ ఖజానాలో రూ.15,000 జమ అయినట్లు చూపిస్తాడు. ఇలా చేసి రూ.14,850 తీసుకుంటున్నారు. వాస్తవానికి ప్రభుత్వ ఖజానాలో ఎంత జమ అయిందన్న విషయం అధికారులకు తెలుస్తుందని, ఆ విషయం బయటకు రాకుండా అందరికీ మాముళ్లతో ఆకట్టుకున్నారు. పోలీసుల వద్ద అనుమానితులు ఈ మేరకు అంగీకరించినట్లు సమాచారం.

**ఫార్చ్యూనర్ కారు - థాయ్‌లాండ్ టూర్లు**

ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న యాదగిరిగుట్టకు చెందిన నిందితుడు బస్వరాజ్ ఒక్కడే రూ.11 కోట్లు కొట్టేసినట్లు, ఇతనికి పాండు అనే మరో వ్యక్తి సహకరించినట్లు తెలుస్తోంది. కొట్టేసిన సొమ్ముతో బస్వరాజ్ విలాసాలు అనుభవించినట్లు సమాచారం. ఖరీదైన ఫార్చ్యూనర్ కారు కొనడంతో పాటు అనేకమార్లు థాయ్‌లాండ్ సహా వివిధ దేశాల్లో పర్యటించినట్లు పోలీసులు గుర్తించారు. బస్వరాజ్ వద్ద 1,200లకు పైగా రిజిస్ట్రేష న్‌కు సంబంధించిన పత్రాలు దొరికినట్లు సమాచారం. ఈ వ్యవహారం ఒక్క జనగామకు మాత్రమే పరిమితం కాదని, ఇలాగే రాష్ట్రవ్యాప్తంగా అనేక కేంద్రాల్లో జరిగిందని, ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఇంటర్నెట్ కేంద్రాల్లో రూ.లక్షల్లో కమీషన్లు**

సాగుభూముల రిజిస్ట్రేషన్ల పోర్టల్‌కు అక్రమార్కులు భారీగా కన్నమేశారు. రైతులు చెల్లించిన స్టాంపు డ్యూటీ, ఛార్జీలను దాదాపు మొత్తం దోచేస్తున్నారు. రైతులు రూ.లక్ష చెల్లిస్తే ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.1,000 మాత్రమే చేరుతుంది. మిగతా డబ్బును కమీషన్ల రూపంలో పంచుకుంటున్నట్లు సమాచారం. జనగామ జిల్లా కేంద్రంలో బయటపడిన ఈ వ్యవహారంలో పలు కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ లావాదేవీలు జరిగిన ఇంటర్నెట్ కేంద్రాల్లో ఈ-ఫైళ్లను నిపుణులు పరిశీలిస్తున్నారు. వాటి నిర్వాహకులు ముఠాగా ఏర్పడి దోపిడీకి పాల్పడ్డారని గుర్తించినట్లు సమాచారం.

### గ్రామాల పరిపాలనపై శిక్షణ

-మొదటిపేజీ తరువాయి

సభ్యులకు డివిజన్, మండల కేంద్రాల్లో ట్రైనింగ్ ఇవ్వనున్నారు.

**24 అంశాలపై అవగాహన**

గ్రామ పాలనలోని వ్యవస్థలు, నూతన పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం గ్రామ పంచాయతీల అధికారాలు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు తదితర 24 అంశాలకు సంబంధించి అవగాహన కల్పించనున్నారు. గ్రామ సభల నిర్వహణ, పంచాయతీ సమావేశాలు, జనన, మరణాల నమోదు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, వ్యవసాయం, ఈ అప్లికేషన్, పంచాయతీరాజ్ ఈ పాలన, ఆర్థికాభివృద్ధిలో గ్రామ పంచాయతీల పాత్ర, కేంద్ర ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధుల వినియోగం, ఖర్చు తదితర అంశాలపై సర్పంచులకు పూర్తిగా వివరించనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

**రీసోర్స్ పర్సన్‌లకు తర్ఫీదు పూర్తి**

సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు జిల్లాకు 8 మంది చొప్పున రీసోర్స్ పర్సన్‌లను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు కూడా ఉన్నారు. వీరికి ఈ నెల 5 నుంచి 10 వరకు హైదరాబాద్‌లోని టీజీ ఐఆర్‌డీ(గ్రామీణాభివృద్ధి సంస్థ)లో తర్ఫీదు ఇచ్చారు. వారు సంక్రాంతి పండుగ అనంతరం ఆయా జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగి పాలకవర్గాలు ఏర్పాటైన సందర్భంలో రాష్ట్రానికి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,500 కోట్ల విడుదలకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఇందులో రూ.వెయ్యి కోట్లను జనవరి నెలాఖరులోపు, రూ.1,500 కోట్లు వచ్చే నెలలో విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. రాష్ట్రంలో పంచాయతీ పాలకవర్గాలకు 2024 జనవరిలో గడువు ముగియగా 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు కేంద్రం నుంచి నిధులు వచ్చాయి. 2024-25లో ఎన్నికలు జరగకపోవడంతో పాలకవర్గాలు లేక ఆ సంవత్సరానికి రావాల్సిన రూ.2,500 కోట్లను కేంద్రం నిలిపివేసింది. డిసెంబరు నెలలో మూడు విడతలుగా 12,702 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో 7,522 గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకోగా, 820 సర్పంచి స్థానాల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు గెలిచారు. 62 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలిచి అగ్రస్థానంలో నిలిచింది. మిగతా స్థానాలను బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు గెలిచాయి.

### ఇది రేవంత్ సర్కార్ రాజకీయ వికృత క్రీడ

**హైదరాబాద్:** పాలన చేతగాని సర్కారు.. పండగ పూట జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు అన్నారు. తెలంగాణవ్యాప్తంగా మీడియా ప్రతినిధులను, డిజిటల్ జర్నలిస్టులను పోలీసులు టార్గెట్ చేయడంపై ఆయన మండిపడ్డారు. ఎలాంటి నోటీసులు లేకుండా అరెస్టు చేయడం అక్రమమని అన్నారు. "మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా? ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా? జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవం పై పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా- డిజిటల్ మీడియా పై సిట్‌లతో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు? మీ స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గం. రేవంత్ రెడ్డి.. ఇదేనా నీ ప్రజాపాలన? ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ? అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం" అని ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారాయన. అంతేకాదు డీజీపీ శివధర్‌రెడికి ఫోన్ చేసి జర్నలిస్టులను విడుదల చేయాలని కోరారు. ఈ అరెస్టులను తెలంగాణ పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి ఖండించారు. "అర్ధరాత్రిళ్లు అరెస్ట్ చేయడం కరెక్ట్ కాదు. సదరు జర్నలిస్టులకు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుని ఉంటే బాగుండేది. జర్నలిస్టుల అరెస్టుతో యుద్ధ వాతావరణం ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఇది కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదు" అని అభిప్రాయపడ్డారు. ఓ మంత్రి-ఐఏఎస్ అధికారిణి అంటూ.. ప్రముఖ చానెల్‌లో కథనం ప్రసారం అయ్యింది. దాని ఆధారంగా అటు సోషల్ మీడియాలో విస్తృత కథనాలు ప్రసారం అయ్యాయి. ఈ ప్రచారాన్ని తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. మంత్రి కోమటిరెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు ఆ ప్రచారాన్ని ఖండించారు. ఈ క్రమంలో సదరు ప్రముఖ మీడియా సంస్థకు చెందిన జర్నలిస్టులను గత అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి ఇంటికెళ్లి తలుపులు బద్ధలు కొట్టి మరీ అరెస్ట్ చేశారని.. ఎలాంటి ప్రొసీజర్, నోటీసులు ఫాలో కాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో.. రాష్ట్రంలో మరికొన్ని చోట్లా పోలీసులు పాత్రికేయుల్ని టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటిదాకా పలు చానెల్స్, 40కి పైగా యూట్యూబ్ చానెల్స్‌పై పోలీసులు దృష్టిసారించినట్లు సమాచారం. అయితే అక్రమ అరెస్టులు.. పోలీసుల ప్రతాపంపై జర్నలిస్టుల సంఘాలతో పాటు పౌర హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి.

# చేనేతకు కొత్త ఫ్యాషన్

# లేటెస్ట్ డిజైన్లపై కార్మికులకు ట్రైనింగ్

నేత వస్త్రాలు కొత్త సొబగులు అద్దుకుంటున్నాయి. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా ఆకట్టుకునే డిజైన్లతో తయారు చేస్తున్నారు. ఇందుకు నేత కార్మికులకు చేనేత శాఖ సహకారం అందిస్తోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 35 చేనేత సమూహాలలో ఆధునిక డిజైన్లపై కార్మికులకు అవగాహన, ట్రైనింగ్ తరగతులు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు తెలంగాణలోని కార్మికులు మగ్గాలపై సంప్రదాయ చీరలు, బెడ్‌షీట్లు, తివాచీలు, రుమాళ్లు, దుప్పట్లు, ఇతర రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వీటిని చేనేత సహకార సంఘానికి (టెస్కోకు) అమ్ముతున్నారు. మరోవైపు సంతల్లో, వస్త్రదుకాణాలకు ఈ దుస్తులను విక్రయిస్తున్నారు. సంప్రదా య రకాలుగా గుర్తింపు ఉన్నా కొనుగోళ్లు సరిగా లేక తగిన నగదు రావడం లేదు. ఈ నేపథ్యంలో కార్మికుల స్థితిగతులపై గత ఏడాది ఆగస్టులో చేనేత, జౌళిశాఖ అధ్యయనం చేయించింది. ఈ సందర్భంగా మహిళలు నూతన డిజైన్లు, ఆకట్టుకునే రంగులు కావాలని అడుగుతు న్నారు. ఆధునికత ఉట్టిపడేలా ఉండాలని యువత చెప్పింది. దీంతో చేనేత శాఖ జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద తెలంగాణ రాష్ట్రంలో 35 నూతన సమూహాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఆధునిక ఫ్యాషన్, మార్కెట్ ట్రెండ్‌ను అందిపుచ్చుకుంటూ డిజైన్లను మార్చి చీరలతో పాటు బెడ్‌షీట్లు, డ్రెస్‌మెటీరియల్, లుంగీలు, తివాచీలు, రుమాళ్లు, కర్టెన్లు, టేబుల్ క్లాత్‌ల తయారీకి పూనుకుంది.

**టెస్కో దుకాణాలకు సరఫరా**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అయిన చేనేత సమూహాలలో ఆధునిక డిజైన్లపై చేనేత సంఘాల్లోని కార్మికులకు అవగాహన, నైపుణ్య అభివృద్ధి ట్రైనింగ్ క్లాస్‌లను గత ఏడాది అక్టోబరులో మొదలుపెట్టింది. అధునాతన మగ్గాలను ఆయా సమూహాల్లో ఏర్పాటు చేసింది. ఏ వయసు వారు ఎలాంటి వస్త్రాలు ఇష్టపడుతున్నారో వారికి నిపుణులు, డిజైనర్లు, జాతీయ చేనేత సాంకేతిక సంస్థ (ఐఐహెచ్‌టీ), పాలిటెక్నిక్ డిప్లొమా హోల్డర్ల ద్వారా వివరణ ఇస్తోంది. డిజైన్ అభివృద్ధికి కంప్యూటర్ ఎయిడెడ్ డిజైనింగ్‌ని వినియోగిస్తున్నారు. ట్రైనింగ్‌కు ప్రతి సమూహంలో రూ.30,000 వరకు వెచ్చిస్తోంది. దుస్తుల తయారీకి అవసరం అయిన నూలు, పట్టు, రంగులు, రసాయనాలను పంపిణీ చేస్తోంది. వీటి సహాయంతో కార్మికులు చీరలకు ఆధునిక హంగులు అద్దుతున్నారు. పోచంపల్లి, దుబ్బాక, గద్వాల, చేర్యాల, సిద్దిపేట, భువనగిరి, వరంగల్, సిరిసిల్ల, శాయంపేట తదితర చోట్ల కార్మికులు కొత్త డిజైన్లతో వస్త్రాలను తయారు చేస్తున్నారు. వీటిని వివిధ ఎగ్జిబిషన్లలో ప్రదర్శిస్తున్నారు. కొన్ని సమూహాల నుంచి టెస్కో దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. వాటిల్లో అమ్మకాలు ప్రారంభమయ్యాయి.

**సంఘాలను చైతన్యపరుస్తున్నాం**

చేనేత కార్మికుల ఆదాయాన్ని పెంచి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, ఈ రంగాన్ని స్థిరంగా నిలబెట్టడానికి వైవిధ్యం చాలా అవసరమని నేత, జౌళిశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ అన్నారు. ఈ విషయంలో సంఘాలను చైతన్యపరుస్తున్నామని తెలిపారు. సంప్రదాయ రకాలను నూతనంగా తీర్చిదిద్దడం ద్వారా వాటి పరిరక్షణతో పాటు వాడకం, ఆదరణ పెరుగుతోందని, పీతాంబరం వంటి రకాలకు చక్కని ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు.

"చేనేత కార్మికుల ఆదాయాన్ని పెంచి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, ఈ రంగాన్ని స్థిరంగా నిలబెట్టడానికి వైవిధ్యం చాలా అవసరం. ఈ విషయంలో సంఘాలను చైతన్యపరుస్తున్నాం. సంప్రదాయ రకాలను నూతనంగా తీర్చిదిద్దడం ద్వారా వాటి పరిరక్షణతో పాటు వాడకం, ఆదరణ పెరుగుతోందని, పీతాంబరం వంటి రకాలకు చక్కని ఆదరణ లభిస్తోంది." – శైలజా రామయ్యర్, ముఖ్యకార్యదర్శి, చేనేత, జౌళిశాఖ

**కార్మికులకు మేలు చేస్తుంది**

వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న చేనేత కార్మికుల్లో క్రమేపీ మార్పు వస్తోందని కొత్తవాడ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఎలుగం భద్రయ్య అన్నారు. నూతన పంథాలో వెళ్లడం ద్వారా వృత్తిని రక్షించడంతోపాటు జీవనోపాధి మెరుగవుతుందని నమ్ముతున్నామని తెలిపారు. ట్రైనింగ్ అనంతర కార్యాచరణకు చేనేత శాఖ సహకరించాలని, ఆయా వస్త్రాలను టెస్కో ద్వారానే కొనుగోలు చేయడం కార్మికులకు మేలు చేస్తుందని వివరించారు.

## శబరిమలలో కనులపండువగా మకరజ్యోతి దర్శనం

కేరళలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శబరిమలలో మకరజ్యోతి దర్శనం అశేష భక్తజన సందోహం మధ్య కనులపండువగా జరిగింది. మకర సంక్రాంతి పుణ్యదినమైన బుధవారం సాయంత్రం 6:30 గంటల తర్వాత పొన్నాంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు భక్తులకు దర్శనమిచ్చింది. ఈ అపురూప దృశ్యాన్ని తిలకించిన లక్షలాది మంది భక్తులు "స్వామియే శరణం అయ్యప్ప" అంటూ చేసిన శరణుఘోషతో శబరిగిరులు మార్మోగిపోయాయి. అంతకుముందు, పందళం రాజప్రాసాదం నుంచి తీసుకొచ్చిన పవిత్రమైన తిరువాభరణాలను అయ్యప్ప స్వామికి అలంకరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక దీపారాధన నిర్వహించారు. ఆ వెంటనే పొన్నాంబలమేడు కొండపై దివ్యజ్యోతి కనిపించడంతో భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. మకరజ్యోతిని సాక్షాత్తు అయ్యప్ప స్వామి జ్యోతిర్మయ రూపంగా భక్తులు విశ్వసిస్తారు. ఈ జ్యోతిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోయి, కోరిన కోరికలు నెరవేరతాయని ప్రగాఢంగా నమ్ముతారు.

మకరజ్యోతి దర్శనం సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు అధికారులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. రద్దీని నియంత్రించేందుకు కొండపైకి పరిమిత సంఖ్యలోనే భక్తులను అనుమతించారు. క్షేత్రానికి రాలేని భక్తుల కోసం పలు టీవీ ఛానెళ్లు, యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందించాయి. ఏటా మకర సంక్రాంతి నాడు జరిగే ఈ వేడుక కోసం దేశ నలుమూలల నుంచి భక్తులు 41 రోజుల కఠిన దీక్షతో శబరిమలకు చేరుకుంటారు.

## తక్షణమే ఇరాన్‌ను వీడండి

ఇరాన్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతోన్న ఆందోళనల కారణంగా అక్కడ మారణహోమం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. వేలాది మంది మృతి చెందగా, అందులో ఆందోళనకారులు 1,850 మంది, భద్రతా దళాల సిబ్బంది 135 మంది ఉన్నారు. ఆందోళనలతో సంబంధం లేని వారు కూడా పదుల సంఖ్యలో మరణించారు. ఆ దేశంలో ఎస్ఎంఎస్‌లు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఇరాన్‌లో ఆందోళనలు తీవ్ర హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో ఆ దేశంలో నివసిస్తున్న భారతీయులను అక్కడి భారత రాయబార కార్యాలయం అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచించింది. "ఇరాన్‌లోని భారత పౌరులు (విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు) అందుబాటులో ఉన్న విమానాల ద్వారా వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లిపోవాలి" అని పేర్కొంది. తీవ్రమవుతున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల కారణంగా టెహ్రాన్‌తో సహా ఇరాన్‌లోని పలు నగరాల్లో పరిస్థితి మరింత దిగజారిందని రాయబార కార్యాలయం హెచ్చరించింది. నిరసన ప్రదేశాలకు దూరంగా ఉండాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదించాలని భారతీయ పౌరులు, భారత సంతతికి చెందిన వ్యక్తులకు తెలిపింది. ఆకస్మిక తరలింపు లేదా అత్యవసర ప్రయాణానికి సిద్ధంగా ఉండాలని తెలిపింది. తక్షణ సహాయం కోసం రాయబార కార్యాలయం అత్యవసర సంప్రదింపు ఫోన్ నెంబర్లను, అధికారిక ఈ-మెయిల్ ఐడీని పంచుకుంది. హెల్ప్‌లైన్ నెంబర్లు 98-9128109115, 98-9128109109, 98-9128109102, 98-9932179359 కాగా, ఈ-మెయిల్ ఐడీ ఎశీఅర్.వప్త్రతీఖఅఎఎము.ఠ్రశీజ.ఱఅ లను పంచుకుంది. తదుపరి నోటీసు వచ్చే వరకు ఆ దేశానికి ప్రయాణం చేయవద్దని భారత విదేశాంగ శాఖ కూడా సూచించింది. విదేశాంగ శాఖ ఇంతకుముందు కూడా ఇలాంటి నోటీసు జారీ చేసింది.

## తప్పు చేయకపోతే ఎందుకు భయపడుతున్నారు?: సీపీ సజ్జనార్

**హైదరాబాద్:** ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధులు దొంతు రమేష్, సుధీర్‌ల అరెస్టుపై సీపీ స్పందించారు. "మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలి. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారు? పిలిస్తే.. విచారణకు రావాలి కదా. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారు. అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం. త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుంది. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి.సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోంది"అని సీపీ తెలిపారు.

## మళ్లీ చెప్తున్నా.. క్యారెక్టర్ అసాసినేషన్ చేస్తే సీరియస్ యాక్షన్

- మొదటి పేజి తరువాయి

చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని పేర్కొన్నారు.సోషల్ మీడియా పేరుతో ఎవరైనా వ్యక్తిత్వ హననం చేయడం, ఇతరుల శీలానికి భంగం కలిగించడం, క్యారెక్టర్ అసాసినేషన్‌కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తమ విధానంగా తెలియజేశానన్నారు. అలాగే ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్‌ను సర్కులేట్ చేసి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరో మారుస్పష్టం చేశారు.చట్టానికి లోబడి, నిర్మాణాత్మక విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డిజిపి అన్నారు .అయితే ఆ పరిమితులను దాటి, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ అబద్ధాలు ప్రచారం చేస్తే మాత్రం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

## మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు నమోదు

- మొదటి పేజి తరువాయి

కిరణ్ ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్?లో ఫిర్యాదు చేశాడు. రవికిరణ్ కంప్లైంట్ మేరకు ఎస్?ఆర్ నగర్ పోలీసులు తలసానిపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల సికింద్రాబాద్?లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న తలసాని సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌అబశ్రీశ్రీ డివిజన్ల పునర్విభజన పేరుతో సికింద్రాబాద్‌ను ముక్కలు చేయాలని చూస్తే నిన్ను ముక్కలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించారు. తలసాని కామెంట్స్ కాంట్రవర్సీగా మారాయి. కాంగ్రెస్ నేతలు ఈ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తలసాని బేషరతుగా సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పి ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తలసాని వ్యాఖ్యలపై పలువురు కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదస్పదంగా మారడంతో తలసాని వెనక్కి తగ్గారు. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. కేవలం ఆవేశంలో అలా మాట్లాడానని.. అందులో ఎలాంటి తప్పుడు ఉద్దేశం లేదని వివరణ ఇచ్చారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తులను తాను గౌరవిస్తానని అన్నారు.

## నోటీసులు ఇస్తే సరిపోతుంది కదా... ఇంత దౌర్జన్యం అవసరమా?

- మొదటి పేజి తరువాయి

అని కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. మంగళవారం రాత్రి రాష్ట్ర పోలీసులు ముగ్గురు జర్నలిస్టులను అపహరించారని, ఒకరి ఇంటి తలుపులు బద్దలుకొట్టి మరీ లోపలికి ప్రవేశించారని ఆరోపించారు.

కేవలం బెయిల్ ఇవ్వదగిన సెక్షన్లు ఉన్న కేసులో, బీఎన్ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు ఇస్తే సరిపోయేదానికి ఇంత దౌర్జన్యం అవసరమా అని ఆయన ప్రశ్నించారు. మీడియా, డిజిటల్ మీడియాపై ఈ తరహా అణచివేత ధోరణి ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనకు ఒక నమూనాగా మారిందని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

## మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ

పశ్చిమ బెంగాల్ లో కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీకి, సీఎం మమతా బెనర్జీ (టీఎంసీ)కి మధ్య వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఐ-ప్యాక్ సంస్థపై ఈడీ జరిపిన దాడుల్ని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అడ్డుకున్నారు. ఐ ప్యాక్ కార్యాలయానికి వెళ్లి మరీ.. కొన్ని డాక్యుమెంట్లను తనతో తీసుకెళ్లారు. దీంతో మమత చర్యకు వ్యతిరేకంగా ఈడీ.. కోల్ కతా హైకోర్టును ఆశ్రయించింది. మమత బెనర్జీ కీలక డాక్యు మెంట్లు తీసుకెళ్లి, నేరానికి పాల్పడ్డారని ఆరోపించింది. అయితే, ఈడీ ఆరోపణలను ఖండిస్తూ మమతా బెనర్జీకి చెందిన టీఎంసీ, ఐ-ప్యాక్ సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. తమ డాక్యుమెంట్లను ఈడీ అక్రమంగా తీసుకెళ్లిందని, తమ పార్టీకి సంబంధించిన అంతర్గత వివరాల్ని సేకరించాలనుకుందని టీఎంసీ ఆరోపించింది. తమ ప్రైవసీకి భంగం కలిగించాలని ఈడీ ప్రయత్నించిందని కోర్టుకు తెలిపింది. తమ వద్ద సేకరించిన డాటాను భద్రంగా ఉంచేలా ఆదేశించాలని కోరింది. తమ పార్టీ వివరాల్ని, ప్రణాళికల్ని బయటపెట్టాలని చూడటం సరికాదని తెలిపింది. అయితే, ఈ ఆరోపణల్ని ఈడీ కొట్టిపారేసింది. తాము ఎలాంటి డాక్యుమెంట్లు తీసుకెళ్లలేదని కోర్టుకు తెలిపింది. తమ చర్యల వల్ల టీఎంసీకి ఎలాంటి నష్టం లేదని కోర్టుకు తెలిపింది. ఇరువురి వాదనలు విన్న జస్టిస్ సువ్ర ఘోష్.. ప్రాథమిక సాక్ష్యాల ఆధారంగా టీఎంసీ పిటిషన్లను కొట్టివేశారు. ఈ అంశాన్ని సుప్రీం కోర్టులో తేల్చుకోవాలని సూచించారు.

# జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు..

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్,జనవరి 14:**తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన 'మకర సంక్రాంతి' పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ మను చౌదరి జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ సంక్రాంతి పండుగ ప్రతి ఇంట్లో సిరిసంపదలను, సుఖసంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. రైతు పండించిన పంట చేతికి వచ్చే ఈ పర్వదినం, పల్లెల్లో కొత్త వెలుగులు తీసుకురావాలని కోరారు.. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను మన ఆచార సాంప్రదాయ వ్యవహారాలకు అనుగుణంగా, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.. పండుగ ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని మరియు పర్యావరణహితమైన రంగులు, సాధారణ దారాలను ఉపయోగించాలని కోరారు.. నియంత్రించిన "చైనా మాంజాను" వాడకూడదని కలెక్టర్ సూచించారు.. జిల్లాలోని రైతాంగం అంతా పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుంటూ అభివృద్ధి పథంలో సాగాలని ఆకాంక్షించారు."ఈ మకర సంక్రాంతి జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, ఆరోగ్యాన్ని నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని కలెక్టర్ ఓ సందేశంలో పేర్కొన్నారు



మిక్కిలినేని మను చౌదరి..
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్..




# అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టును.. ఖండించిన టీయూడబ్ల్యూజే..

- నోటీసులు లేకుండా అరెస్టులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం: టీయుడబ్ల్యుజే..
- మేడ్చల్ జిల్లా కమిటీ అధ్యక్ష-కార్యదర్శి బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 14:**ఎన్టీవీకి చెందిన సీనియర్ జర్నలిస్టులు దొంతు రమేష్, పరిపూర్ణ చారి, సుధీర్‌లను అర్ధరాత్రి సమయంలో పోలీసులు అరెస్టు చేయడాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయుడబ్ల్యుజే) తీవ్రంగా ఖండించింది.. చట్టపరమైన నిబంధనలను పక్కనపెట్టి, ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను అరెస్టు చేయడం సమంజసం కాదని సంఘం స్పష్టం చేసింది.. టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొలెపాక వెంకట్ బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.. జర్నలిస్టులు లేదా మీడియా సంస్థలు అసత్యమైన లేదా నిరాధారమైన వార్తా కథనాలు ప్రచురిస్తే, సంబంధిత వ్యక్తులు ముందుగా ఖండన కోరుకునే అవకాశం ఉందని, ఆ తర్వాత కూడా స్పందన లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని టీయుడబ్ల్యుజే మేడ్చల్ జిల్లా కమిటీ పేర్కొంది. అయితే, ఆ ప్రక్రియను పాటించకుండా అర్ధరాత్రి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు, మీడియా స్వేచ్ఛకు విరుద్ధమని సంఘం అభిప్రాయపడింది..

అరెస్టు అయిన ముగ్గురూ జర్నలిజంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ జర్నలిస్టులని, వారిని తీవ్రవాదుల మాదిరిగా అర్ధరాత్రి పూట అరెస్టు చేయడం అనవసర ఉద్రిక్తతలకు దారి తీస్తుందని టీయూడబ్ల్యూజే హెచ్చరించింది.. అదే సమయంలో జర్నలిస్టులకు కూడా సంఘం ఒక బాధ్యతాయుత సూచనను కూడా సూచించింది.. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులకు సంబంధించిన అంశాల్లో ఆధారాలు లేకుండా వార్తలను ప్రసారం చేయకూడదని, వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే కథనాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీడియా సంస్థలదేనని జర్నలిస్టు సంఘం ఈ సందర్భంగా పేర్కొంది.. ఆధారాలతో కూడిన, నైతిక ప్రమాణాలకు లోబడి ఉన్న జర్నలిజమే సమాజానికి మేలు చేస్తుందని టీయుడబ్ల్యుజే స్పష్టం చేసింది.. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని, అరెస్టు చేసి

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న పంతుల సాయికుమార్ పటేల్..



మంత్రి శ్రీధర్‌బాబును శాలువాతో సత్కరించిన సాయికుమార్ పంతుల..



# హెచ్ఎంటి భూమిలో "వైఐఐఆర్ఎస్"..! పాఠశాలకు ప్రతిపాదన..!

## సాయికుమార్ విజ్ఞప్తికి.. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సానుకూల స్పందన..

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి ఈ ప్రతిపాదన కీలకం..
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలసిన సాయికుమార్ పటేల్..
- సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సాయికుమార్, 'వైఐఐఆర్ఎస్' ప్రస్తావన..
- జగద్గిరిగుట్ట లోని హెచ్ఎంటి స్థలంలో ఈ సమీకృత పాఠశాలకు ప్రతిపాదన..
- పేద, మధ్యతరగతి, వెనుకబడిన వర్గాలకు ఉచిత విద్యే లక్ష్యంగా ఈ ప్రతిపాదన..
- సానుకూల స్పందన తెలిపిన మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 14:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలకమైన అడుగు ముందుకు పడింది.. "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్" మంజూరుకై సాయికుమార్ పంతుల ప్రతిపాదన పెట్టారు.. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, మెడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు.. పంతుల సాయికుమార్ పటేల్ (ఎక్స్:ఎన్ఎస్‌యుఐ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ) మర్యాద పూర్వకంగా కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, ఈ "ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల"మంజూరు కోసం మంత్రితో ప్రస్తావించారు.. జగద్గిరిగుట్ట వైపు ఉన్న హెచ్ఎంటి అదనపు భూమిలో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్" మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నివసిస్తున్న పేద, మధ్యతరగతి, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు హాస్టల్ సదుపాయాలు, సమగ్ర అభివృద్ధి అందించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "వైఐఐఆర్ఎస్" పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రికి వివరించారు..



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుకు, హెచ్ఎంటి స్థలంపై వివరిస్తూ..

### ఈ ప్రాజెక్టు "హెచ్ఎంటి స్థలం" అనుకూలం..

కుత్బుల్లాపూర్-జగద్గిరిగుట్ట మధ్యలో ఉన్న "హెచ్ఎంటి" అదనపు భూమి ఈ విద్యా ప్రాజెక్టుకు పూర్తిగా అనుకూలమని, భవిష్యత్ తరాలకు బలమైన విద్యా పునాది వేయగలదని సాయికుమార్ పంతుల అభిప్రాయం వ్యక్తం చేశారు.. నియోజకవర్గం అభివృద్ధిలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని మంత్రికి ప్రతిపాదనలు చేశారు. దీనిపై స్పందించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల" మంజూరుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు సాయికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో క్రాంతి, సంతోష్, రఘు, భరత్, కుమార్ శర్మ తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# సంక్రాంతి వచ్చింది... సందడి తెచ్చింది



## నేడే పెద్ద పండుగ.. తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సంబరాలు..!!



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాలకు అతిపెద్ద పండుగగా పేరొందిన సంక్రాంతి నేడు వైభవంగా జరుపుకుంటున్నారు. సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే పుణ్య ఘడియతో భోగభాగ్యాలు కలుగుతాయని హిందువుల విశ్వాసం. పంటలు కోసి ఇంటికి చేరే సమయమే కావడంతో సంక్రాంతి రైతుల పండుగగా ప్రత్యేక గుర్తింపు పొందింది. కష్టపడి పండించిన పంట ఫలితాన్ని ఆనందంగా ఆస్వాదించే సందర్భమే ఈ పండుగ.

గ్రామాల్లో రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసుల కీర్తనలు పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చేస్తాయి. పిల్లలు గాలిపటాలు ఎగరేస్తూ సంబరాల్లో మునిగిపోతారు. ఇళ్లల్లో అరిసెలు, సకినాలు, బూరెలు, పాయసం వంటి పిండి వంటకాలతో సువాసనలు వెదజల్లుతాయి. పెద్దలుచిన్నలు అన్న తేడా లేకుండా అందరూ కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవడం సంక్రాంతి ప్రత్యేకత.సంక్రాంతి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, ఇది కుటుంబ బంధాలను బలపరుస్తుంది. పట్టణాల్లో ఉద్యోగాలు,

చదువుల కోసం దూరమైనవారు స్వగ్రామాలకు చేరుకుని బంధువులతో కలిసి సంబరాలు చేసుకుంటారు. ఇది ఆనందం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది.తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతిని మూడు రోజులపాటు జరుపుకుంటారు. భోగి, సంక్రాంతి, కనుమ అనే పేర్లతో ప్రతి రోజు ప్రత్యేక సంప్రదాయాలు ఉంటాయి. దేశవ్యాప్తంగా ఈ పండుగను పొంగల్, లోహ్రీ, మాఘ్ బిహు వంటి పేర్లతో జరుపుకుంటున్నారు. పేరు మారినా భావం ఒక్కటేప్రకృతికి కృతజ్ఞత, శ్రమకు ఫలితం, ఆనందానికి ఆరంభం. అందుకే సంక్రాంతి ప్రతి ఇంట్లో వెలుగులు నింపే మహాపండుగగా నిలుస్తోంది.



# సహజ సంపద కార్పొరేట్ల కోసమేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:**"భూమిపై ఉన్న వనరులను ఎంత కొల్లగొట్టి వినియోగిస్తే అంత ఆర్థిక ప్రగతి అనే ప్రచారం భారీ ఎత్తున చేయడం, వాటి గురించి స్థానిక దినపత్రికల్లో గంభీరమైన మాటలు మాట్లాడటరౌ సమావేశాల్లో ప్రభుత్వ కమిటీల ముందు భారీ ప్రజంటేషన్లు, ఆర్థిక నివేదికలూ ప్రదర్శించడం ద్వారా సహజ వనరులను దోచుకునే మార్గాన్ని సుగమం చేసుకోవడం మా పని, ఒకవేళ మా పనిలో విఫలమైతే మా బాధ్యతను తోడేళ్లు అని పిలవడబడే మరొక ఏజెంట్లు తీసుకుంటారు అంటూ ప్రపంచబ్యాంకు నియమిత ఆర్థికవేత్త జాన్ పెర్కిన్స్ ఒక దళారీ పశ్చాత్తాపంలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో సహజవనరులను పరిశ్రమల పేరుతో ఎలా కొల్లగొడతారో క్షుణ్ణంగా వివరించారు. 2006లో తెలుగులో ముద్రితమైన ఈ పుస్తకంలో అప్పటి అమెరికా కంపెనీ తరుపున తోడేలుగా పనిచేసి పశ్చాత్తాపంతో జాన్ పెర్కిన్స్..ఇలా బయటపెట్టారు. వరల్డ్‌బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు చేస్తున్న దురాక్రమణల్లో ఎపి కూరుకుపోయిందా ? అంటే అవుననే అనుమానం కలుగక మానదు. ఈ సంస్థల కుట్రల్లో ఎపి అత్యంత వేగంగా భాగస్వామి అవుతోంది. పెట్టుబడుల పేరుతో విలువైన సహజ వనరులను దోచుకోవడం, ఆహార పంటలు పండే భూములను అభివృద్ధి, పట్టణీకరణ పేరుతో ప్రభుత్వాలు లాక్కోవడం భూములను నానశం చేయడం, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం వంటివి చకచకా జరిగిపోతున్నాయి. వాటికి అభివృద్ధి, ఉపాధి అనే ట్యాగ్ లైన్లు తగిలించి ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా చేసుకుపోతున్నాయి. ఇచ్ఛాపురం నుండి తడ వరకూ, చిత్తూరు నుండి బెంగుళూరు వరకూ ఒకసారి పరిశీలన చేస్తే ఈ విషయం స్పష్టంగా కనపడుతుంది. ఓడరేవులు, రహదారులు, ప్రాజెక్టులు, భారీ వ్యాపార సముదాయాలు, పర్యాటక ప్రాజెక్టులు, క్రీడా సముదాయాలు, విద్యుత్ తయారీ సంస్థలు ఇవన్నీ కూడా వారు చెప్పే అభివృద్ధిలో భాగంగా కనిపిస్తుంటాయి. కానీ ఉపాధి అనేది కనిపించదు. గ్యారంటీ లేని ఉపాధి పేరుతో పంటలు పండే, తిండిపెట్టే భూములను కొద్దిమందికి ఎందుకు కట్టబెడతారు అని ప్రశ్నిస్తే అటువంటి వారిపై కేసులు పెట్టి జైళ్లలో పెడతారు. అనకాపల్లి జిల్లాలో సిపిఎం నాయకులు అప్పలరాజుపై పిడి యాక్టు కూడా ప్రపంచబ్యాంకు నియమిత పిఎంసిలు చేసిన సూచన మేరకే జరిగిందనేది వాస్తవం. విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి పేరుతో ఉన్న స్టీలు ప్లాంటును నాశనం చేసి ప్రైవేటు స్టీలు ప్లాంటుకు భూములు అప్పగించారు. అదే మిట్టల్ స్టీల్. ఇదో మల్టీనేషనల్ కంపెనీ. దీనికి పోర్టు కేటాయించాలి, అదే ప్రాంతంలో ఫార్మాస్యూటికల్స్, అదానీ, అంబానీ వంటి కంపెనీలకూ భూములు కట్టబెడుతున్నారు. వాటిని ప్రశ్నించింది అప్పలరాజు. ప్రజలను సమీకరిస్తున్నారు. ఆయన రైతు సంఘం నాయకులు కూడా. అప్పలరాజు అటు జైల్లోకి వెళ్లడం ఇటు నక్కపల్లి వద్ద పోర్టుకు భూములు కేటాయించడం, క్యాబినెట్ ఆమోదించడం చకచకా జరిగిపోయాయి. పరిశ్రమల పేరుతో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో భూములను భారీగా లాగేసుకుంటున్నారు. ఇప్పుడు అన్నపూర్ణగా పిలిచే కోనసీమ జిల్లాకూ దీన్ని విస్తరించారు. అంటే మరో పదేళ్లలో రాష్ట్రం ఆహార సంక్షోభం దిశగా నడిచే పరిస్థితి కనిపిస్తోంది. దీనివల్ల నష్టపోయేది చిక్కిపోయిన పేద ప్రజలే. దీన్ని ప్రశ్నించకుండా ఉండటం కోసం అక్కడ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీలు అంటే ప్రపంచబ్యాంకు కనుసన్నల్లో పనిచేసేవి ఇచ్చే నివేదికల ఆధారంగా ప్రభుత్వాలు అత్యంత వేగంగా చర్యలు తీసుకుంటున్నాయి. అడ్డొచ్చినవారిని ఏదో ఒకరూపంలో తప్పించేయడం, కాదనుకుంటే ఎరవేయడం, దీనికోసం స్థానికంగా కార్పొరేట్ నిధులతో నడిచే మీడియా సంస్థల ద్వారా అభివృద్ధి అనే ప్రచారం పేరుతో ప్రజలను మభ్యపెట్టడం ఇవన్నీ క్రమ పద్ధతిలో జరిగిపోతుంటాయి. పరిశ్రమల పేరుతో భూములు లాక్కోవడం ఒకెత్తయితే ఆహారం కోసం ప్రపంచబ్యాంకు నిర్దేశిత దేశాలపై ఆధారపడటం, దీనికోసం ఆర్థికంగా నష్టపోవాలంటే అక్కడ ఆయా దేశాల్లో ఆహార పంటలను దెబ్బతీయడం, సువిశాల సహజ వనరులను కొల్లగొట్టడం ఇవన్నీ వరుసక్రమంలో జరుగుతుంటాయి. ఇదే సమయంలో ప్రకృతి సేద్యం పేరుతో ప్రపంచబ్యాంకు ప్రోత్సాహక స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం నిర్వహించడం, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని వారి అనుబంధ సంస్థలతో ఆరోగ్య పరమైన సలహాల పేరుతో క్లాసులు చెప్పించి ప్రజల ఆలోచనలు మార్చడం ఒవన్నీ కూడా ఒక పద్దతి ప్రకారం జరిగిపోతుంటాయని జాన్ పెర్కిన్స్ తన రచనలో పేర్కొన్నారు. మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కోనసీమ, దివిసీమ, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు ఇలా చూసుకుంటూ పోతే ప్రతిజిల్లాలోనూ ఒక్కో పంట ప్రత్యేకత కనిపిస్తుంది. సారవంతమైన నేలలూ ఉన్నాయి. ఎక్కడిదాకా ఎందుకు అమరావతి నిర్మిస్తున్న ప్రాంతం సశ్యశ్యామలమైన ప్రాంతం, పక్కనే మెట్టభూములు ఉన్నాయి. వాటిని వదిలేసి పంటలు పంటే చోటే నగరాన్ని ఏర్పాటు చేయాలనుకున్నారు. ఏమైంది ఆహార పంటలు లేకుండా పోయాయి. దానికి అనుకున్న ప్రాంతం మొత్తం రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిసి సాగుతగ్గిపోయింది. కరేడు అంతే పక్కనే పనికిరాని భూమి ఉంటే కరేడులోనే విద్యుత్ కేంద్రానికి భూములు కేటాయించారు. త్వరలో కోనసీమ జిల్లాకు ఇది పాకుతుంది. ఉత్తరాంధ్రలో జీడిమామిడి తోటలు. వరి, చిత్తూరులో మామిడి, కడప, కర్నూలు, అనంతపురంలో అరటి వేరుశనగ ఇలా చూసుకుంటూ పోతే పరిశ్రమలన్నీ పంటలు పడే చోటే పెడుతున్నారు. నిజంగా పంటలు పంటని భూములు చాలా ఉన్నాయి. అంటే ఒక పద్ధతి ప్రకారం రాష్ట్రంలో సహజవనరులు ఒకరిద్దరి చేతుల్లోకి పోతున్నాయి. విద్యుత్ ప్రాజెక్టులు, పోర్టులు, రహదారుల పేరుతో పంటలు పండే భూములన్నీ నాశనం అవుతున్నాయి. ఆర్థికంగా ఇబ్బందులూ పెరుగుతున్నాయి. మరి రాష్ట్రంలో ప్రజలు ఎలా బతకాలి అనేది అతిపెద్ద ప్రశ్నగా ఇప్పుడు మన కళ్ల ముందు కనిపిస్తోంది.

# ఆంధ్రా భీష్మాచార్యులు

**హైదరాబాద్ పెన్ పవర్:**చికాగో సర్వధర్మ సమ్మేళనంలో పాల్గొని, భారతదేశానికి తిరిగి వచ్చిన స్వామి వివేకానంద యోగి పుంగవుడు మద్రాసు రేవులో కాలిడగానే ఆయనను పూల మాలాలంకృతుల గావించి సాదరంగా ఆహ్వానించే అవకాశాన్ని పొందిన వ్యక్తి న్యాపతి సుబ్బారావు. అంతేకాదు... వివేకానందుని ఆహ్వాన సభకు అధ్యక్షత వహించిన అరుదైన గౌరవం దక్కించుకున్న అదృష్టవంతులు ఆయనే. భారతదేశములో ఒక విశిష్ట స్థానం కలిగి, దక్షిణ భారత దేశములో ఎక్కువ ప్రచురణ కలిగిన పత్రికగా, ప్రాచుర్యంలో ఉన్న ది హిందూ ఆంగ్ల దినపత్రికకు పత్రికను స్థాపించి ఇప్పటికి సుమారు 120 సంవత్సరాలు దాటింది. ఈ పత్రిక ఎలా ప్రారంభించ బడింది అంటే...తిరువయ్యారుకు చెందిన 23 ఏళ్ళ జి. సుబ్రమణియ అయ్యర్, ఆయన స్నేహితుడు, పచ్చయ్యప్ప కళాశాలలో ఆయన సహోద్యోగి, చెంగల్పట్టుకు చెందిన 21 ఏళ్ళ ఎం. వీరరాఘవా చారియర్ – నలుగురు న్యాయ శాస్త్ర విద్యార్థులు టి.టి. రంగాచారియర్, పి.వి. రంగా చారియర్, డి.కేశవ రావు పంత్, న్యాపతి సుబ్బారావు పంతులు (హిందూ స్థాపకుల్లో ఆంధ్రుడు) – వీళ్ళందరూ ట్రిప్లికేన్ సాహితీ సంఘం సభ్యులు. ఈ సంఘం అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ నిరంకుశ వైఖరుల గురించి ప్రజలకు అవగాహన కలిగించడం, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టడం లక్ష్యాలుగా ఏర్పడింది. ట్రిప్లికేన్ సిక్స్ అని పేరుబడ్డ ఆ ఆరుగురు యువకులు మొదట న్యూస్‌పేపర్ అనే సైక్లోస్టైల్ పక్షపత్రికను ప్రారంభించారు. చెన్నైలో ఆ పత్రికకు మంచి స్పందన లభించడంతో హిందూను వారపత్రికగా ప్రచురించడం మొదలు పెట్టారు. ది హిందూ పత్రిక స్థాపన సెప్టెంబర్ 20, 1878న జరిగినట్లు పేర్కొంటారు. అలా ది హిందూ ఆంగ్ల పత్రిక స్థాపనలో ఒక తెలుగు వారు ఉండడం విశేషం. ఏ ఐ సీ సీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు పని చేశారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆంధ్ర భీష్మ బిరుదాంకితులు, ప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధుడు, సంస్కరణవాది, సాహిత్యవేత్త, పాత్రికేయుడు, న్యాపతి సుబ్బారావు పంతులు (1856, జనవరి 14 – 1941, జనవరి 15) మకర సంక్రాంతి రోజున నెల్లూరులో రాఘవరావు, రంగమ్మ దంపతులకు జన్మించారు. ఆ తరువాత కుటుంబం రాజ మండ్రికి మారింది. బాల్యం నుండే సుబ్బరావు విషయ పరిజ్ఞాన సముపార్జన పట్ల అమిత జిజ్ఞాస కలిగి ఉండి పేదరికం కారణంగా వీధిలాంతర్ల మసక వెలుతులో చదువు కొనసాగించారు. మెట్రిక్యు లేషన్ పాస్ అయ్యి అనంతరం మద్రాసు క్రైస్తవ కళాశాలలో చేరి స్కాలర్‌షిప్ సహాయంతో చదువుకుని 1876లో బిఏ డిగ్రీ పొందాడు. అనంతరం అధ్యాప కునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. బోధనా వృత్తిలో కొనసాగుతూనే న్యాయవాద విద్యను అభ్యసించి 1879లో లా పట్టాను పొందాడు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ న్యాయవాద పట్టాను పొందటం అప్పట్లో అరుదైన విషయం. ఈ ఖ్యాతిని సాధించిన దక్షిణ భారత దేశం లోని అతి కొద్దిమందిలో ఒకరిగా కోస్తా జిల్లాల్లో తొలి వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు. న్యాయ విద్యార్థిగా ఉండగానే 22 ఏళ్ళ ప్రాయంలో ఆయన ట్రిప్లికేన్ సిక్స్‌గా పిలువబడే నాటి సాహిత్య సంఘం సభ్యులు మరో ఐదుగురు సభ్యుల మిత్ర బృందంతో కలసి, జాతీయో ద్యమానికి సహకరించే ఉదాత్త లక్ష్యంతో, ది హిందూ జాతీయ ఆంగ్ల దినపత్రికను స్థాపించారు. అప్పట్లో భారత దేశంలో ప్రచురిత మయ్యే ఆంగ్ల పత్రికలన్నీ బ్రిటీష్ ప్రభుత్వం కనుసన్నలలోనే ఉండేవి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో సుబ్బా రావు గౌరవ న్యాయమూర్తి గా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. 1880లో న్యాపతి సుబ్బారావు మద్రాసు నుంచి రాజమండ్రి తిరిగివచ్చి అక్కడే స్థిరపడ్డారు. మరో 9 మంది న్యాయ వాదులతో కలిసి రాజమండ్రి బార్ అసోషి యేషన్ స్థాపించారు. రాజమండ్రిలో సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగంతో సన్నిహితంగా మెలగేవారు. వితంతు పునర్వి వాహాలు జరిపించడంలో వీరేశలింగానికి సుబ్బారావు పంతులు ఎంతగానో సహక రించారు. 1881లో స్థాపితమైన హితకారిణి సమాజం యొక్క మొదటి కార్యదర్శిగా నియమించ బడి నిర్వహణలో, కార్యకలాపాల విస్తరణలో విలువైన సేవలందించారు. 1885లో రాజమండ్రి పురపాలక సంఘానికి తొలి అనధికార ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1888 వరకూ ఆయన ఆ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే రాజమండ్రి ప్రజలకు తొలిసారి నళ్ళాల కనెక్షన్లు మంజూరు చేశారు. 1893లో ఆయన మద్రాసు ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు సభ్యునిగా ఎన్నికై సర్కారు జిల్లాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ పదవిలో ఆయన వరుసగా మూడు పర్యాయాలు ఎన్నికై 1899 వరకు కొనసాగారు. 1896లో ఆయన రాజమండ్రి లోని టౌన్ హాల్ ట్రస్టుబోర్డు కమిటీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కలకత్తాలోని టౌన్ హాలు తర్వాత దేశంలో అంతటి ప్రాముఖ్యత రాజమండ్రి టౌన్ హాల్‌కు ఉంది. దీనిని కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపించటం వెనుక న్యాపతి వారి సహకారం ఎంతో ఉంది. సుబ్బారావు పంతులు రాజమండ్రి ఎలక్ట్రిక్ సప్లై కార్పొరేషన్‌ను స్థాపించి, విద్యుదు త్పాదన చేయడమే కాక తొలిసారిగా రాజమండ్రికి ఆ విద్యుత్ ను సరఫరా చేసి వెలుగులు నింపాడు. 1893లో ఆయన రాజమండ్రిలో చింతామణి పత్రికను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటు లోకి తెచ్చారు. ఈ పత్రికకు కందుకూరి వీరేశలింగం పంతులు ఎడిటర్‌గా వ్యవహ రించారు. రచయితల్ని ఆర్థికంగా ప్రోత్సహించటం లక్ష్యంగా సుబ్బా రావు పంతులు నవలారచన అంశంగా వివిధ పోటీలు నిర్వహించే వారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం రచనా వ్యాసంగానికి సుబ్బారావు నైతికంగా, ఆర్థికంగా ఎంతో సహకరించారు. అదేవిధంగా హరికథ పితామహ ఆదిభట్ల నారాయణ దాసును రాజమండ్రి, పరిసర ప్రాంతాలకు పరిచయం చేసినది కూడా ఆయనే. 1922 ప్రాంతంలో రాజమండ్రిలో ఆంధ్ర చారిత్రక పరిశోధనా సంస్థ (ఇప్పుడు రాళ్ళబండి సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాలగా ఉన్నది) ఏర్పాటును న్యాపతి సుబ్బారావు పంతులు ఎంతగానో ప్రోత్సహించారు. 1897, ఫిబ్రవరి11న స్వామి వివేకానంద అంతర్జాతీయ మతాల సమావేశంలో ప్రసంగించి భారత దేశం తిరిగివస్తున్న సందర్భంలో ట్రిప్లికేన్ సిక్స్ మిత్రబృందం ఆయన్ను ఆహ్వానించ డానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున పురజనులు హాజరైన ఆ సమావేశంలో వివేకానందుని ఆహ్వాన సంఘానికి న్యాపతి సుబ్బారావును అధ్యక్షునిగా నియమించారు. వివేకానందుడు మద్రాసు రేవులో దిగగానే పూలమాల వేసి ఆహ్వానించిన తొలి వ్యక్తి సుబ్బారావే. ఆ మరు సటి రోజు విక్టోరియా హాల్లో వివేకానందునికి ఆహ్వాన సభ ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి14న మెరీనా బీచ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వివేకానం దునితో పాటు సుబ్బారావు పంతులు వేదికను అలంకరిం చారు. అలా ప్రారంభమైన వీరి స్నేహం సుబ్బా రావుపై గాఢమైన ప్రభావాన్ని వేసింది. 1903లో వివేకానందుని స్ఫూర్తితో, సుబ్బారావు రాజమండ్రి లో భగవద్గీత, సనాతన హిందూధర్మ ప్రచారానికై, హిందూ సమాజం అనే సంస్థను స్థాపించారు. 1898 నుంచి 1917 వరకూ భారత జాతీయ కాంగ్రెస్‌లో ఆయన కీలకమైన భూమికను పోషించారు. 1907లో వందేమాతర ఉద్యమ సందర్భంగా బిపిన్ చంద్రపాల్‌ను రాజమండ్రి ఆహ్వానించి అక్కడ ఉపన్యాసాలు ఇప్పించారు. విజయ వాడలో 1914 ఏప్రిల్ 11వ తేదీన జరిగిన రెండవ ఆంధ్ర మహాసభకు ఆయన అధ్యక్షత వహిస్తూ, మద్రాసు నుంచి ఆంధ్ర రాష్ట్ర విభజన కోసం చారిత్రాత్మకమైన పిలుపు నిచ్చారు. 1918 జనవరి 1వ తేదీన సుబ్బారావు పంతులు డిమాండ్ మేరకు ఆంధ్రప్రాంతానికి ప్రత్యేక ప్రాంతీయ కాంగ్రెస్ కౌన్సిల్‌ను అధిష్టానం ఏర్పాటు చేసింది. ఈ మండలికి న్యాపతి సుబ్బారావు పంతులు అధ్యక్షుడ య్యారు. అంతేగాక ఆయన అఖిలభారత కాంగ్రెసు కమిటీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు ఎన్నికై సేవలందిం చారు. సుబ్బారావు పంతులు 1941, జనవరి 15వ తేదీన మరణించారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి తాతా రమేశ్ బాబు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆయన ప్రజ్ఞ అసామాన్యం. కృషి అనితర సాధ్యం. తెలుగు రచయితగా, తెలుగు సినిమా ఆర్ట్ డైరక్టరుగా, సంపాదకుడుగా, చిత్రలేఖనోపాధ్యాయుడుగా ఏ పని చేసినా అంకిత భావంతో, చిత్తశుద్ధితో, లక్ష్యంతో చేసేవారు. పగటి వేషాలు వేసినా, చిత్రాలను గీసినా, గేయాలు రాసినా, సంపాద కత్వం వహించినా, ప్రసంగాలు చేసినా, విద్యార్థులకు శిక్షణలు ఇచ్చినా, వారిలో సృజనాత్మకత పెంపొందించే కృషి సల్పినా పనిలో లీనమై చేసేవారు. తాతా రమేశ్ బాబు(1960 జనవరి 15 – 2017 ఏప్రిల్ 20) గుంటూరు జిల్లా భట్టిప్రోలు గ్రామంలో 1960 జనవరి 15 వ తేదీన బసవలింగం, బోలెం లక్ష్మీనరసమ్మ దంపతులకు జన్మించారు. ఆయన బాల్యం అంతా కృష్ణా జిల్లా లోనే గడచింది. ఉయ్యూరు, కైకలూరు, మొవ్వ, అవనిగడ్డ లలో తొమ్మిదవ తరగతి వరకూ చదువు కున్నారు. పదవ తరగతి మచిలీపట్టణం జైహింద్ హైస్కూల్ లోనూ, ఇంటర్మీడియట్, డిగ్రీలను ఆంధ్ర జాతీయ కళాశాల లోనూ చదువుకున్నారు. డిగ్రీ ఆఖరి సంవత్సరంలో వుండగా మద్రాసు సినీ పరిశ్రమకు అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా వెళ్ళవలసి వచ్చింది. అందువల్ల డిగ్రీ పూర్తి చేయలేక పోయారు. ఆయనకు చిన్ననాటి నుండి లలిత కళలు అన్నా, ఆటలు అన్నా చాలా ఇష్టం. అయిదారు తరగతుల్లో ఉన్నప్పు డు ఆయన ఈ బాలగేయం రాశారు. ఆ సమయంలోనే "బాల జ్యోతి"లో ఆయన గేయాలు కొన్ని అచ్చయ్యాయి. ఆ వయసులోనే బొమ్మలంటే చాలా ఇష్టం కలిగింది. వేద్దామంటే ఇంట్లో కుంచెల్లాంటివి ఏమీ ఉండేవి కావు. ఓ కర్రతో బొమ్మలు గీసేవారు. అలా చిత్రకళపై పట్టు పెంచుకున్నా ఇప్పటి వరకూ ఆధునిక పద చిత్రాలు, సూక్ష్మచిత్రాలు, 'అభినందన సందేశాల చిత్రాలు... అన్నీ కలిపి లక్షల్లో గీశారు. ఆయన పదవ తరగతి నుంచే గేయాలు రాయటం, నాటకాలు వేయటం మొదలు పెట్టారు. ఆయన రచనలు చాలా దిన, వార పత్రికలలో ప్రచురించ బడేవి. ప్రచురింపబడిన ఆయన పుస్తకాలు, అణువు పగిలింది (కవిత్వం), పిడికిలి (దీర్ఘ కవిత), తాతా రమేశ్ బాబు కథలు, విప్లవ రుతువు (కవిత్వం), తోలిగీతలు, దిద్దు బాటు (బొమ్మలాట), తయారు చేద్దాం (క్రాఫ్ట్ వర్క్), అసలు నిజాం (బొమ్మలాట), నాన్నో పులి (బొమ్మలాట), బొమ్మలాట (బొమ్మలు తయారు చేసి ఆడించటం), శుభాకాంక్షలు (అభినందన పత్రాలు), లయ (ఆకాశవాణి సమీక్షలు), నా దేశం (దీర్ఘ కవిత), తాతా రమేశ్ బాబు చిత్రకళ, బాలబంధు బివి జీవిత చరిత్ర. 2005వ సంవత్సరంలో మచిలీ పట్టణం నుండి వెలువడిన 'జనప్రభ' సాహిత్యమాస పత్రికకు ఆయన సంపాదకుడిగా వ్యవహ రించారు. 2006వ సంవత్సరంలో జాతీయ తెలుగు రచయితల మహాసభలకు ముఖ్య కార్యకర్తగా సేవలను అందించటమే కాక, ఆంధ్ర ప్రదేశ్ అవతరణ స్వర్ణోత్సవాల నేపథ్యంలో యాభై ఏళ్ళ తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య వికాసాల సమీక్షగా వెలువడిన నూట పన్నెండు వ్యాసాల సంకల నం 'తెలుగు పసిడి' గ్రంథనికి ఉప సంపాదకునిగా ఉన్నారు. అలాగే 2007 సంవత్సరంలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో ముఖ్య కార్యకర్తగా సేవలను అందించారు. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల నేపథ్యంలో వివిధ రంగాలలో తెలుగువారి అరవై ఏళ్ళ ప్రగతి సమీక్షగా వెలువడిన 213 వ్యాసాల సంకలనం 'వజ్ర భారతి ' ఉద్గ్రంధానికి సంపాదక వర్గంలో ఉన్నారు. చిన్నప్పటి నుంచే ఆయనకు నాటకాలంటే ఇష్టం. నటన మీద ఇష్టంతో టీవీ ధారావాహికలు, చలనచిత్రాల్లో నటిస్తున్నా ఆయనకు నాటకాలతో అనుబంధం వల్లే జానపద కళల మీద ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా 'పగటి వేషాలు' అంటే చాలా ఇష్టం. పగటి వేషమంటే పగలు ధరించే మారురూపం. అర్జునుడు బృహన్నలగా, వేంకటేశ్వరుడు ఎరుకల సానిగా మారురూపాలు ధరించి ప్రశంసా పాత్రులు అయినారు. చదువురాని 'గొల్లబోయ'. 'వితంతువు' తదితర వేషాలు సామాజిక చైతన్యాన్ని రగిల్చాయి. ఆయన రంగస్థలం మీద "ఫలించని వంచన" నాటికలో కథనాయికగా, "ఏక్ దిన్ కా సుల్తానులో మీసాల వెంకటరత్నంగా "మనుష లొస్తున్నారు జాగ్రత్త"లో రెడ్డి గా, "క్రాంతి"లో రామారావుగా, "ది ఇన్సిడెంటులో బ్రాహ్మణుడుగా, "తాకట్టు"లో జ్ఞానేశ్‌గా, "కీర్తిశేషులు" నాటకంలో మురారిగా, ఆకాశవాణి, విజయవాడ కేంద్రంలో "రాంబాబు కాపరం"లో రాంబాబుగా, జాతీయ నాటకం నాదయోగిలో రామ రాయుడిగా , "అపూర్వ నరకం"లో తమిళ అయ్యరుగా, హైదరాబాద్ దూరదర్శన్‌లో "మొదటికే మోసం" బొమ్మలాటలో పప్పెట్‌గా, "సంసారం సాగరం" మెగా సీరియల్‌లో మంత్రగాడుగా, మినీ మూవీలో గంగిరెడ్డిగా, లయ సీరియల్‌లో వెంకటరావుగా, అబ్బాయి ప్రేమలో పడ్డాడు చలన చిత్రంలో గుండు అనుచరుడుగా నటించారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి తొలి రంగుల సినిమా బొమ్మలాటనూ వివిధ భారతిలో ఇవ్వటం, పగటి వేషాలు, సామాజిక ప్రయోజనం అనే అంశం మీద మూడు వారాల ధారావాహిక ప్రసంగాలు, గుడివాడ నాటక రంగం మీద మూడు వారాల ప్రసంగాలు ఇచ్చారు. గుడివాడ పురపాలక సంఘ అడుసుమిల్లి ఉన్నత పాఠశాలలో చిత్రకళ ఉపాధ్యాయునిగా 1985 నుండి పనిచేసి, సాంకేతిక విద్యలు నేర్పిస్తూ విద్యార్థులను ఉత్యాహ పరుస్తూ నూతన దృక్పథన్ని ప్రేరేపించారు. ఇందుకు ఆయన తన సొంత డబ్బును సమకూర్చి, స్క్రీన్ ప్రింటింగ్, ఫోటో లామినేషన్, పెయింటింగ్స్, పప్పెటరీ విద్యను బోధిస్తూ, ఒక కొత్త పద్ధతిలో బొమ్మలు వేయడం ద్వారా పిల్లలకు డబ్బు సంపాదించే మార్గాన్ని నేర్పించారు. పిల్లలతో బొమ్మలను తయారు చేసి, పప్పెట్ షోలను ఇప్పించడం స్వీయధనంతో తాతా రమేష్ బాబు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయ సంస్థ ఆర్థిక సమతా మండలి, శ్రీకాకుళంలో .కొన్ని వందల మంది బాలబాలికలకు, అంగన్వాడి కార్యకర్తలకు, నమూనాలు తయారు చేయటం, స్క్రీన్ ప్రింటింగ్, మొదలయిన అనేక కళలలో సృజనాత్మక శిక్షణ ఇచ్చారు. అయిదు లక్షలకు పైగా అభినందన పత్రాలు, సూక్ష్మ చిత్రాలు, నీటి తైల వర్ణ చిత్రాలు చిత్రించారు. తాతా రమేశ్ బాబు వివిధ సీరియళ్లలో నటించారు. ఆడది, సంసారం–సాగరం, లయ, ఎదురీత, గంగతో రాంబాలు, అడవిపూలు, శ్రావణ సమీరాలు, మూగ మనసులు, అమ్మనా కోడలా, ప్రియమైన శత్రువు, అగ్నిపూలు, ఆకాశమంత, జాబిలమ్మ, రాములమ్మ, పాపం పద్మనాభం, ఇద్దరు అమ్మాయిలు, రాణివాసం, మనసు–మమత, అలక నంద, ఇది ఒక ప్రేమకథ, రియల్ డిటెక్టివ్స్, తాళికట్టు శు భవేళ, ఆడువారి మాటలకు అర్థాలు వేరులే తదితరాలతో నటించారు.

# అభేద్యం మన ఇండియన్ ఆర్మీ

**హైదరాబాద్ పెన్ పవర్:**అత్యంత ధైర్యసాహసాలకు, అలుపెరుగని పోరాట పటిమకు, సాహసోపేత త్యాగమయ జీవితాలకు, ఉరకలెత్తే దేశభక్తి ఉత్సాహానికి, భరతమాత రక్షణకు కంకణం కట్టుకొని ప్రాణత్యాగం చేయడానికి నిలువెత్తు చిరునామా మన ఇండియన్ ఆర్మీ శక్తివంతమైన బలగాలు. 1895లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఏర్పాటు చేసిన "బ్రిటీష్ ఈస్ట్ ఇండియా భారత ఆర్మీ", తదుపరి వలస పాలన సమయంలో 'బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ' కొనసాగి, స్వాతంత్ర్యానంతరం "ఇండియన్ ఆర్మీ"గా రూపాంతరం చెందింది. దేశ రక్షణతో పాటు మానవీయ సంక్షోభ సమయాల్లో అంతర్గత శాంతి స్థాపనకు అమూల్య సేవలను అందిస్తున్న ఇండియన్ ఆర్మీ తొలి కమాండర్–ఇన్–చీఫ్ బాధ్యతలను ఫీల్డ్ మార్షల్ కె ఎం కరియప్ప 15 జనవరి 1949 శుభగడియల్లో నాటి బ్రిటీష్ జనరల్ ఫ్రాన్సిస్ బుచ్చర్ నుండి తీసుకోవడం జరిగింది. ఈ అపూర్వ శుభ సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 15 జనవరి రోజున మన త్రివిధ రక్షణ బలగాలు "ఇండియన్ ఆర్మీ దినోత్సవం" ఘనంగా నిర్వహించకపోవడం ఆనవాయితీగా మారింది. అభేద్యమైన మన ఇండియన్ ఆర్మీలో 49,932 మంది అధికారులతో కలిపి 12,37,127 మంది సైనిక సిబ్బంది, 9,60,000 మంది రిజర్వ్ సిబ్బంది నిరంతరం దేశ భద్రత, అంతర్గత శాంతి స్థాపన బాధ్యతలను పరమ పవిత్ర భావనలతో నిర్వహిస్తున్నది. "సేవ పరమో ధర్మః(సేవయే అత్యుత్తమ ధర్మం)" అనే నినాదంతో దేశానికి ముళ్ల కంచెలుగా నిలబడి దేశ భద్రతను కాపాడే బాధ్యతలను భుజాన వేసుకొని నిర్వహిస్తున్న ఇండియన్ ఆర్మీకి సుప్రీమ్ కమాండర్‌గా రాష్ట్రపతి, చీఫ్ ఆఫ్ ఆర్మీగా అత్యున్నత ఆర్మీ అధికారి నాయకత్వ బాధ్యతలను నిర్వహిస్తారు. దేశ భద్రతకు ముప్పు వచ్చిన ప్రతి సందర్భంగా యుద్ధభూమిలో ముందుండి శత్రు సైన్యానికి చెమట పట్టించగల ఇండియన్ ఆర్మీ ఇప్పటికే నాలుగు మేజర్ ఇండో–పాక్ యుద్ధాలు(1948, 1965, 1971, 1999), ఒక ఇండో–చైనా యుద్ధాలు(1962,1967)లో పాల్గొని తన సత్తాను చాటుకుంది. 15 జనవరి 2026న నిర్వహిస్తున్న 78వ ఇండియన్ ఆర్మీ దినోత్సవంలో దేశ భద్రత ఊపిరిగా సేవలందించి అమరత్వం పొందిన సైనికులకు నివాళులు అర్పించడం, వారి కుటుంబాలకు చేయూత ఇవ్వడం, అత్యుత్తమ ధైర్యసాహసాలు ప్రదర్శించిన వీర జవాన్లకు అవార్డులు ప్రదానం చేయడం, ఆర్మీ పరెడ్స్ నిర్వహించడం, మన ఇండియన్ ఆర్మీ అమ్ములపొదిలో మన విజయానికి చేయూతనిస్తున్న అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలు/ఆయుధాలను

## కాంగ్రెస్ మోసాలకు విసిగి బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



**హైదరాబాద్ పెన్ పవర్:** అధికారంలోకి రాకముందు ఒకమాట, వచ్చిన తరువాత మరోమాటతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై విసిగి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం కాలేజీగూడాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఉపసర్పం చులతో పాటు మరో 70 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుతో ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రావుజీగూడ ఉప సర్పంచ్ పెందూర్ గంగామణి, పవర్ గూడా ఉపసర్పంచ్ కరాడ్ లక్ష్మింభాయి, వార్డు మెంబర్లు, నసు, ఇసాక్, జమీర్, దినేష్ బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మరుస్కోల సరస్వతి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్ రావు, మాజీ సహకార సంఘం చైర్మన్ హన్ను పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాల, సర్పంచులు కొడప ప్రకాష్, మాడవి కౌసల్య, మాజీ సర్పంచ్ మాడవి, మాజీ ఎంపీటీసీ కుమ్ర భగవంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కష్టాలు తీర్చాలని ఖాళీ బిందెలతో గిరిజనుల నిరసన



**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రామంలో తాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బేతాల్ గూడ, సోనాపూర్ గిరిజనులు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. గ్రామంలో 140 కుటుంబాలుండగా 7 వందల మంది జనాభా నివాసం ఉంటుందని గ్రామస్థులు వివరించారు. తాగు నీటి కోసం మిషన్ భగీరథ ద్వారా రెండు నీటి ట్యాంకులు, ఇంటింటా పైపులు, ట్యాపులు ఏర్పాటు చేసినా నేటికీ మిషన్ భాగీరథ( వీఱంంఱశీఅ దీష్ఠుస్త్రఱతీథ్ష్ఠు) నీరు అందకపోవడం విచారకరమని అన్నారు. బేతాల్ గూడలో ఒక చేతిపంపు, సోనాపూర్‌లో ఒక్క చేతి పంపు ఉంది. నీళ్ల కోసం ఈ చేతి పంపుల వద్ద స్థానికులు గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. 40 ఏళ్ల క్రితం తాగునీటి కోసం వ్యవసాయ బావి నుంచి ఉన్న పైప్ లైన్‌కు మరమ్మతులు చేయడానికి పంచాయతీ వద్ద నిధులు లేకపోవడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. నీటి కష్టాలు తట్టుకోలేక బుధవారం గిరిజనులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ జాదవ్ పరమేశ్వర్ అక్కడికి చేరుకుని స్థానికులను సముదాయించారు. నీటి సమస్యని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.

## గోదావరిఖనిలో కోలిండియా పోటీలకు వెళ్తున్న కళాకారులకు ఆత్మీయ వీడ్కోలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈనెల 15 నుంచి నాగపూర్ లో జరగనున్న కోలిండియా సాంస్కృతిక పోటీలకు ఎంపికై బయలుదేరి వెళ్తున్న రామగుండం రీజియన్ కళాకారులకు బుధవారం గోదావరిఖనిలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఇటీవల మందమర్రిలో జరిగిన కంపెనీ స్థాయి సాంస్కృతిక పోటీల్లో లైట్ సాంగ్ విభాగంలో దార సుశీల, మౌతర్గన్ విభాగంలో ఆదిల్ మొహమ్మద్, కవాలి టీం విభాగంలో సాన జలపతి, పులియాల సతీశ్, పొన్నాల శంకర్, శ్యామ్, కనకం రమణయ్య, రాకేశ్, ప్రేమ్ కుమార్ లు ప్రథమ బహుమతులు సాధించి కోలిండియా పోటీలకు ఎంపికైన విషయం విధితమే. ఈమేరకు బుధవారం నాగపూర్ కు బయలుదేరి వెళ్తున్న కళాకారులను సీనియర్ కళాకారులు స్థానిక సీఈఆర్ క్లబ్ లో శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కోలిండియా స్థాయి పోటీల్లో రాణించి సింగరేణి సంస్థకు, ఈ ప్రాంతంకు పేరు తీసుకురావాలని ఆకాంక్షిం చారు. కళాకారులకు ప్రోత్సాహమే విజయం వైపు నడిపిస్తుందన్నారు. అలాగే ఇటీవల మంచిర్యాలలో జరిగిన లఘుచిత్ర పోటీల్లో జ్యూరీ బహుమతి సాధించిన 'అలా వృద్ధాశ్రమం లో" లఘుచిత్ర నిర్మాత సతీశ్ కుమార్, దర్శకుడు చంద్రపాల్ చేతుల మీదుగా అవార్డును, మెమెంటోను అందజేశారు. సీనియర్ కళాకారులు కవ్వంపల్లి స్వామి, ఏరియా సూపర్వైజర్ హనుమాన్ దాస్ రమేష్, కాసిపాక రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశమే హద్దుగా సిరిసిల్లలో కైట్ ఫెస్టివల్.. భారీగా తరలివచ్చిన చిన్నారులు, యువత



**హైదరాబాద్ పెన్ పవర్:** కార్మికక్షేత్రమైన సిరిసిల్ల లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంక్రాంతి పండుగ కు నూతన శోభను తెచ్చేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక బతుకమ్మ ఘాట్ వేదికగా ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్ కార్యక్రమానికి అద్భుతమైన ఆదరణ వచ్చింది. పెద్ద సంఖ్యలో చిన్నారులు, యువకులు తరలివచ్చారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నవారికి పతంగులు, ధారాలను అందజేసి ప్రోత్సహించారు. విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ , ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. అదే విధంగా సోమ, మంగళ వారాలలో వాడవాడలా నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుండి విశేష స్పందన లభించింది. దాదాపు 5వేల మందికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ జిందం కళ, సెస్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, సత్తార్, దార్ల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా రహదారి



**హైదరాబాద్ పెన్ పవర్:** నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే కొంద్రాజుపేట రహదారికి మోక్షం లభించడం లేదు. టేకులబోరు నుంచి కొంద్రాజుపేట మీదుగా చినార్కూరు, పెదార్కూరు, కూటూరు మీదుగా చింతూరు మండలం చట్టి వరకూ ఉన్న రహదారి భారీ గోతులతో అధ్వానంగా మారింది. ఇది ఏడు పంచాయతీల పరిధిలోని 30 గ్రామాల గిరిజనులకు దగ్గర మార్గం. అర్ధ శతాబ్దం కిందట జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ రహదారిని ఆ తర్వాత పట్టించుకునే నాథుడే లేడని గిరిజనులు వాపోతున్నారు.

**అభివృద్ధికి దూరం**

కొంద్రాజుపేట రోడ్డును అభివృద్ధి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు ఏళ్ల తరబడి అధికారులకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. చింతూరు ఐటీడీఏలో అనేకసార్లు దరఖాస్తులు కూడా ఇచ్చారు. అయినా రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. ఈ రోడ్డుకు ఇరువైపులా వందల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. రైతులు, వ్యవసాయ కూలీల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ట్రాక్టర్లు, వ్యాన్లు, ఆటోలపై వ్యవసాయ కూలీలు పొలం పనులకు వెళ్లడం, సాయంత్రం కాగానే ఇళ్లకు చేరుకోవడం జరుగుతుంది. రైతులు ఎరువులు, పురుగు మందులు, మిర్చి, పొగాకు నారును (మొక్కలను) పొలాలకు తరలిస్తుంటారు. వాహనాల రద్దీ ఎక్కువ ఉండడంతో కొంద్రాజుపేట రహదారిపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం వస్తే ఆ గోతుల్లో నీరు నిండిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు ద్విచక్ర వాహన చోదకులు ఆ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు.

**మాజీ ఎంపీ చొరవతో..**

గిరిజనులు వివిధ పనులపై మండల కేంద్రానికి రావడానికి ఈ రోడ్డే దగ్గరి మార్గం. అర్ధ శతాబ్దం క్రితం మెటల్ రోడ్డుగా ఉండేది. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో దీన్ని టేకులబోరు నుంచి చింతూరు మండలం చట్టి వరకు తొలుత గ్రావెల్ రోడ్డు, కొద్ది కాలం తర్వాత మెటల్ రోడ్డుగా నిర్మించారు. 1997లో మాజీ ఎంపీ సోడె రామయ్య చొరవతో టేకులబోరు నుంచి జిన్నెలగూడెం వరకు ఆరు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి నేటి వరకూ ఈ రోడ్డుపై తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గోదావరి వరదలు**

గోదావరి వరదలు ఈ రహదారికి శాపంగా మారాయి. తరచూ వచ్చే వరదలకు రోడ్డు ఎక్కడికక్కడ కొట్టుకు పోయింది. కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. కొంద్రాజుపేట వాగుపై ఉన్న లోలెవెల్ కాజ్‌వే ఎత్తు పెంచితే ఎగువనున్న గిరిజన గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు చెబుతున్నారు. వరద ముప్పు నుంచి ఉపశమనం పొందాలంటే కనీసం 10 అడుగుల మేర ఎత్తు పెంచాలని సూచిస్తున్నారు. వర్షాకాలంలో కొద్దిపాటి వరదొస్తే చాలు కొంద్రాజుపేట కాజ్‌వే ముంపునకు గురవుతోంది. తద్వారా 15 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వరదలు తగ్గిన అనంతరం దాదాపు నెల రోజుల వరకు ఈ రహదారిపై రాకపోకలు సాగించడం నరక ప్రాయంగా మారుతుంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే కాజ్‌వే ఎత్తు పెంచాల్సిన అవసరం ఉంది. ఆ మేరకు ఎత్తు పెంచితే భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయినా కొంద్రాజుపేట, టేకులబోరు గ్రామాల మధ్య రాకపోకలు సాగే అవకాశం ఉంటుందని గిరిజనులు చెబుతున్నారు.

# గ్రామీణ కలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు..

## సర్పంచుల ఫోరం సుల్తానాబాద్ మండల సహాయ కార్యదర్శి ఉప్పు లక్ష్మి

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రామీణ కళలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయని మంచరామి సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల సహాయక కార్యదర్శి ఉప్పు లక్ష్మి అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని మంచరామి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవా రం సర్పంచ్ ఉప్పు లక్ష్మి-తిరుపతి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. హరిదాసుల విన్యాసాలు పలువురిని అల్లరించాయి. న్యాయ నిర్ణయితలుగా లక్ష్మణ్, శారద వ్యవహరించారు. అనంతరం విజేతలకు సర్పంచ్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. మొదటి, ద్వితీయ, మూడో బహుమతితో పాటు ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక మహిళకు ప్రోత్సాహ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎగుర్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్న పిల్లలకు కుర్చీల ఆటలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వీరి తో పాటు మహిళలకు కుర్చీల ఆటలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.



# అతలాకోతలం

**ప్రమాదకరంగా అంతర్వేది సాగర సంగమం**

**గోదావరి వైపు పెరిగిన కోత**

**లైట్ హౌస్ వద్ద మలుపు అత్యంత ప్రమాదం**

**హైదరాబాద్ పెన్ పవర్:** సముద్రం అంటే అందరికీ ఎంతో ఇష్టం. ఆ తీరంలో సరదాగా గడపటానికి పిల్లలతో పాటు పెద్దలు కూడా ఇష్టపడతారు. ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తారు. కానీ అదే సమయంలో తీరంలో ప్రమాదం పొంచి ఉంటుంది. ముఖ్యంగా అంతర్వేది సాగర సంగమం మృత్యుకుహరాన్ని తలపిస్తోంది. ఇక్కడ సముద్ర కెరటాల ప్రభావం కంటే శాంతంగా ఉండే గోదావరి లోతు మరింత ప్రమాదంగా మారింది. ఇటీవల ఈ మలుపును గుర్తించలేని ఓ యువకుడు తన వాహనంతో గోదావరిలో దిగబడి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. అమావాస్య, పౌర్ణమి, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ఆటుపోట్లుకు అటు సాగరం, ఇటు గోదావరి గర్భంలో వస్తున్న మార్పులకు సంగమం వద్ద లోతు అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది.

**కెరటాల ఉధృతి**

రాజోలు దీవిలోని ఇతర సముద్ర తీర ప్రాంతాలకు భిన్నంగా అంతర్వేది వద్ద తీరం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాల సమయంలో మాత్రమే సముద్రం అలజడిగా ఉంటుంది. కానీ అంతర్వేది వద్ద మాత్రం ప్రకృతి వైపరీత్యాలతో పాటు, అమావాస్య, పౌర్ణమి ఘడియలకు ఉధృతంగా కనిపిస్తుంది. ఈ కెరటాల ఉధృతికి సంగమం వద్ద గోదావరిపై కూడా తీవ్ర ప్రభావం చూపడంతో కోత పెరుగుతోంది.

**పొంచిఉన్న ప్రమాదం**

అంతర్వేది సాగర సంగమం వద్ద భౌగోళికంగా ఏర్పడిన మలుపులో సముద్రం వైపు కెరటాల లోతు కంటే ప్రశాంతంగా ఉండే గోదావరి లోతు అత్యంత ప్రమాదకరంగా ఉంది. సంగమం వద్ద సముద్ర కెరటాల్లోకి ప్రమాదవశాత్తూ వెళ్లినా వెనక్కి రావచ్చు గానీ, గోదావరి ఒడ్డున ఒక్క అడుగువేస్తే చాలు ఇక ప్రాణాలు గాలిలో కలిసి పోయే ప్రమాదం పొంచి ఉందని మత్స్యకారులు తెలిపారు. ఇక్కడ అప్రమత్తంగా లేకపోతే అమాంతంగా సుమారు 8 అడుగుల లోతులోకి కూరుకుపోతామన్నారు. సముద్రంలో కంటే వశిష్ట గోదావరి అంచులో భారీగా చోటుచేసుకుంటున్న కోత ఎంతో ప్రమాదకరమని చెబుతున్నారు.



**టెట్రాపోడ్స్ ఏర్పాటు చేయాలి**

సాగర సంగమం వద్ద తీర రక్షణ వలయంగా టెట్రాపోడ్స్ (నాలుగు కాళ్లు ఉన్నట్టుగా కనిపించే ప్రత్యేక దిమ్మలు) ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధానంగా సముద్ర తీర ప్రాంతాల్లో రక్షణకు, కోత నివారణకు వీటిని ఏర్పాటు చేస్తుంటారు. తీరంలో అలల శక్తిని విచ్ఛిన్నం చేసి, అలల తీవ్రతను ఇవి తగ్గిస్తాయి. అలాగే అలలు నేరుగా తీరాన్ని తాకకుండా చేసి, తీర రక్షణ గోడలుగా పనిచేస్తాయి. వీటి ప్రత్యేక ఆకారం వల్ల ఒకదానిపై ఒకటి బలంగా నిలబడి చలనం చెందకుండా ఉంటాయి. తుపానులు, భారీ అలలు వచ్చినప్పుడు కూడా స్థిరంగా నిలబడతాయి. పోర్టులు, హార్బర్లు, లైట్‌హౌస్‌లు, తీర ప్రాంతాల రక్షణకు ఉపయోగపడతాయి. సాధారణంగా వీటిని కాంక్రీట్‌తో తయారు చేస్తారు. దీర్ఘకాలంగా మన్నికగా కూడా ఉంటాయి.

# రూ. 4 లక్షల కోట్లకు దేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు

**హైదరాబాద్ పెన్ పవర్:** 2025లో మనదేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్ల మార్కును దాటాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ మంగళవారం తెలిపారు. ఈ ఏడాది నాలుగు సెమీకండక్టర్ తయారీ ప్లాంట్లు ఉత్పత్తిని ప్రారంభిం చడం ద్వారా ఇవి మరింత పెరుగుతాయని అభిప్రాయ పడ్డారు. దీనికి సంబంధించి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో దీని గురించి పోస్ట్ చేసిన మంత్రి, ఎగుమతులు పెరగడంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలను సృష్టి జరిగిందని, విదేశీ మారక ద్రవ్య ఆదాయాన్ని పెంచిందని అన్నారు. 2025లో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్లు దాటాయి. ఉద్యోగాలను, విదేశీ మారక ద్రవ్యాన్ని తీసుకువచ్చాయి. నాలుగు సెమీకండక్టర్ ప్లాంట్లు వాణిజ్య ఉత్పత్తిలోకి రావడంతో 2026లో కూడా ఇదే ఊపు కొనసాగుతుందని వెల్లడించారు. అధికారిక అంచనాల ప్రకారం, 2024-25లో దాదాపు రూ.11.3 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి జరిగింది. ఇందులో ఎగుమతుల విలువ దాదాపు రూ.3.3 లక్షల కోట్లుగా ఉంది. ఈ రంగం ప్రస్తుతం 25 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీలో ఎక్కువ భాగం మొబైల్ ఫోన్లే ఉన్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది మన్దేశం నుంచి ఐఫోన్ ఎగుమతులు రూ. 2.03 లక్షల కోట్లకు చేరుకున్నాయని,



ఇది అంతకుముందు 2024లో నమోదైన రూ. 1.1 లక్షల కోట్ల కంటే దాదాపు రెట్టింపు అని మంత్రి పోస్ట్‌లో పేర్కొన్నారు. భారత సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశంలో మొబైల్ ఫోన్ ఉత్పత్తి 75 బిలియన్ డాలర్ల(రూ. 6.77 లక్షల కోట్ల)కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తన నివేదికలో ప్రస్తావించింది. వీటిలో 30 బిలియన్ డాలర్ల(రూ. 2.70 లక్షల కోట్ల) ఎగుమతులు ఉన్నాయి.

## భారత జీడీపీ వృద్ధి అంచనాలను అప్‌గ్రేడ్ చేసిన ప్రపంచ బ్యాంకు

**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత వృద్ధి అంచనా లను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. గతేడాది అక్టోబర్‌లో అంచనా వేసిన 6.3 శాతంగా అంచనా వేసింది. ప్రస్తుతం దీన్ని 6.5 శాతానికి సవరిస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు మంగళవారం ప్రకటనలో తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికవ్యవస్థలలో భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధి రేటును కొనసాగిస్తుంది. అమెరికాకు పంపే కొన్ని ఎగుమతులపై అధిక సుంకాలు ఉన్నప్పటికీ, ఇది భారత వస్తువుల ఎగుమతుల్లో దాదాపు 12 శాతం వాటాయే ఉంది. ప్రధానంగా దేశీయ డిమాండ్‌లో బలమైన ఊపు, గతంలో ఊహించిన దానికంటే అధిక స్థిరమైన ఎగుమతుల ద్వారా ప్రతికూల ప్రభావాలను భారత్ అధిగమిస్తుందని ప్రపంచ బ్యాంకు తన తాజా గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ నివేదికలో పేర్కొంది. ఇదే సమయంలో ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గితే భారత వృద్ధి అంచనా మరింత మెరుగుపడుతుందని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. కొన్ని వాణిజ్య సమస్యలకు పరిష్కారం లభించడం, అమెరికా సుంకాలను పాక్షికంగా ఉపసంహరించుకుంటే, భారత ఎగుమతులు ఊహించిన దానికంటే వేగంగా పెరగవచ్చు. వాణిజ్య అడ్డంకులను




తగ్గించడానికి దేశాల మధ్య చర్చలు మరింత విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో కూడా సహాయపడతాయి. తద్వారా వ్యాపార, వినియోగదారుల విశ్వాసం పెరుగుతుంది, దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో అధిక వ్యయం, అధిక పెట్టుబడులకు ఆస్కారం ఉంటుందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది.

# వ్యవస్థలు వైఫల్యం చెందిన వేళ..

**హైదరాబాద్ పెన్ పవర్:** గల్ఫ్ దేశంలో మృతి చెందిన ఓ కార్మికుడి మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు అయ్యే ఖర్చును భరించలేమని కంపెనీ యాజమాన్యం, అలాగే ఇండియన్ ఎంబసీ కూడా చేతులెత్తేసిన పరిస్థితిలోఁ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చి ఆ వ్యయాన్ని పూర్తిగా భరించిన అరుదైన మానవీయ ఘటన చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా, నవీపేట మండలం యామ్చా గ్రామానికి చెందిన గొల్ల అబ్బులు (తొగరి అబ్బయ్య) అనే 40 ఏళ్ల కార్మికుడు, నాలుగు నెలల క్రితం ఓమాన్ దేశంలోని సలాలా ప్రాంతంలో ఒక క్లీనింగ్ కంపెనీలో పని చేయడానికి వెళ్లాడు. యాజమాన్యం వైఖరి నచ్చక కంపెనీ నుంచి బయటకు వెళ్లిన కొంతకాలానికే, డిసెంబర్ 14న ఇబ్రి ప్రాంతంలో మృతి చెందాడు. అనుమతి లేకుండా కంపెనీ నుంచి వెళ్లిన కార్మికులను అక్కడి చట్టాల ప్రకారం 'ఖల్లివెల్లి' (అక్రమ నివాసి)గా పరిగణించడంతో, వారికి లభించాల్సిన కొన్ని హక్కులు, సౌకర్యాలు రద్దవుతాయి.

ఈ నేపథ్యంలో, "అబ్బులు, కంపెనీ నుంచి వెళ్లిపోయాడు కాబట్టి అతనితో మాకు సంబంధం లేదు" అంటూ మృతదేహం తరలింపు ఖర్చును భరించబోమని కంపెనీ యాజమాన్యం స్పష్టం చేసింది. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ (ఐసీడబ్ల్యూఎఫ్) నుంచి సహాయం అందిస్తారు. అయితే నిధుల కొరత ఉందని పేర్కొంటూ, మృతదేహం తరలింపుకు రూ.1.50 లక్షలు చెల్లించాలని మస్కట్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారి ఒకరు కుటుంబానికి ఫోన్ చేసి తెలిపారు. ఆ మొత్తాన్ని చెల్లించలేని పరిస్థితిలో ఓమాన్‌లోనే అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంటుందని కూడా స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో మృతుడి భార్య తొగరి చిన్న సావిత్రి తన కుమారుడు సంజయ్, యామ్చా గ్రామ సర్పంచ్ బేగారి సాయిలుతో కలిసి మంగళవారం (13.01.2026) హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. తన భర్త పార్థివదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అయ్యే ఖర్చును సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేయాలని ఆమె వేడుకున్నారు. కాగా ఆమె ఇదివరకే డిసెంబర్ 29న మెయిల్ ద్వారా సీఎంఓ కు వినతిపత్రం పంపారు. దీనికి స్పందనగా జీఏడి ఎన్నారై విభాగం ఇండియన్ ఎంబసీకి వైర్ మెసేజ్ పంపింది. ఇదిలా ఉండగా, అబ్బులు చిన్నాపూర్ కు చెందిన ఒక గల్ఫ్ సబ్ ఏజెంట్ కు రూ.1.20 లక్షలు చెల్లించి ఓమాన్ కు వెళ్ళాడు. ఎమిగ్రేషన్ క్లియరెన్స్ మాత్రం అస్సాం రాజధాని గౌహతి లోని ఒక రిజిస్టర్ రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా




జరిగింది. ప్రవాసీ భారతీయ బీమా యోజన (పిబిబివై) అనే రూ.10 లక్షల విలువైన ప్రమాదం బీమా పాలసీ కూడా జారీ అయింది. వలస కార్మికుడు విదేశాల్లో మరణించినప్పుడు మృతదేహాన్ని తరలించేందుకు అయ్యే ఖర్చును ప్రవాసీ పాలసీ ద్వారా పొందే అవకాశాన్ని మస్కట్ లోని ఇండియన్ ఎంబసీ ఎందుకు వినియోగించలేదన్నది పెద్ద ప్రశ్న. చట్ట ప్రకారం శవాన్ని తరలించే బాధ్యత రిక్రూటింగ్ ఏజెన్సీ తీసుకోవాలి. సమస్య 'మదద్' పోర్టల్ లో నమోదు అయిన తర్వాత కూడా ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ విషయం గురించి సరిగా పట్టించుకోలేదని స్పష్టం అవుతున్నది. తెలంగాణ ప్రభుత్వం నియమించిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, కమిటీ సభ్యుడు నంగి దేవేందర్ రెడ్డి, ప్రవాసీ ప్రజావాణి వాలంటీర్ మహమ్మద్ బషీర్ అహ్మద్ ఈ అంశాన్ని సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా. జి. చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన డా. చిన్నారెడ్డి తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రిని ఆదేశించారు.

### చలించిన ఐఏఎస్ అధికారిణి

ఇదే అంశాన్ని సీఎం ప్రజావాణి నోడల్ అధికారి, ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్‌కు వివరించగా, పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకొని వెంటనే స్పందించారు. ఓమాన్‌కు వెళ్లిన మూడు నెలలకే అబ్బులు మృతి చెందడం, నెలరోజులుగా ఆసుపత్రి శవాగారంలో మృతదేహం ఉండిపోవడం, భర్త పార్థివదేహం కోసం గ్రామం నుంచి హైదరాబాద్ వరకు వచ్చి మొరపెట్టుకున్న భార్య పరిస్థితి ఆమెను చలింపజేసింది. ఫలితంగా, ఓమాన్ నుంచి మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు అవసరమైన రూ.1.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కొన్ని గంటల వ్యవధిలోనే చెక్కుగా జారీ చేసి మృతుడి భార్య చిన్న సావిత్రికి అందజేశారు. ఓమాన్‌లో ఇండియన్ ఎంబసీ గుర్తింపు పొందిన ఇండియన్ సోషల్ క్లబ్ తెలంగాణ విభాగం అధ్యక్షులు గుండేటి గణేష్ ఈ వ్యవహారంలో సమన్వయం చేస్తూ సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ మానవీయ సహాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ బోధన్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డిని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామ సర్పంచ్ బెగారి సాయిలు, మంద భీంరెడ్డి తదితరులు ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన మానాల మోహన్ రెడ్డి, అనిల్ ఈరవత్రి, నాగేపూర్ మహిపాల్ రెడ్డికి వారు కృత్షతలు తెలిపారు.

## 44.89 లక్షల పీవీల టోకు విక్రయాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** వాహన కంపెనీల నుంచి డీలర్లకు ప్రయాణికుల వాహ న (పీవీ- కార్లు, జీపులు, వ్యాన్లు) సరఫరాలు 2025 లో 44,89, 717కు చేరా యని తయారీదార్ల సమాఖ్య సియామ్ మంగళవారం వెల్లడించింది. 2024లో సరఫరా అయిన 42,74, 793 వాహనాల కంటే ఇవి 5% ఎక్కువ. జీఎస్‌టీ రేట్లు తగ్గడం, పండగ సీజన్‌లో బలమైన అమ్మకాల వల్ల, ఒక క్యాలెండర్ ఏడాదిలో 2025 రికార్డు సృష్టించిందని పేర్కొంది. 'భారతీయ వాహన పరిశ్రమకు గత ఏడాది మైలురాయిగా నిలిచింది. తొలి అర్ధ భాగంలో స్తబ్దుగా కనిపించిన పరిశ్రమ, సరఫరా సవాళ్లను ఎదుర్కొంది. ఆదాయపు పన్ను ఉపశమనం, రెపో రేటు కోతలు, జీఎస్‌టీ 2.0 వంటి బహుళ నిర్మాణాత్మక సంస్కరణలతో .. వాహనాలకు సానుకూల గిరాకీ వాతావరణం ఏర్పడింద'ని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర వెల్లడించారు. స్థిరమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, అందుబాటు ధరలు, విధాన మద్దతుతో 2026లో కూడా పరిశ్రమ సానుకూల ధోరణిలో పయనించే అవకాశం ఉందని అంచనా వేశారు.

## వినియోగదారులకు క్షమాపణలు తెలిపిన నెస్లె సిఇఒ

**హైదరాబాద్ పెన్ పవర్:** 30కి పైగా దేశాలు కొన్ని బ్యాచ్‌ల శిశు పోషకాహార ఉత్పత్తులను వెనక్కిపంపడంపై నెస్లె సిఇఒ పిలిప్ నవ్రాటిల్ వినియోగదారులకు క్షమాపణలు తెలిపారు. పరిస్థితిని వివరించే ముందు, తల్లిదండ్రులు, శిశు సంరక్షకులు మరియు వినియోగదారులకు కలిగించిన ఆందోళన, అంతరాయానికి క్షమాపణలు



కోరుతున్నాను అని కంపెనీ వీడియోలో నవ్రాటిల్ పేర్కొన్నారు. వెనక్కి పంపిన ఉత్పత్తులను ఇప్పుడు ప్రకటించనున్నట్లు తెలిపారు. వాంతులు, వికారానికి కారణమయ్యే విషపూరిత రసాయనాలు ఉన్నందున శిశు ఉత్పత్తులను పలు యూరోపియన్ యూనియన్ దేశాలు, ఆస్ట్రేలియా,బ్రెజిల్, చైనా, మెక్సికో మరియు దక్షిణాఫ్రికా సహా సుమారు 37 దేశాలు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా వెనక్కి పంపిన ఉత్తత్తులను భారతదేశంలో దిగుమతి చేసుకోవడం లేదా విక్రయించడం లేదని నెస్లె స్పష్టం చేసింది. ప్రతి ఉత్పత్తిని స్థానికంగా తయారు చేస్తామని పేర్కొంది

## రష్యా ఇంధన దిగుమతుల్లో మూడో స్థానానికి భారత్

**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యా నుంచి శిలాజ ఇంధనాల కొనుగోలుదార్లలో భారత్ మూడో స్థానానికి పరిమితమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ప్రభుత్వ చమురు రిఫైనరీలు, రష్యా నుంచి దిగుమతులు తగ్గించడం ఇందుకు నేపథ్యమని మేధో సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్(సీఆర్ఈఏ) పేర్కొంది. డిసెంబరులో భారత్ మొత్తం మీద 2.3 బిలియన్ యూరోల (సుమారు రూ.24,150 కోట్లు) విలువైన ముడిచమురు ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. నవంబరు దిగుమతులు 3.3 బి. యూరోలు కావడం గమనార్హం. 2.6 బి. యూరోల విలువైన రష్యా ముడిచమురు కొనుగోళ్లతో, తుర్కియే రెండో స్థానాన్ని భర్తీ చేసింది. రష్యా చమురు కొనుగోలులో చైనా అగ్రగామిగా కొనసాగుతోంది. రష్యా అగ్రగామి 5 సంస్థలకు వచ్చిన ఎగుమతి ఆదాయాల్లో, చైనా వాటా 48% (6 బిలియన్ యూరోలు) కావడం గమనార్హం. రష్యా నుంచి భారత్ కొనుగోళ్లలో చమురు వాటా 78 శాతంగా ఉంటోంది. దీని విలువ 1.8 బి. యూరోలు(దాదాపు రూ.18,900 కోట్లు). తర్వాతి స్థానాల్లో బొగ్గు(424 మి. యూరోలు), చమురు ఉత్పత్తులు (82 మి. యూరోలు) ఉన్నాయి.

## మ్యాన్ హోల్స్, మురుగు కాలువలను క్లీన్ చేసే రోబోట్

**హైదరాబాద్ పెన్ పవర్:** పారిశుధ్య కార్మికులు మురుగు కాలువల్లోకి దిగి ప్రాణాలను కోల్పోకుండా ఉండేందుకు ఇద్దరు విద్యార్థినిలు అద్భుత ఆవిష్కరణ చేశారు. మ్యాన్ హోల్స్, మురుగు కాలువల లోపలికి వెళ్లి వాటిని శుభ్రం చేసి తనిఖీ చేయగల రోబోట్‌ను అభివృద్ధి చేశారు. వారే ఛత్తీస్గఢ్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కవితా సాహు, అంజలి చౌహాన్. ఈ అద్భుత ఆవిష్కరణ చేపట్టినందుకుగానూ కవితకు రాష్ట్రపతితో విందు చేసే అవకాశం వచ్చింది. ఈ క్రమంలో ఇద్దరు స్టూడెంట్స్ అభివృద్ధి చేసిన రోబోట్ ఎలా పనిచేస్తుంది? దాని వల్ల ఉపయోగాలేంటి? తదితర విషయాలు తెలుసుకుందాం.

### అద్భుత ఆవిష్కరణ చేసిన స్టూడెంట్స్

దుర్గ్ జిల్లాలోని వైశాలి నగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కవితా సాహు తొమ్మిదో తరగతి, అంజలి పదకొండో క్లాస్ చదువుతోంది. ఈ ఇద్దరూ విద్యార్థినిలు కలిసి మ్యాన్ హోల్స్, మురుగు కాలువల లోపలికి వెళ్లి వాటిని శుభ్రం చేసి తనిఖీ చేయగల రోబోట్‌ను సృష్టించారు. ఈ రోబోట్ పారిశుధ్య కార్మికులు మురుగు కాలువల్లోకి దిగి తమ ప్రాణాలను కోల్పోకుండా కాపాడుతుంది. దీంతో ఈ ఇద్దరు స్టూడెంట్స్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి.

### పేద కుటుంబాల నుంచి వచ్చినా!లి

కవితా సాహు తండ్రి ఆటో డ్రైవర్ కాగా, అంజలి చౌహాన్ తండ్రి పారిశుధ్య కార్మికుడు. అయితే పరిమిత వనరులు, సవాళ్లు ఉన్నప్పటికీ కవిత, అంజలి తాము అనుకున్నది సాధించారు. పారిశుధ్య కార్మికుల కోసం అద్భుత ఆవిష్కరణ చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. టాలెంట్ ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు. ఈ రోబోట్ పైపు ఆకారానికి అనుగుణంగా ఉంటుందని ఆవిష్కర్తలో ఒకరైన కవితా సాహు తెలిపింది. విషపూరిత వాయువులు ఉన్న ప్రాంతాలలో ఇది పనిచేస్తుందని పేర్కొంది. ఇరుకైన ప్రదేశాలను కూడా తనిఖీ చేసి శుభ్రపరుస్తుందని వెల్లడించింది. ఈ నమూనాను పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో రూపొందించామని స్పష్టం చేసింది. అక్కడ కెమిస్ట్రీ లెక్చరర్ రీతూ హండా తమకు మార్గనిర్దేశం చేశారని పేర్కొంది. తన తోటి ఆవిష్కర్త అంజలి చౌహాన్ తండ్రి పారిశుధ్య కార్మికుడని కవిత వివరించింది. ఆయన నిరంతరం అనారోగ్యంతో బాధపడుతున్నాడని స్పష్టం చేసింది. అదే పారిశుధ్య కార్మికుల ఈ ప్రమాదకరమైన పనికి సురక్షితమైన ప్రత్యామ్నాయం ఉందా? అని ఆలోచించేలా చేసిందని పేర్కొంది. ఈ ఆలోచనే తమను క్లీనర్ రోబోట్ సృష్టికి దారితీసిందని వెల్లడించింది.

### కేంద్ర మంత్రిని కలవనున్న అంజలి

మరోవైపు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసే అవకాశాన్ని అంజలి చౌహాన్ ఒక ప్రత్యేక క్షణంగా అభివర్ణించింది. విద్యార్థి జీవితంలో ఇంత ముఖ్యమైన విజయాన్ని సాధించడం చాలా ప్రత్యేకంగా ఉందని పేర్కొంది. తాము అందుకు చాలా సంతోషంగా ఉన్నామని వెల్లడించింది. మరోవైపు, తమ పాఠశాల విద్యార్థినిలు కవితా సాహు, అంజలి చౌహాన్ చేసిన ఆవిష్కరణ పట్ల ప్రిన్సిపల్ సంగీతా సింగ్ బఘేల్ సంతోషం వ్యక్తం చేశారు.

## ఎంపీ వద్దిరాజు ఖమ్మం సారథినగర్ లో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ.



**హైదరాబాద్ పెన్ పవర్:**
సంక్రాంతి పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తోట రామారావు తన ధర్మపత్ని,48వ డివిజన్ కార్పొరేటర్ గోవిందమ్మతో కలిసి ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఖమ్మం సారథినగర్ రామాలయం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ పోటీలకు మహిళామణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, ముగ్గుల పోటీల నిర్వాహకులు తోట రామారావు-గోవిందమ్మ పుణ్య దంపతులను,వారి కుమారులు రమేష్,డాక్టర్ లక్ష్మణ్, కుటుంబ సభ్యులను అభినందించారు.హాజరైన వారందరికి ఎంపీ రవిచంద్ర భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చిన్నారి నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.పోటీలలో పాల్గొన్న, కార్యక్రమానికి హాజరైన మహిళామణులకు ఎంపీ వద్దిరాజు,మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ,బీఆర్ఎస్ నాయకులు ఆర్జేసీ కృష్ణ,పగడాల నాగరాజు, కిరణ్, తోట రామారావు,కార్పొరేటర్ గోవిందమ్మలు చీరల్ని బహుకరించారు..

## నేలకొండపల్లి వేణుగోపాల స్వామి కళ్యాణం వైభవంగా ఆలయ పండితులు ఘనంగా నిర్వహించారు



**హైదరాబాద్ పెన్ పవర్:** నేలకొండపల్లి మండల కేంద్రంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేణుగోపాల స్వామి కళ్యాణం ఘనంగా ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా కళ్యాణం ఘనంగా నిర్వహించారు అత్యంత వైభవంగా వేద పండితులు నిర్వహించారు. భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి మధు రాము నేలకొండపల్లి గ్రామ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి ఉపసర్పంచ్ మద్దినేని మహేష్ వార్డు నెంబర్లు కొల్లి అన్నపూర్ణ ఆలయ చైర్మన్ మన్నె రవి కనమర్లపూడి రమేష్ ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు..

## తేగడ వీధుల్లో భోగి మంటలు, పల్లెల్లో పండగ సందడి..



**హైదరాబాద్ పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ గ్రామంలో పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొన్నది. మకర సంక్రాంతికి ముందు రోజు వచ్చే భోగి రోజున. పిల్లలు, పెద్దలు ఉదయాన్నే వీధుల్లో భోగి మంటలు వేశారు. ఆడపడుచులు అందమైన ముగ్గులతో ఇంటి వాకిళ్లను అలంకరించారు. పోటీపడి ముగ్గులు వేశారు. వాటిలో గొబ్బెమ్మలను పెట్టారు. పిల్లలకు రేగిపండ్లతో స్నానాలు చేయిస్తున్నారు. మరోవైపు ఉదయాన్నే భక్తులు ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సంక్రాంతి కోసం దూరాల్లో చదువుకుంటున్న పిల్లలు సొంతూళ్లకు తరలివెళ్లడంతో సందడి నెలకొన్నది. హరిదాసులతోపాటు అలంకరించిన డూడూ బసవన్నలు ఇంటింటికీ వెళ్తున్నాయి. రావమ్మా మహాలక్ష్మీ.. రావమ్మా.. అంటూ హరిదాసుల సంకీర్తనలు, పిల్లాపాపలు సల్లంగుండాలని డూడూ బసవన్నలు దీవిస్తున్నాయి గ్రామాల్లో సంక్రాంతి వాతావరణం నెలకొన్నది..

## 17 న సాయుధ పోరాట అమరుల సంస్మరణ సభ

- మచ్చా వీరయ్య జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ
- విలేకరుల సమావేశంలో మచ్చా విద్యాసాగర్.




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ అమరులు మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తి ల 77వ సంస్మరణ సభ ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు మచ్చా విద్యాసాగర్ తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం సమ సమాజ నిర్మాణం కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 1949 జనవరి 17న ఆనాడు నెహ్రూ సైన్యం కాల్చి చంపారని, ఈ పోరాటంలో మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తి లు అమరులు అయ్యారని తెలిపారు. వారి జ్ఞాపకార్థం 77వ సంస్మరణ సభ ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామంలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ త రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు ,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఏపీ అధికార ప్రతినిధి ఐఎఫ్ టు ప్రసాద్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు మచ్చ సూర్యనారాయణ , చావా రమేష్, దురుసోజు రమేష్ తో పాటు అనేకమంది అతిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఎన్ తిర్మల్ చే రచించిన మచ్చ వీరయ్య జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

# మొక్కలు నాటుదాం ప్రకృతిని పరిరక్షిద్దాం

## ప్లాస్టిక్ కవర్లు నివారిద్దాం కాటన్ బ్యాగులనే వాడుదాం

**హైదరాబాద్ పెన్ పవర్:**
:వయసు చిన్నది ఆలోచన ఆశయం పెద్దది, రామవరం ప్రాంత నివాసి జాకీర్ హుస్సేన్ మనవడు ఊజైర్ ప్రకృతి పై అవగాహనతో ఈరోజు 5 మొక్కలు నాటి భోగి, సంక్రాంతి మరియు కనుమ శుభాకాంక్షలు తెలిపిన ప్రకృతి హరిత దీక్షకుడు చిరంజీవి ఊజైర్,
తెలంగాణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, రామవరం లో గత 50 సంవత్సరాల నుంచి కిరాణా షాపు వ్యాపార రంగంలో ఈ ప్రాంత ప్రజలకు విశేష సేవలు చేసిన ప్రముఖ వ్యాపారవేత్త ఎస్ ఎ మజీద్ ముని మనవడు, జాకీర్ హుస్సేన్ మనవడు, అజారుద్దీన్ కుమారుడు 4 సంవత్సరముల వయసు కలిగిన చిరంజీవి ఉజైర్ రామవరం లో ఉన్న మసీదులో 1 సపోటా,4 గులాబీ మొక్కలు నాటి భోగి సంక్రాంతి కనుమ శుభాకాంక్షలు తెలిపినాడు, భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ చే 114వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసలు అందుకున్న ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు ప్రకృతి ప్రేమికుడు కె ఎన్ రాజశేఖర్ నుండి ప్రకృతి హరిత దీక్ష ఇప్పించిన తన తాతగారు జాకీర్ హుస్సేన్, ఈ చిన్నోడు ఈ సందర్భంగా మొక్కలు నాటి మత సామరస్యాన్ని తెలిపినందుకు ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు కె ఎన్ రాజశేఖర్ అభినందనలు తెలియజేస్తూ తను ఉజైర్ ముత్తాత కి, తన తాత కి, ఈ బాబు నాన్న కి ,ఉజైర్ లకు 4 తరాల వారికి మొక్కలు ఇచ్చానని ఈ సందర్భంగా తెలియజేసి సంతోషం వ్యక్తం చేశాడు, ప్రస్తుతం తమిళనాడులో ఉన్న తన ముత్తాత తో మొక్కలు నాటిస్తానని ఆ బాబు ఈ సందర్భంగా తెలుపటం చాలా సంతోషం కలిగించిందని అన్నారు, ఇటువంటి నిస్వార్థ సేవ చేస్తున్న చిన్నారులని ఆదర్శంగా తీసుకొని ముందుకు రావాలి ప్రకృతి సేవలు చేయాలని కోరుతున్నాను అని అన్నారు..



# సంప్రదాయాలను భావితరాలకందించాల్సిన బాధ్యత మనది :మాజీ ఎమ్మెల్యే గుమ్మడి.

**హైదరాబాద్ పెన్ పవర్:**
మన ఆచార సాంప్రదాయాలను భావితరాలకు కావాల్సిన బాధ్యత మనదేనా అని గుమ్మడి నరసయ్య అన్నారు. సింగరేణి(కారేపల్లి)మండల పరిధిలోని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య స్వగ్రామమైన టేకులగూడెం గ్రామంలో సిపిఐ ఎంఎల్(మాస్ లైన్), పివైఎల్, పిఓడబ్ల్యు, పిడి ఎస్ యు సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని మహిళలందరూ ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రికెట్,వాలీబాల్ తో పాటు పలు రకాల పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం స్థానిక సర్పంచ్ గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన ఉత్సవ ముగింపు వేడుకలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య,సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర నాయకుడు పోటు రంగారావులు మాట్లాడుతూ



తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు పండుగలు మన సాంప్రదాయానికి ప్రతీకలని, మన సంస్కృతి మనతోనే ఆగిపోకుండా భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా పిల్లలకు మన పండుగల యొక్క విశిష్టతను వివరించాలని వారు కోరారు.ప్రజలను విభజించి పాలించే పరిస్థితులు నేడు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. సినిమాలు, టీవీ సీరియల్లో ప్రజలలో ఈర్ష ద్వేషాలు, పగ, కక్షలు, కార్పన్యాలు పెంచుతున్నయనీ అన్నారు. కుటుంబాలలో కలతలు, తగాదాలు సృష్టిస్తున్నాయని వారు విమర్శించారు. ప్రజా వ్యతిరేకమైన సాహిత్యాన్ని నిషేధించాలని వారు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో మాస్ లైన్ రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ రాఘబోయిన గూడెం సర్పంచ్ సురేష్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు గోకినపల్లి లలిత పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వి రాకేష్ పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి మండల నాయకులు గుగులోత్ తేజ నాయక్ ధరావత్ సక్రు పులకాని సత్తిరెడ్డి వడ్డే వెంకటేశ్వర్లు వేములపల్లి వీరన్న సూర్య పాక అనసూయ సరోజిని వార్డు మెంబర్లు మిరియా ముత్తి సుబ్బారావు గుమ్మడి నరసింహారావు దోమల సీత కొడెం రమణ గోగ్గిళ్ళ కృష్ణ మూడెం లక్ష్మి కనకరాజు గుమ్మడి చైతన్య పవిత్ర తదితరులు పాల్గొన్నారు..

# ప్రజా భవన్ లో మంత్రి సీతక్క గారిని మర్యాదపూర్వకంగా కలిసిన రాధ టి యం టి యాజమాన్యం

**హైదరాబాద్ పెన్ పవర్:**
హైదరాబాద్ ప్రజా భవన్ లో ఈరోజు ఉదయం తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మత్యులు గౌ, ధనసరి అనసూయ సీతక్క గారిని రాధ టి యం టి యాజమాన్యం మర్యాదపూర్వకంగా కలిశారు.ములుగు జిల్లా తాడ్వాయి మండలం శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం లో జరుగుతున్న అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్న తరుణంలో మంత్రి సీతక్క గారి సేవ కృషి పాత్ర అద్భుతమని మంత్రి గారికి పుష్ప గుచ్చం ఇచ్చి వారికి అభినందనలు తెలియజేశారు.
రాధా టి యం టి స్టీల్ కంపెనీ చైర్మన్ సునీల్ సరాఫ్,యం డి సుమన్ సరాఫ్ గారి ఆదేశాల మేరకు గడిచిన సంవత్సరాల నుండి అమ్మ వార్ల సేవలో భాగంగా రాధ టి యం టి ఫ్రీ మినరల్ డ్రింకింగ్ వాటర్ ప్రతి జాతర లో లక్షలాది మంది భక్తులకు అందిస్తున్నామని తెలియజేశారు.అలాగే ఈ సంవత్సరం జనవరి 28 నుండి 31 వరకు జరగబోయే మహా జాతర లో రాధ టి యం టి కంపెనీ చైర్మన్ సునీల్ సరాఫ్, యం డి సుమన్ సరాఫ్ గారి ఆదేశాల మేరకు, మంత్రి సీతక్క సూచనలు సలహాల మేరకు,ములుగు జిల్లా ఎస్పీ రామనాథ్ కేకన్ చొరవతో ,సంబధిత ప్రభుత్వ అధికారుల సహాయ సహకారాలతో ,ములుగు డీలర్ గంగిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫ్రీ మినరల్ డ్రింకింగ్ వాటర్ క్యాంప్ ని ప్రారంభిస్తున్నామని కంపెనీ జనరల్ మేనేజర్ వీరేష్ కుమార్ తెలియజేశారు.ఈ యొక్క ఫ్రీ మినరల్ డ్రింకింగ్ వాటర్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావాలని మంత్రి సీతక్క గార్కి వినతి పత్రం అందజేశారు.రాధా టి యం టి రైనో 600+2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.
అనంతరం సీతక్క గారు మాట్లాడుతూ..... గత సంవత్సరం కూడా రాధ టి యం టి కంపెనీ ఫ్రీ మినరల్ డ్రింకింగ్ వాటర్ క్యాంప్ తన చేతులు మీదుగా ప్రారంభించామని ,
విజయవంతం అయింది అని మంత్రి సీతక్క గుర్తు చేశారు.రాధ టి యం టి కంపెనీ వారు చేస్తున్న సేవలు





మహా అద్భుతం వారికి అమ్మ వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వీరేష్ కుమార్, బ్రాండింగ్ మేనేజర్ నరేష్ గౌడ్ , వరంగల్ ఇంచార్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు..

# మిర్చి రైతుల "కంట కన్నీరు" భారీ పెట్టుబడులు- రైతుల ఆందోళన.

- వైరస్ భయంతో కుదేలైన మిర్చి రైతు.

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రస్తుత వ్యవసాయ సీజన్లో రైతులు సాగుచేసిన ఏ వంటలు కూడా కలిసి రాలేదు. అతివృష్టి ఫలితంగా ఒకవైపు వరి ఒకవైపు పత్తి పెసర నువ్వులు పంటలు దిగుబడులు రాకనష్టపోయిన రైతాంగం నేడు మిర్చి సాగుచేసిన రైతుల పరిస్థితి వైరస్ భయంతో అగమ్యగోచరంగా మారింది. ప్రధానంగా మిర్చి సాగుబడితో ఆర్థికంగా బలపడవచ్చని సంకల్పంతో మండలంలో వేలాది ఎకరాలు సాగుచేసిన మిర్చి రైతుల పరిస్తితి అగమ్య గోచరంగా మారింది.మండలంలోని అనేక ప్రాంతాల్లో ముందుగా హోటల్ సాగు చేసిన రైతులు ఒక మిర్చి కాపుతో పర్వాలేదనిపించిన లేత తోటలు మాత్రం వైరస్ బారిన పడ్డాయి.మండలంలోని అనేక ప్రాంతాలలో మిర్చివంట సాగు చేసిన క్రమంలో తోటలు ఏపుగా పెరిగి పూత, పిందె వస్తున్న తరుణంలో కొన్ని తోటలకు గత ఏడాది వచ్చిన నల్లి వైరస్ వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి కాయలు సైతం రాలిపోతుండడంతో రైతులకు ఉపయోగం లేకుండా పోతున్నాయి. ప్రత్యామ్నాయ మందులను రైతులు పిచికారి చేస్తున్న కొన్ని ప్రాంతాలలో మిర్చి తోటలకు వైరస్ సోకినట్లుగా పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే.ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రైతులు తాము సాగుచేసిన మిర్చి తోటలను కొంత మేర వైరస్ బారి నుండి రక్షించుకున్నా ఇటీవల కురిసిన ఆకాల వర్షాలు మూలిగే నక్కపై తాటిపండు వద్ద చందంగా "రైతులకు భారీగా నష్టాలకు గురిచేసాయి ఒకవైపు పూత రాకపోవడం, మరోవైపు చెట్లు ఎండిపోవడం, రైతులను ఆవేదనకు గురిచేసాయి. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు పెట్టుబడులు వెళ్లే అవకాశాలు లేనందున దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు మిర్చితోటలకు పెట్టుబడులుగా రైతులు పెట్టారు. కనీసం రెండు కావులు దిగుబడులు వచ్చినా నష్టాలు రావని రైతులు తెలుపుతున్నారు. చలి తీవ్రత అధికం కావటంతో తెగుళ్లు తగ్గిపోతాయనే ఆశలు చిగురించాయి. ఏది ఏమైనా గత రెండేళ్లుగా తామర పురుగుసోకి మిర్చి తోటలు వైరస్ బారిన పడటం



రైతులలో తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది.
రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు:
పురుగు మందులపై ఆధారపడినా వైరస్ రాకుండా నివారించడం కష్టంగా మారింది. నష్టపోయిన పంట వల్ల పెట్టుబడి కూడా తిరిగి రాక అప్పుల పాలవుతున్నారు.పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలని కోరుతున్నారు..

# ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

**- 18న జిల్లాకు రేవంత్ రెడ్డి రాక.**

**- ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్ శ్రీజ, సీపీ సునీల్ దత్.**

**ఖమ్మం జనవరి 14 పెన్ పవర్:**

ఏదులాపురం మున్సిపాలిటీ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి పరిధిలో జరగనున్న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల ప్రాంతాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్ చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాల సమీపంలో హెలీప్యాడ్‌ను డీజీసీఏ ప్రమాణాల మేరకు సిద్ధం చేయాలని, అక్కడ అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. సీఎం కాన్వాయ్ కోసం అత్యుత్తమ వాహనాలను ఎంపిక చేయాలని, ప్రొటోకాల్ ప్రకారం ప్రత్యేక వైద్య బృందం, 108 వాహనాన్ని వెంట ఉంచాలని స్పష్టం చేశారు. జిల్లాలో



జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రికి వివరించేందుకు శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని జిల్లాలో పటిష్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలని సీపీ సునీల్ దత్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఏ.శ్రీనివాస రెడ్డితో పాటు ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు..

# ముగ్గుల మురిపెం.. సంక్రాంతి సంబరం.

**- జజ్జులరావు పేట గ్రామంలో అట్టహాసంగా 'ముగ్గుల పోటీలు**


**కూసుమంచి జనవరి 14 పెన్ పవర్:**

కూసుమంచి మండలం జూజల్ రావు పేట గ్రామంలో తరలివచ్చిన ఆడపడుచులు సృజనాత్మకతకు అద్దం పట్టిన రంగురంగుల రంగవల్లులు విజేతలకు బహుమతులు అందజేసిన కూసుమంచ మండల మహిళ ఎస్సై దివ్యశ్రీ జజ్జులరావుపేట: తెలుగు లోగిళ్లలో సంక్రాంతి వెలుగులు ముందే వచ్చాయి. గ్రామ పరిధిలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు కనులవిందుగా సాగాయి. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు మహిళా లోకం పోటెత్తింది...మహిళలు రంగురంగుల రంగవల్లులతో ప్రాంగణాన్ని ఇంద్రధనుస్సులా మార్చేశారు. విజేతలకు 'నగదు' కానుకలు పోటీలో ప్రతిభ కనబరిచిన విజేతలకు కూసుమంచి మండల ఎస్సై దివ్య శ్రీ చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు.



ప్రథమ బహుమతి: మాలోత్ పూజిత(రూ. 5016/ ద్వితీయ బహుమతి: పల్లా కవిత (రూ.3116/ తృతీయ బహుమతి: దాట్ల జోష్న (రూ. 3016/ నాలుగోవ బహుమతి:కోడి జ్యోతి రూ.2016/ ఐదవ బహుమతి: దాట్ల ఇందు రూ.1016/ అదేవిధంగా పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళలకు బహుమతులు అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్ఐ దివ్య మాట్లాడుతూ ఈ ముగ్గుల పోటీలు మన సంస్కృతికి అద్దం పడుతున్నాయి. మహిళలందరూ పోటీలో పాల్గొనడం చాలా గొప్ప విషయమని ఆమె కొనియాడారు..ఇంత మంచి కార్యక్రమానికి నన్ను ఆహ్వానించిన ఆర్గనైజింగ్ కమిటీ



వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కనతాల నాగయ్య, ఉప సర్పంచ్ మార్గం గంగా భవాని, మాజీ సర్పంచులు మందడి పద్మ, పడిశాల గోపి, వార్డు సభ్యులు, కనతాల వీరన్న, కలకొండ రాంబాయి,పడిశాల వినయ్, పడిశాల ఉపేందర్, బానోత్ మదిన్, బానోతు వీరన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలకొండ పున్నయ్య,మహిళ నాయకురాలు దాట్ల అనూష, యూత్ నాయకులు , శ్రీరాముల నరేష్ ,శ్రీరాముల రాము, జిల్లపల్లి ఉప్పయ్య, శేఖర్ రెడ్డి, పడిశాల కొండలు, మల్లెబోయిన వీరభద్రం, తదితరులు పాల్గొనడం జరిగింది..

# పోరాటాల స్మరణ- భవిష్యత్తు కార్యాచరణ.

**- 18న నూరేళ్ల సిపిఐ సమర సంబురం భాగం హేమంతరావు.**

**- ఖమ్మంలో వంద అడుగుల జెండా ప్రదర్శన.**


**ఖమ్మం జనవరి 14పెన్ పవర్:** వందేళ్ల పోరాటాలను మననం చేసుకుని త్యాగాలను స్మరించుకుని భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించే –లక్ష్యంగా ఈనెల 18న సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ జరుగుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు. 2024 డిసెంబర్ 26న కాన్పూర్లో ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు జనవరి 18న ఖమ్మంలో జరిగే సభతో ముగుస్తాయని ఈ సందర్భంగా జాతీయ కౌన్సిల్ సమావేశంతో పాటు జాతీయ స్థాయి సెమినార్ల నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ప్రచారంలో భాగంగా బుధవారం వంద అడుగుల సిపిఐ జెండాతో ఖమ్మంలో ప్రదర్శన నిర్వహించారు. బైపాస్ రోడ్డు సిపిఐ కార్యాలయం నుండి ప్రారంభమైన ప్రదర్శన కొత్తబస్టాండ్ మీదుగా రాపర్తి నగర్ ఫ్లైఓవర్ వరకు సాగి అక్కడి నుంచి బైపాస్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగింది. ప్రదర్శనను ఉద్దేశించి బాగం హేమంతరావు మాట్లాడుతూ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ లక్ష్యమే ప్రజలకు హక్కుల సాధన, సమానత్వం, –సంక్షేమమని ఆ ఆశయ లక్ష్యంతో వందేళ్లుగా ముందుకు సాగుతుందన్నారు. ఓట్లు, సీట్లు, నోట్లు కమ్యూనిస్టు పార్టీ ఎజెండాలో లేవని ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే లక్ష్యంగా సిపిఐ సుదీర్ఘ ప్రయాణం సాగిందన్నారు. పాలక వర్గాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించిన ప్రతిసారి సిపిఐ



ప్రతిఘటించిందని హేమంతరావు గుర్తు చేశారు. వందేళ్ల సుదీర్ఘ పోరాటంలో ప్రజల పక్షాన పోరాడుతూ ఎందరో యోధులు ప్రాణాలను అర్పించారని వారందరికి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నివాళులర్పిస్తూ భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యమైందని ఇప్పటి కేంద్ర పాలకులు ప్రజాస్వామ్య మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణకు సిపిఐ మరో పోరాటానికి పిలుపునిస్తుందన్నారు. మోడీ పాలనలో దేశం కార్పొరేట్ల కబంద హస్తాల్లో చిక్కుకుందని కార్పొరేట్ల కబంద హస్తాల నుంచి ఈ దేశ సంపదను కాపాడే సత్తా కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని హేమంతరావు స్పష్టం చేశారు. ఈనెల 18న ఒక మహోత్సవంలా సిపిఐ శతాబ్ది ఉత్సవాలు సాగనున్నాయని ఆయన తెలిపారు. ప్రతి ఊరు నుంచి ప్రతి ఇంటి నుంచి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు మహసభకు తరలి వస్తున్నారని తెలిపారు. ఖమ్మంలో మూడు ప్రదేశాల నుంచి ప్రదర్శనలు ప్రారంభమవుతాయని జనసేవాదళ్ కవాతు, కళాకారుల ప్రదర్శన పెవిలియన్ మైదానం నుంచి –మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతుందని హేమంతరావు తెలిపారు. వైరా రోడ్డు నుంచి వచ్చే వాహనాల ద్వారా వచ్చిన వారితో ప్రదర్శన శ్రీశ్రీ విగ్రహం నుంచి సభా స్థలి ఎస్ఆర్అండ్బిజిఎన్ఆర్ కళాశాల మైదానంకు చేరుకుంటుందన్నారు. –రెండవ ప్రదర్శన నయాబజార్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమై పాత బస్టాండ్, జెడ్పిసెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా. ఎస్ఆర్ఆండ్బిజిఎన్ఆర్ కళాశాల మైదానంకు చేరుకుంటుందని హేమంతరావు తెలిపారు. ఈ మూడు ప్రదర్శనలకు సిపిఐ అగ్ర నాయకత్వం నేతృత్వం వహిస్తుందన్నారు. ఈ జెండా ప్రదర్శనలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేంద్రరెడ్డి, రాష్ట్ర –సమితి సభ్యులు యర్రా బాబు, నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా, మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, సిహెచ్ సీతామహలక్ష్మి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి –సాంబశివరెడ్డి, ప్రజా సంఘాల బాధ్యులు గాదె లక్ష్మి నారాయణ. నానబాల రామకృష్ణ. ఇటికాల రామకృష్ణ, మద్దోజు శ్రవణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వరదా నర్సింహారావు, బోడా వీరన్న, సైదా, యాకూబ్, నాయకులు నంబూరి శంకర్రావుతదితరులు పాల్గొన్నారు..

# పాకిస్థాన్‌తో మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనున్న ఆస్ట్రేలియా

**లాహోర్:పెన్ పవర్:** వచ్చే నెలలో ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ జరగనున్న విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీ భారత్, శ్రీలంక వేదికగా జరనున్నది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్(ూాఖజూాఖూ)లో పర్యటించనున్నది. వరల్డ్‌కప్ ప్రిపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్‌తో మూడు టీ20 మ్యాచ్‌లను ఆస్ట్రేలియా ఆడనున్నది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జనవరి 29, 31, ఫిబ్రవరి ఒకటో తేదీన ఆ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అయితే ఆస్ట్రేలియా తన వరల్డ్‌కప్ మ్యాచ్‌లను ఇండియాలో ఆడనున్నది. ఇక పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నీ శ్రీలంక వేదికగా ఆడనున్నది. ఏప్రిల్ 2022లో చివరిసారి ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌లో పర్యటించింది. జనవరి 28వ తేదీన ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌కు చేరుకోనున్నది. గత ఏడాది చాంపియన్స్ ట్రోఫీలో కొన్ని మ్యాచ్‌లను పాకిస్థాన్ వేదికగా ఆస్ట్రేలియా ఆడింది. ఆసీస్‌తో జరిగే సిరీస్‌కు చెందిన జట్టును పాకిస్థాన్ త్వరలో ప్రకటించనున్నది. పాక్ కోచ్ మైక్ హెస్సాన్, కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా ఈ అంశంపై భేటీకానున్నారు.



## దిశా ఫౌండేషన్ సంక్రాంతి శుభాకాంక్షలు....

**దిశా ఫౌండేషన్ మండల అధ్యక్షురాలు తోటమళ్ళ నిర్మలా**

**అశ్వాపురం జనవరి 14 మీ వార్త ప్రతినిధి:**



**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండగ ను పురస్కరించుకొని దిశా ఫౌండేషన్ వెల్ఫేర్ మండల అధ్యక్షులు తోటమళ్ళ నిర్మల ఫౌండేషన్.. తరుపున మండల ప్రజలకు, దిశా ఫౌండేషన్ కుటుంబ సభ్యులకు సంక్రాంతి శు భాకాంక్షలు తెలిపారు...దిశా ఫౌండేషన్ వ్యవస్థపాకులు బి.వి రాజు , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశా ఫౌండేషన్ వెల్ఫేర్ అడ్వజర్ మద్దెల అన్నపూర్ణ గార్ల ఆదేశాల మేరకు ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించి పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా తోటమళ్ళ నిర్మల మాట్లాడుతూ... ఆపదలో ఉన్నటువంటి మహిళలకు, అనేక సమస్య లతో బాధ పడుతున్న మహిళలకు దిశా ఫౌండేషన్ గత కొన్నేళ్లుగా అనేక సేవలు అందిస్తుందని... ప్రతి ఒక్క మహిళా కూడా దిశా ఫౌండేషన్ సేవలను ఉపయోగించుకోవాలని ఎటువంటి సమస్యలు ఉన్నా దిశా సభ్యులను సంప్రదించాలని కోరారు.. అలాగే గత కొన్ని సంవత్సరాలుగా ఫౌండేషన్ ద్వారా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల, సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల పై, అన్యాయాలపై అనేక అంశాలను గుర్తించి వారికీ అవగాహన కల్పిస్తూ వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నాము అని అన్నారు.. జిల్లాలో, మండలంలో మా దృష్టికి వచ్చిన ఎటువంటి సమస్యనైనా మహిళలకు న్యాయం జరిగే వరకు వారికీ మనో ధైర్యంతో న్యాయం జరిగే వరకు తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు.. అలాగే దేశంలో, రాష్ట్రంలో మహిళలపై ఎటువంటి దాడులు జరిగినా వెంటనే స్పందించి నిందితులు ఎంతటి వారైనా పూర్తిగా విచారించి వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోని బాధితులకు న్యాయం జరగాలని అనేక కార్యక్రమాలు చేపట్టామని అన్నారు..ఇన్నేళ్లుగా మా దిశా ఫౌండేషన్ కు ప్రత్యేకంగా, పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్న పెద్దలకు, శ్రేయోభిలాషులకు, ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతూ మును ముందు రోజుల్లో కూడా ఫౌండేషన్ ద్వారా చేసే కార్యక్రమాలకు అండగా ఉండాలని వేడుకుంటూ సంక్రాంతి పండగ మీ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు...

## కాంగ్రెస్ మోసాలకు విసిగి బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



**జైనూర్ : పెన్ పవర్:** అధికారంలోకి రాకముందు ఒకమాట, వచ్చిన తరువాత మరోమాటతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై విసిగి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం కాలేజీగూడాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఉపసర్పం చులతో పాటు మరో 70 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుతో ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రావుజీగూడ ఉప సర్పంచ్ పెందూర్ గంగామణి, పవర్ గూడా ఉపసర్పంచ్ కరాడ్ లక్షింభాయి, వార్డు మెంబర్లు, నసు, ఇసాక్, జమీర్, దినేష్ బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మరుస్కోల సరస్వతి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్ రావు, మాజీ సహకార సంఘం చైర్మన్ హన్ను పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాల, సర్పంచులు కొడప ప్రకాష్, మాడవి కౌసల్య, మాజీ సర్పంచ్ మాడవి, మాజీ ఎంపీటీసీ కుమ్రం భగవంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కష్టాలు తీర్చాలని ఖాళీ బిందెలతో గిరిజనుల నిరసన



**నార్నూర్ :పెన్ పవర్:** గ్రామంలో తాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బేతాల్ గూడ, సోనాపూర్ గిరిజనులు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. గ్రామంలో 140 కుటుంబాలుండగా 7 వందల మంది జనాభా నివాసం ఉంటుందని గ్రామస్థులు వివరించారు. తాగు నీటి కోసం మిషన్ భగీరథ ద్వారా రెండు నీటి ట్యాంకులు, ఇంటింటా పైపులు, ట్యాపులు ఏర్పాటు చేసినా నేటికీ మిషన్ భాగీరథ( వీఱంంఱశీఅ దీష్ట్రుస్త్రఅతీష్ట్రు) నీరు అందకపోవడం విచారకరమని అన్నారు. బేతాల్ గూడలో ఒక చేతిపంపు, సోనాపూర్‌లో ఒక్క చేతి పంపు ఉంది. నీళ్ల కోసం ఈ చేతి పంపుల వద్ద స్థానికులు గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. 40 ఏళ్ల క్రితం తాగునీటి కోసం వ్యవసాయ బావి నుంచి ఉన్న పైప్ లైన్‌కు మరమ్మతులు చేయడానికి పంచాయతీ వద్ద నిధులు లేకపోవడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. నీటి కష్టాలు తట్టుకోలేక బుధవారం గిరిజనులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ జాదవ్ పరమేశ్వర్ అక్కడికి చేరుకుని స్థానికులను సముదాయించారు. నీటి సమస్యని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.

## 44.89 లక్షల పీవీల టోకు విక్రయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** వాహన కంపెనీల నుంచి డీలర్లకు ప్రయాణికుల వాహ న (పీవీ–కార్లు, జీపులు, వ్యాన్లు) సరఫరాలు 2025 లో 44,89, 717కు చేరా యని తయారీదార్ల సమాఖ్య సియామ్ మంగళవారం వెల్లడించింది. 2024లో సరఫరా అయిన 42,74, 793 వాహనాల కంటే ఇవి 5% ఎక్కువ. జీఎస్టీ రేట్లు తగ్గడం, పండగ సీజన్‌లో బలమైన అమ్మకాల వల్ల, ఒక క్యాలెండర్ ఏడాదిలో 2025 రికార్డు సృష్టించిందని పేర్కొంది. 'భారతీయ వాహన పరిశ్రమకు గత ఏడాది మైలురాయిగా నిలిచింది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**స్వామి వారిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు**

**హనుమకొండ టౌన్ జనవరి 14 పెన్ పవర్:**
భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం రోజు హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో గల ప్రసిద్ధ శైవ క్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండ సురేఖతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు స్వామివారిని దర్శించుకున్నారు.
తొలుత బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన మంత్రి సురేఖకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి కొండ సురేఖకు, ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజుకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. తదనంతరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంత్రి, ఎమ్మెల్యేలు పరిశీలించారు. భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు.



అదేవిధంగా ఐనవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన బస్టాండ్ ను ప్రారంభించి బస్సులో ప్రయాణించారు. తదనంతరం వారిరువురూ మాట్లాడుతూ భోగి సందర్భంగా ఐనవోలు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఆధ్యాత్మికంగా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలో భోగి మంటలు

**భోగి అనగా ప్రతికూలతలు వదిలి నూతన సంవత్సరంలో సానుకూల దృక్పథంతో అడుగుపెట్టడం ఆలయ ఛైర్మన్ కందుకూరి చంద్రమోహన్**



**హనుమకొండ టౌన్ జనవరి 14పెన్ పవర్:**
హసన్పర్తి మండల కేంద్రం 66వ డివిజన్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పాత మార్కెట్ దేవస్థానం యందు బుధవారం రోజు భోగి పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారణలతో భోగి మంటలను భక్తుల కోలాహలం మధ్య ఆలయ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ మాట్లాడుతూ సూర్యుడు ఉత్తరాయణం నుండి దక్షిణాయనంలోకి ప్రవేశించడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటాయని అదేవిధంగా మనలోని ప్రతికూలతలను వదిలి నూతన సంవత్సరంలో సానుకూల దృక్పథంతో అడుగు పెట్టాలని, ప్రజలందరు సిరి సంపదలతో భోగభాగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా భోగిమంటల్లో పాల్గొన్న పెద్దలు, చిన్నలు మహిళలు, మాతృమూర్తులతో కలిసి ఆడుతూ పాడుతూ పాల్గొనడం ఆనందంగా ఉందని, భోగి పండుగ సందర్భంగా డివిజన్ ప్రజలందరికీ చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శేషవేణి, కనిపర్తి రాధమ్మ, తోట వసంత, కందుకూరి రమాదేవి, తోట అరుణ, గౌరిశెట్టి వెంకటనర్సమ్మ, కళ్యాణి, గంట కృష్ణ, కనిపర్తి అశోక్, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు సన్మానం



**రామగిరి జనవరి 14 పెన్ పవర్:**
రామగిరి మండలం పన్నూర్ సర్పంచ్ చిందం మహేష్, లొంక కేసారం సర్పంచ్ వీరగోని రమాదేవి శ్రీనివాస్, పన్నూర్ ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి బుధవారం సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు, ఆర్జీ 3 జీఎం సుంకరి మధుసూదన్ , ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా పన్నూర్, లొంక కేసారం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సింగరేణి డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రహదారుల దుస్థితి, మురుగునీటి సమస్య, తాగునీటి సరఫరా లోపాలు, విద్యుత్ సమస్యలు, పారిశుధ్య సంబంధిత సమస్యలను వివరించారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. సింగరేణి డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మున్నీ ప్రశాంత్, సదానందం, ప్రదీప్, మట్ట రాజ్ కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా భోగి వేడుకలు

**రామగిరి జనవరి 14 పెన్ పవర్:**
రామగిరి మండలం పరిధిలో బుధవారం భోగి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పన్నూర్ పంచాయతీ పరిధిలోని సెంటినరీ కాలనీ జోన్-1 క్వార్టర్స్ లో భోగి పళ్ల వేడుక ఘనంగా నిర్వహించబడింది. భోగి పండుగ అంటేనే చిన్నారుల కోలాహలం, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనమని ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి తెలిపారు.
జోన్1 క్వార్టర్స్‌లోని దుర్గ మాత గుడి ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా భోగి పళ్ల కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. మన తెలుగు సంస్కృతిలో భోగి పండుగకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా పిల్లలకు మన ఆచార సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని వివరించారు. చిన్నారుల ఆరోగ్యం, ఆయురారోగ్యాల కోసం భోగి పళ్ల వేడుక నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. జోన్ 1 క్వార్టర్స్ ప్రాంతమంతా



పండుగ వాతావరణంతో కళకళలాడింది. చిన్నారుల చిరునవ్వులు, రంగురంగుల ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# 10 టీవీ 2026 కాలెండర్ ను ఆవిష్కరించిన తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి

**తొర్రూర్ జనవరి 14 పెన్ పవర్:**
మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలకేంద్రం లో తొర్రూరు 10టీవీ ప్రతినిధి నాగపురి అశోక్ గౌడ్. పాలకుర్తి నియోజకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10టీవీ 2026 నూతన కాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి ముఖ్యఅతిథి గా పాల్గొని నూతన కాలెండర్ ను ఆవిష్కరించారు.



ఆయన వెంట పలువురు నూతన సర్పంచ్ లు, రామలింగం. మహేందర్. పలువురు జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ 10టీవీ ప్రేక్షకులకు, అబిమానులకు పాలకుర్తి నియోజకవర్గం ప్రజలకు నూతన సంవత్సర సంక్రాంతి. గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు 10టీవీ వారధిగా ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ప్రభుత్వం చేసే కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తూ మంచి కార్యక్రమాలతో ముందుకెళ్తుంది అన్నారు..

# నాగమల్ల రోజా రమణి 51వ జయంతి

**లార్డ్ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించిన కుటుంబ సభ్యులు**
**అన్నదానం మానవత్వానికి సామాజిక బాధ్యతకు ఆధ్యాత్మిక పురోగతికి సంకేతం-నాగమల్ల సుధీర్**




**హనుమకొండ టౌన్ జనవరి 14 పెన్ పవర్:**
హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలం భీమారంలోని పలు వేల్పుల శివారులోని లార్డ్ వృద్ధాశ్రమంలో కీ.శే. నాగమల్ల రోజా రమణి 51వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కీ.శే. రోజా రమణి భర్త నాగమల్ల సుధీర్ మాట్లాడుతూ మన ఇళ్లలో జరుపుకునే మ్యారేజ్ లు, పుట్టినరోజులు, ఆత్మీయ జయంతులు, వర్ధంతులు, ఆడంబరాలకు వెచ్చించే ఖర్చును అనాథ ఆశ్రమాల్లో అన్నదానం చేయడం ద్వారా ఎంతో సంతృప్తి, ఆనందం ఉంటుందని, అన్నదానం అనేది మానవత్వానికి సామాజిక బాధ్యత పెంపొందించుటకు ఆధ్యాత్మికతకు ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో చకిలం రాజేశ్వరరావు, పావుశెట్టి శ్రీధర్, చకిలం చంద్రశేఖర్, పుల్ల దుర్గారాం, బోడ యుగంధర్, దూబల భాస్కర్, లక్ష్మణ్,నందం భువనేష్, బొక్క కుమార్, వీసం తిరుపతిరెడ్డి, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ అధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు




**హనుమకొండ టౌన్ జనవరి 14 పెన్ పవర్:** హాసన్ పర్తి మండల కేంద్రం 66వ డివిజన్ వాసవి క్లబ్ లో సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వయోభేదం లేకుండా మారుతున్న కాలంతోపాటు ఎన్ని ఆధునిక పోకడలు వచ్చిన భోగి, సంక్రాంతి, కనుమ పండుగల ప్రాచీన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా గంటల తరబడి శ్రమించి మహిళల రంగవల్లులు, చిన్నారులకు భోగి పళ్ళు, పతంగులు, పిండి వంటలు, హరిదాసుల పాటలు, గంగిరెద్దుల విన్యాసాలు, బొమ్మల కొలువుల సందడి చేసే పండుగ సంక్రాంతి యని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్ రావు అన్నారు. తదనంతరం వాసవి క్లబ్ హసన్ పర్తి అధ్వర్యంలో అధ్యక్షుడు నాగమల్ల మాధవ శంకర్ అధ్యక్షతన హసన్ పర్తి లో చిన్నారులకు పతంగులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిదర పురవర్ధన్, మాజీ అధ్యక్షులు, భీష్మనాథం, నాగేందర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

**డైరెక్టర్ పి అండ్ పి వెంకటేశ్వర్లు**

**రామగిరి జనవరి 14 పెన్ పవర్:**
నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలని డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం సింగరేణి సంస్థ రామగుండం 3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ఆయన పర్యటించారు. ఆయనకు జియం కార్యాలయంలో రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు స్వాగతం పలికారు. రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ తో పాటు ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదక, రవాణా, ఆర్జి కోల్ మైన్ మొదలగు అంశాలపై చర్చించారు. తదుపరి అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావుతో పాటు సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి 3వ ప్యానల్ సాల్వేజింగ్ పనుల పురోగతి, 4వ ప్యానెల్ తయారీ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన ఓబి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో సాధించాలని, అందుకు కావలసిన చర్యలను, ప్రణాళికను రూపొందించుకోవాలని, యంత్రాలు ఎక్కువ సమయం



ఉపయోగించినందుకు అందుబాటులో ఉండేలా చూడాలని, పని విధానాన్ని మెరుగుపరుచుకోవాలని, ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా రెండు నెలల సమయం మాత్రమే ఉందని, సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు తగిన చర్యలు, ప్రణాళికలను రూపొందించుకోవాలని, అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ సాల్వేజింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. నూతనంగా రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ గా పదవి బాధ్యతలను స్వీకరించిన ఎస్.మధుసూదన్ ను సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జియం యం.రామ్మోహన్, విభాగధిపతులు రాజా రెడ్డి, బిటి.మురళి కృష్ణ, బివి.సత్య నారాయణ, ఐలయ్య, షబ్బీరుద్దీన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీనుల విందుగా శ్రీగోదారంగనాయకుల కళ్యాణం

**హైదరాబాద్ పెన్ పవర్:**

రామగిరి మండలం లద్నాపూర్ శ్రీదేవి భూదేవి సహిత శ్రీగోదారంగనాయకుల, శ్రీదాసాంజనేయ ఆలయంలో, కల్వచర్లలోని శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో, సెంటినరీ కాలనీలోని శ్రీ కోదండ రామాలయంశ్రీ షిరిడి సాయిబాబా మందిరం, రత్నాపూర్ లోని కోదండ రామాలయంలో బుధవారం శ్రీగోదారంగనాయకుల కళ్యాణం వీనుల విందుగా సాగింది. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి సంక్రాతి పర్వదినాన్ని పురస్కరించుకుని బోగి రోజున స్వామివారి కళ్యాణాన్ని వేదపండితులైన సముద్రాల శ్రీనివాసాచార్యులు, కంజర్ల సాగరా చార్యులు, సౌమిత్రి మురళి చార్యులు, కృష్ణమాచార్యుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణానికి ఆయల కమిటీలు పట్టు వస్త్రాలను సమర్పించారు. పరిసర



గ్రామాల నుండి పెద్దయెత్తున్న మహిళలు మంగళహారతులతో స్వామి కళ్యాణానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్వచర్లలో సింగరేణి



సంస్థ ఆర్జి 3 జియం సుంకర మధుసూదన్, మంథని సీఐ బొల్లపల్లి రాజు గౌడ్, రత్నాపూర్, లధ్నాపూర్ ఆలయాలలో సర్పంచులు పల్లె ప్రతిమపివి రావు, వనం రామచంద్రరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

## ఆర్జీ 3 జీఎంకు బిఎంఎస్ నాయకుల సన్మానం



**రామగిరి జనవరి 14 పెన్ పవర్:**

సింగరేణి సంస్థ ఆర్జి 3 జీఎంగా నూతనంగా విచ్చేసిన సుంకరి మధుసూదన్ రావును బుధవారం బిఎంఎస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బిఎంఎస్)ఆర్జి 3 ఏరియా ఉపాధ్యక్షుడు అరుకుల ప్రసాద్, సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ కార్మిక మజ్దూర్ సంఘ్ రామగుండం కార్యదర్శి దాసరి శ్రీనివాస్, కేంద్ర కార్యదర్శి ఈనుముల సత్యనారాయణ, ఏరియా కమిటీ నాయకులు ఎండి జానీ, పాక కృష్ణ, నరసన్న, పిట్ కమిటీ నాయకులు మెలుగు సంతోష్, కందుల మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేము సైతం ఫౌండేషన్ తంబళ్ల రవి నిత్య అన్నదాన కార్యక్రమం

**దమ్మపేట జనవరి 14 పెన్ పవర్:**

దమ్మపేట మండలం లోని దమ్మపేట బస్టాండ్ ప్రక్కన నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న తంబళ్ల రవి ని అభినందిస్తున్న దమ్మపేట ప్రజలు పోకూరి వెంకట సుబ్బారావు (ప్రముఖ కాంట్రాక్టర్) సంవత్సరికం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు పోకూరి కృష్ణ ప్రసాద్, మల్లికార్జున గుప్తా, సహకారంతో బుధవారం దమ్మపేట లో యాచుకులకు, పేదలకు అన్నదానం చేశారు.



## సుందిళ్ల దేవస్థాన డైరెక్టర్ కు సన్మానం

**హైదరాబాద్ పెన్ పవర్:**

రామగిరి మండలం సెంటినరీ కాలనీకి చెందిన పురిగిరి క్షత్రియ పెరిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఆర్జీ 3 ఐఎన్టియుసి బ్రాంచ్ సెక్రటరీ నరేడ్ల శ్రీనివాసరావు ఇటీవల సుందిళ్లలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి డైరెక్టర్ గా నూతన పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం ఆయన నివాసంలో పురిగిరి క్షత్రియ పెరిక సంఘం నాయకులు, టౌన్ అధ్యక్షుడు ఉగ్గే కుమార్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని రాజకీయంగా ఎదగాలని తోటి నాయకులు ఆకాంక్షిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, ఉపాధ్యక్షులు దుండే రాజేందర్, మార్త సతీష్, నాయకులు బుద్దే ఉదయ్, కొట్టే భీమయ్య, చింతం



మహేందర్, బుద్దే సదానందం, దురిశెట్టి మొగిలి, సందెల కుమారస్వామి, శ్రీరాముల రవీందర్, దుమ్మటి కిరణ్ కుమార్, చింతం కిరణ్ కుమార్, ఉగ్గే కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరు టౌన్ ఎన్టీవీ రిపోర్టర్ల అరెస్టుకు నిరసన తెలుపుతున్న తొర్రూర్ జర్నలిస్టులు

**ఎన్టీవీ రిపోర్టర్ల అక్రమ అరెస్టుకు జర్నలిస్టుల నిరసన ప్రదర్శన:**

**తొర్రుగ్గర్ జనవరి 14 పెన్ పవర్:**

ఆంధ్ర ప్రభ ఎన్టీవీ ఇన్ పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్లు పరిపూర్ణచారి, సుధీర్ లను పోలీసులు.అరెస్ట్ చేసినందుకు నిరసనగా తొర్రూర్ డివిజన్ కేంద్రంలో బుధవారం జర్నలిస్టుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజె ఐ జే యు జాతీయ కౌన్సిలర్ సభ్యుడు దూలం శ్రీనివాస్, జిల్లా కోశాధికారి బిజ్జాల వెంకటరమణ టీయూడబ్ల్యూజే 143 జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరాజులు మాట్లాడుతూ మహిళా ఐఏఎస్ , మంత్రి వార్త వ్యవహారంలో ఎన్ టీవీ న్యూస్ ఛానల్ పై కఠినమైన చర్యలకు సిద్ధమై తెలంగాణ ప్రభుత్వం... ఐదురోజుల క్రితం ప్రసారమైన వార్త మీద సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటుకు పూనుకుందని ,దీంతో సలహాదారుల సూచన మేరకు ఎన్టీవీ యాజమాన్యం క్షమాపణ కోరినప్పటికి కుటుంబంతో విదేశాలకు వెళుతున్న క్రమం లో ఎన్ టి వి ఇన్ పుట్ ఎడిటర్ దొంతు రమేష్ ను హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ లో అరెస్ట్ చేయగా మరో ఇద్దరు రిపోర్టర్ లను సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వెంటనే వారిని భేషరతుగా విడుదల చేయాలని జర్నలిస్ట్ నాయకులు కోరారు. ఈ తొర్రూరు ప్రింట్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు మేరుగు రమేష్, ఎలగందుల సంతోష్ లకావత్ యాదగిరి ఇమ్మడి రాంబాబు, అంకం సురేష్, వీరాంజనేయులు, పంజాల శ్రీకాంత్, భాస్కర్ ,శ్రీకాంత్ దయాకర్, రామకృష్ణ ,విక్రమ్ మహేష్ ,కార్తీక్, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు



## కడు కమనీయం కడు రమ నీయం భూలోక వైకుంఠంగా

తొర్రూరు గోదా, రంగనాయకుల కళ్యాణం



**తొర్రూరు జనవరి 14 పెన్ పవర్:**

తొర్రూర్ పట్టణంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గోదా రంగనాయకుల కళ్యాణ మహోత్సవం భక్తుల హృదయాలను, పరవశింప చేసినది. పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా ఆలయ ప్రధాన అర్చకులు అలహరి శ్యాంసుందర్ ,ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దివ్య కళ్యాణంలో దేశంరాష్ట్రం, సుభిక్షంగా, ప్రజలు ,సుఖశాంతులతో విరాజిల్లాలని స్వామివారిని, భక్తిపూర్వకంగా, వేడుకోవడం, జరిగింది. పాదప్రక్షాళనం, కన్యాదానం, జిలకరబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు వంటి శాస్త్రోక్త,కైంకర్యాలు,వేదమంత్రోచ్చారణల,మధ్యఅద్భుత,వైభవంతో,సాగినది.గోదమ్మ,రంగనాయకుల,కళ్యాణం,దివ్యత్వాన్ని,ఆవిష్కరించింది.పురప్రముఖుల సమక్షంలోలి నిర్వహించిన, కళ్యాణ,మహోత్సవానికి రాజేష్ ఆచార్యులు, తొర్రూర్ మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు,ఓలేటి,లక్ష్మణాచార్యులు ,కృష్ణమాచార్యులు, భక్తులు తదితరులు హాజరై స్వామి కృపకు పాత్రులయ్యారు.ఈ గోదా రంగనాయకుల కళ్యాణ మహోత్సవం,భక్తిశక్తిశాంతుల సమ్మేళనంగా నిలిచి, ప్రతి హృదయంలో దైవానుభూతిని చిరస్థాయిగా నిలిపింది..

## చిన్నారి పై అత్యాచారం చేసిన వ్యక్తికి ఉరి శిక్ష విధించాలి

**కొడారి వెంకటేష్**

**సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కామాంధుడు ఎల్లయ్యకు ఉరిశిక్ష విధించాలి**

**సాక్షాలను పరిగణలోకి తీసుకోకుండా డాక్టర్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఉరి తీయాలి**

**ప్రభుత్వం బాధ్యత కుటుంబాన్ని ఆదుకోవాలి**


**భువనగిరి పెన్ పవర్:**



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం పెంచికల్ పహాడ్ లో మంగళవారం చిన్నారి ( 4 ) పై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని కఠినంగా శిక్షించి , ఉరి శిక్ష విధించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అభం శుభం తెలియని పసిపిల్లలను చాక్లెట్లు, బిస్కెట్లు ఇస్తామని ఆశచూపి నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించడం, అత్యాచారం చేయడం పరిపాటిగా మారిందన్నారు. నిందితుల పై ఫోక్సో కేసు నమోదు చేయాలని, 12 సంవత్సరాల లోపు పిల్లల పై అత్యాచారం చేసిన వ్యక్తికి ఉరి శిక్ష విధించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పసి పిల్లల పై అత్యాచారం చేసినట్లు డాక్టర్ రిపోర్ట్ ఆధారంగా శిక్ష విధించాలని, సాక్ష్యాలను పరిగణలోకి తీసుకోకూడదని ఆయన కోరారు. మంగళవారం పెంచికల్ పహాడ్ లో అత్యాచారానికి గురై, జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. చిన్నారి కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక బాలిక తల్లిదండ్రులకు అండగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలని, కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

## గుండెపోటుతో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఉపాధ్యక్షుడు కళాధర్ రెడ్డి మృతి

**రామగిరి జనవరి 14 పెన్ పవర్:**



రామగిరి మండలం సెంటినరీ కాలనీకి చెందిన కదారి కళాధర్ రెడ్డి హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన అకాల మరణం పట్ల లయన్స్ క్లబ్ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సెంటినరీ కాలనీ ప్రాంతంలో రామగిరి విద్యాసంస్థలను స్థాపించి ఎంతోమందికి నాణ్యమైన విద్యను అందించి సమాజానికి విశేష సేవలు అందించారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో విద్యావంతుల వేదిక చైర్మన్‌గా పనిచేస్తూ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ప్రస్తుతం సింగరేణి సంస్థల్లో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు.లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఉపాధ్యక్షుడిగా అనేక సేవా కార్యక్రమాల్లో ముందుండి నాయకత్వం వహించిన వ్యక్తి మృతి చెందడం అత్యంత బాధాకరమని క్లబ్ సభ్యులు తెలిపారు. కదారి కళాధర్ రెడ్డి సేవాభావం, నిజాయితీ, సమాజంపై ఉన్న అపారమైన ప్రేమతో అందరి మన్ననలను పొందిన వ్యక్తి. విద్య, ఉద్యమం, సేవ ఇలా మూడు రంగాల్లోనూ ఆయన చూపిన అంకితభావం ఆయనను సమాజంలో ఒక ఆదర్శనీయ నాయకుడిగా నిలిపింది. ఆయన సేవలను స్మరిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కదారి కళాధర్ రెడ్డికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలు వారి స్వస్థలం సిరిసిల్ల జిల్లాలో జరగనున్నాయని తెలిపారు. అలాగే వారి కుటుంబానికి మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని పలువురు ప్రార్థించారు.

## ముగ్గుల పోటీలలో ప్రథమ విజేత రమ్యకు రూ.10వేలు బహుమతి పోత్నక్ ప్రమోద్ కుమార్

**సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్**

**మహిళలను మించిన ఆర్టిస్టులు లేరు**

**నేల మీదకు రాలిన నక్షత్రాలు**

**పురుషులతో సమానంగా అన్ని రంగాలలో దూసుకుపోతున్న మహిళలు**

**ఆడపిల్లలంతా తప్పకుండా చదువుకోవాలి**

**యాదాద్రి భువనగిరి జిల్లా**

**పెన్ పవర్:**







భువనగిరి పట్టణం లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో ప్రధమ విజేతగా నిలిచిన టి.రమ్యకు పిసిసి ప్రధాన కార్యదర్శి, భువనగిరి మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ పదివేల రూపాయలు బహుమతి అందించారు. భువనగిరి పట్టణంలోని 10, 26 వార్డులకు చెందిన మహిళా మణులందరికీ హౌసింగ్ బోర్డ్ భక్త భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బుధవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోత్నక్ ప్రమోద్ కుమార్, భువనగిరి పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలను మించిన ఆర్టిస్టులు ఎవరూ లేరని, ప్రస్తుత టెక్నాలజీ కాలంలో మహిళలందరూ అన్ని రంగాలలో ముందుకు దూసుకుపోతున్నారని తెలిపారు. గతంలో మహిళలను వంటింటికే పరిమితం చేశారని, కానీ ప్రస్తుతం మహిళలు బయటకు వచ్చి పురుషులతో పాటు సమానంగా అన్ని పనుల్లో సత్తా చూపుతున్నారన్నారు. దీనికి అంతటికీ కారణం చదివేనని, ప్రతి ఆడపిల్ల చదువుకోవాలని, చదువుకుంటేనే దేశ, ప్రపంచ, సమాజ పరిస్థితులు తెలుసుకొని తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కలుగుతుందని తెలిపారు. మహిళల వేసిన ముగ్గులను చూస్తుంటే ఆకాశంలోని చుక్కలన్ని నేల మీద పరిచినట్లు ఉన్నాయని, అదే విధంగా మన సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే విధంగా రంగవల్లులు తీర్చిదిద్దడం అభినందనీయ మన్నారు. ఈ ముగ్గుల పోటీలో మొదటి బహుమతిగా టి.రమ్య పదివేల రూపాయలు గెలుపొందగా, రెండవ బహుమతి పూజిత 5000 రూపాయలు, మూడవ బహుమతి డి.గీత 3500, 4 బహుమతి క్రితిక 3000, ఐదవ బహుమతిగా జి.కవిత 2500రూపాయలతో పాటు, కన్సోలేషన్ బహుమతులుగా యాదమ్మ,భానుశ్రీ,లిఖిత ముగ్గురికి మూడు వేల రూపాయలు చొప్పున కాంగ్రెస్ పార్టీ నాయకులు బింగి నరేష్ సౌజన్యంతో నగదు బహుమతి అందజేయడం జరిగింది. ముగ్గుల పోటీలలో 135 మంది మహిళలు పాల్గొనగా 8 మందిని ప్రత్యేక బహుమతులుగా ఎంపిక చేసి, మిగిలిన వారికి కన్సోలేషన్ బహుమతిగా ప్రతి ఒక్కరికి పండుగ సందర్భంగా చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక వేషధారణ (గోదాదేవి వేషంలో) చిన్నారి ఆరోహి ప్రజలను ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు బర్రె జహంగీర్, దొనకొండ వనిత, మాజీ కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, కాంగ్రెస్ నాయకులు బింగి భిక్షపతి, వార్డు అధ్యక్షులు అమానతుల్లా, శీలం క్రాంతి రెడ్డి, చెన్న శ్రీనివాస్, హీరేకార్ శివ, చెన్న సందీప్, నితిన్ భూపాల్ రెడ్డి, కవిత తదితరులు పాల్గొన్నారు.

# తిండిని బట్టే నడక..

మనం రోజూ తినే వివిధ రకాల ఆహారాలలో ఉండే కేలరీలను ఖర్చు చేయడానికి ఎంతసేపు నడవాలి అనే విషయం చాలా మందికి తెలియదు. ఒక గంటకు 5 కి.మీ. వేగంతో నడిస్తే నిమిషానికి 4-7 కేలరీలు ఖర్చవుతాయి. ముఖ్యంగా రెండు సమోసాలలో ఉండే కేలరీలను కరిగించడానికి ఏకంగా 135 నిమిషాలు నడవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం తీసుకునే ప్రతి ఆహారం జీర్ణం కావడానికి లేదా దానిలోని కేలరీలను కరిగించడానికి కొంత సమయం పడుతుంది. ఈ విషయంలో పోషకాహార నిపుణులు మనం తినే వివిధ రకాల ఆహారాలలో ఉండే కేలరీలను ఖర్చు చేయడానికి ఎంతసేపు నడవాలనే దాని గురించి వివరణాత్మక సమాచారాన్ని అందించారు. మీ వేగం, శరీర బరువును బట్టి.. గంటకు 5 కి.మీ. వేగంతో నడవడం వల్ల నిమిషానికి 4-7 కిలో కేలరీలు ఖర్చవుతాయి. ఉదాహరణకు.. మీరు 400 కేలరీల భోజనం తింటే, ఆ కేలరీలను బర్న్ చేయడానికి దాదాపు 60-90 నిమిషాల నడక అవసరం అవుతుంది. బియ్యం..చపాతీ.. పరోటా.. బిర్యానీ: రోజువారీ ఆహారంలో తీసుకునే ప్రధాన వంటకాలైన అన్నం, చపాతీల విషయానికి వస్తే.. అన్నంలో ఉండే కేలరీలను జీర్ణం చేసుకోవడానికి 53 నిమిషాలు నడవాలి. అదేవిధంగా మూడు చపాతీలలో ఉండే కేలరీలను బర్న్ చేయడానికి 70 నిమిషాల నడక అవసరం. ఆరోగ్యకరమైన చిరుతిండిగా భావించే రెండు గోధుమ పరాతా తింటే 70 నిమిషాలు నడవాల్సి వస్తుంది. ఇక చాలా మంది ఇష్టపడే చికెన్ బిర్యానీలో దాదాపు 420 కేలరీలు ఉంటాయి. వీటిని బర్న్ చేయడానికి సుమారు 80-90 నిమిషాల నడక అవసరం అవుతుంది. స్నాక్స్ - ఫాస్ట్ ఫుడ్స్.. సమోసా.. పూరీ.. బర్గర్: నోరూరించే స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్స్ విషయంలో కేలరీల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు.. రెండు సమోసాలలో ఏకంగా 522 కేలరీలు ఉంటాయి. వీటిని కరిగించడానికి సుమారు 135 నిమిషాలు నడవాల్సి వస్తుంది. రుచికరమైన ఆలూ పూరీలో 444



కేలరీలు ఉంటాయి. వీటిని బర్న్ చేయడానికి 85 నిమిషాల నడక అవసరం. ఒక బర్గర్‌లో ఉండే కేలరీలను ఖర్చు చేయడానికి 75 నిమిషాలు నడవాలి. అయితే తేలికైనదిగా భావించే శాండ్‌విచ్‌లో ఉండే కేలరీలను కరిగించడానికి 53 నిమిషాలు నడవాలి. ఫ్రెంచ్ ఫ్రైస్‌లో ఉండే కేలరీలను బర్న్ చేయడానికి ఒక గంట పాటు నడవాల్సి వస్తుంది. దహీ చాట్.. నూడుల్స్: సాధారణంగా ఆరోగ్యకరమైనదిగా భావించే దహీ చాట్‌లో దాదాపు 450 కేలరీలు ఉంటాయి. వీటిని జీర్ణం చేసుకోవడానికి ఏకంగా 115 నిమిషాలు నడవాల్సి వస్తుంది. అదేవిధంగా తక్కువ సమయంలో తినే ఇన్‌స్టంట్ నూడుల్స్‌లో 400 కేలరీలు ఉంటాయి. వీటిని బర్న్ చేయడానికి 80 నిమిషాల నడక అవసరం. కాబట్టి మనం ఇష్టంగా తీసుకునే ప్రతి ఆహారంలో ఉండే కేలరీలపై అవగాహన కలిగి ఉండటం, వాటిని బర్న్ చేయడానికి సరైన మొత్తంలో వ్యాయామం చేయడం ఆరోగ్యానికి చాలా ముఖ్యం అని నిపుణులు సూచిస్తున్నారు.

# నెల పాటు పూర్తిగా అన్నం తినడం మానేస్తే..



మనలో చాలామందికి అన్నం తినందే రోజు గడవదు. రోజుకు మూడు పూటలూ అన్నం తినే వారు ఉన్నారు. కానీ చాలా మంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అన్నం తినకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. అవును.. కొంతమంది రోజుకు ఒకసారి మాత్రమే అన్నం తింటారు. మనలో చాలామందికి అన్నం తినందే రోజు గడవదు. రోజుకు మూడు పూటలూ అన్నం తినే వారు ఉన్నారు. కానీ చాలా మంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అన్నం తినకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. అవును.. కొంతమంది రోజుకు ఒకసారి మాత్రమే అన్నం తింటారు. మరికొందరు అసలు అన్నమే ముట్టుకోరు. కాబట్టి ఇలా అన్నం మానేస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందా, ఇది నిజంగా ప్రయోజనకరంగా ఉంటుందా అని చాలా మందికి సందేహం రావచ్చు. మన శరీరానికి త్వరగా శక్తినిచ్చే ప్రధాన వనరులలో అన్నం ఒకటి. మీరు అకస్మాత్తుగా అన్నం తినడం మానేస్తే, మీ శరీరం ఈ మార్పుకు అలవాటు పడటానికి కొంత సమయం పడుతుంది. మొదటి కొన్ని రోజుల్లో, మీకు ఆకలి పెరగడం, బలహీనత లేదా కొద్దిగా చిరాకు అనిపించవచ్చు. అందువల్ల, అన్నం బదులుగా మిల్లెట్, బార్లీ, క్వినోవా, గుమ్మడి గింజలు వంటి ఇతర ధాన్యాలను మీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. అన్నం కార్బోహైడ్రేట్లతో సమృద్ధిగా ఉంటుంది.

సులభంగా జీర్ణమవుతుంది. మీరు అన్నం తినడం మానేస్తే, మీ శరీరానికి తక్కువ కేలరీలు లభిస్తాయి. ఫలితంగా ఇది బరువు తగ్గడానికి దారితీస్తుంది.

బరువు తగ్గాలనుకునే వారు అన్నం తీసుకోవడం తగ్గించవచ్చు. తెల్ల బియ్యం త్వరగా జీర్ణమవుతాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. మీరు ఒక నెల పాటు అన్నం తినడం మానేస్తే, మీ రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుకోవచ్చు. ఇది మధుమేహం ఉన్నవారికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కొంతమందికి అన్నం తిన్న తర్వాత ఉబ్బరం లేదా మలబద్ధకం వంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే మీరు అన్నం తినడం మానేస్తే, మీకు మొదట్లో కొంత కడుపు నొప్పి లేదా మలబద్ధకం అనిపించవచ్చు. అయితే మీరు ఎక్కువ పండ్లు, కూరగాయలు, ధాన్యాలు తింటే మీ జీర్ణక్రియ త్వరగా మెరుగుపడుతుంది. బియ్యంలో విటమిన్ బి ఉంటుంది. ఇది శరీరానికి శక్తిని ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. మీరు ఎక్కువసేపు అన్నం తినకపోతే, మీకు ఈ విటమిన్ లోపం ఏర్పడవచ్చు. దీని వలన అలసట, మానసిక స్థితిలో మార్పులు సంభవించవచ్చు. మీరు అన్నం తినడం మానేస్తే, మీ శరీరానికి అవసరమైన విటమిన్ బి, ఇతర ముఖ్యమైన పోషకాలను ఇతర వనరుల నుంచి పొందవలసి ఉంటుంది. అలాగే ఆహారంలో ఆకు కూరలు, చిక్కుళ్ళు, గుడ్లు, పాలు వంటి ప్రత్యామ్నాయ ఆహారాలను చేర్చుకోవల్సి ఉంటుంది.

# లివర్‌ను కడిగిన ముత్యంలా మార్చే ఆయుర్వేద చిట్కా..

సమయం ఏదైనా అవకాశం దొరికినప్పుడల్లా చాలా మంది తినేందుకు ఆసక్తి చూపే పండ్లు.. అరటిపండ్లు. ఈ పండు కడుపు నింపుతుంది. పైగా పోషకమైనది. కానీ అరటిపండ్లతో పాటు వంటగదిలో ఉండే మరో మసాలా దినుసు కలిపి తినడం ద్వారా కాలేయ వ్యాధులను తరిమి కొట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నేచర్ మ్యాగజైన్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం.. అరటిపండ్లు, మిరియాలు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి భలేగా పనిచేస్తాయని వెల్లడించింది. దీనిని తినడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా కొవ్వు కాలేయ సమస్యలతో బాధపడేవారికి ఇది అద్భుత సంజీవని. ఈ సమస్యలతో బాధపడేవారు క్రమం తప్పకుండా అరటిపండ్లను మిరియాలతో కలిపి తీసుకోవడం వల్ల సమస్య నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. ఫ్యాటీ లివర్ అనేది ప్రాథమికంగా నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్. మద్యం తాగని వారిలోనూ ఈ రకమైన సమస్య పెరుగుతోంది. ఇటీవల, ఢిల్లీలోని ఎయిమ్స్ నిర్వహించిన సర్వే ప్రకారం మన దేశంలో 38.6 శాతం మందికి ఈ రకమైన ఫ్యాటీ లివర్ సమస్య ఉందని తేలింది. వృద్ధులతోపాటు యువకులు కూడా ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. చాలా మందికి ఫ్యాటీ లివర్ ఉన్నట్లు నిర్ధారణ అవుతున్నట్లు వైద్యులు సైతం చెబుతున్నారు. చాలా మంది సకాలంలో ఈ వ్యాధి గుర్తించడం లేదు. అరటిపండ్లలో విటమిన్ దీ6, విటమిన్ సి, డోపమైన్ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవన్నీ కాలేయంలో పేరుకుపోయిన హానికరమైన పదార్థాలను తొలగిస్తాయి. అంతే కాదు





అరటిపండ్లలోని స్టార్చ్ కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. అరటిపండ్లలోని కరిగే ఫైబర్ పెక్టిన్ పేగులలోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను ఆరోగ్యంగా ఉంచుతుంది. మిరియాలతో కలిపినప్పుడు అరటిపండ్ల ఈ లక్షణాలు మూడు రెట్లు పెరుగుతాయి. మిరియాలలో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది శరీరంలోని అన్ని ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కాలేయానికి చేరినప్పుడు కణాలను ఉత్తేజపరుస్తుంది. కాబట్టి అరటిపండ్లతో మిరియాలను కలిపి తినడం వల్ల కాలేయంలోని ప్రతి భాగం శుభ్రం అవుతుంది. అయితే రక్తంలో చక్కెర లేదా అల్సర్ సమస్యలతో బాధపడేవారు దీనిని తినకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

## ఈ వ్యక్తులకు ఉసిరి విషంతో సమానం..



ఉసిరి విటమిన్ సి అద్భుత నిలయం. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి, చర్మం, జుట్టు ఆరోగ్యానికి.. అలాగే గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే ఉసిరిలో అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. ఇది కొంతమందికి హాని కలిగించే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తక్కువ రక్తపోటు: ఉసిరి బీపీని తగ్గిస్తుంది. ఎక్కువ బీపీ ఉన్నవారికి ఇది మంచిది. కానీ మీకు ముందే తక్కువ బీపీ ఉంటే.. లేదా బీపీ తగ్గడానికి మందులు వాడుతుంటే ఉసిరిని ఎక్కువగా తింటే బీపీ ఇంకా తగ్గిపోతుంది. అప్పుడు తల తిరగడం లేదా నీరసం రావడం జరగవచ్చు. ఖాళీ కడుపుతో: ఉసిరిలో పులుపు ఎక్కువగా ఉంటుంది. పొద్దున్నే ఖాళీ కడుపుతో ఉసిరి లేదా ఉసిరి రసం తాగితే, కడుపు సున్నితంగా ఉన్నవారికి యాసిడిటీ, గ్యాస్ లేదా గుండెల్లో మంట రావచ్చు. అందుకే ఉసిరిని ఎప్పుడూ ఏదైనా తిన్న తర్వాతే తీసుకోవాలి. షుగర్ మందులు: ఉసిరి రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుంది. మీరు ఇప్పటికే షుగర్ కోసం మందులు వాడుతుంటే, ఉసిరిని ఎక్కువగా తింటే షుగర్ మరీ ఎక్కువగా తగ్గిపోతుంది . ఇలాంటివారు డాక్టర్‌ను అడిగి మాత్రమే ఉసిరి తినాలి. ఆపరేషన్‌కు ముందు: ఉసిరి బీపీని, షుగర్‌ను ప్రభావితం చేస్తుంది కాబట్టి ఏదైనా ఆపరేషన్ జరగడానికి ముందు ఉసిరిని తినడం ఆపేయాలి. ఆపరేషన్ సమయంలో బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచడానికి ఈ జాగ్రత్త అవసరం. రక్తం త్వరగా గడ్డకట్టే సమస్య: ఉసిరి రక్తాన్ని పల్చగా చేస్తుంది. ఎవరికైతే రక్తం త్వరగా గడ్డకట్టే సమస్య ఉంటుందో, అలాంటివారు ఉసిరిని ఎక్కువగా తింటే, గాయమైనప్పుడు రక్తం కారడం ఎక్కువ కావచ్చు.

## స్లిమ్‌గా మార్చే సూపర్‌ఫుడ్స్..

ఈ మధ్య కాలంలో చాలా మంది స్లిమ్‌గా, అందంగా కనిపించాలని ఆరోగ్యంపై శ్రద్ధ



పెడుతున్నారు. బరువు తగ్గేందుకు జిమ్‌కు వెళ్లడం డైట్స్ ఫాలో అవ్వడం చేస్తున్నారు. మరికొందరూ హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూ బరువు తగ్గేందుకు రకరకాల ట్రీట్‌మెంట్స్ తీసుకుంటున్నారు. కానీ చాలా మంది వీటి నుంచి పూర్తి పరిష్కారం పొందలేకపోతున్నారు. అయితే మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా మీరు సులభంగా బరువుతగ్గవచని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాలీఫ్లవర్: బరువు తగ్గాలనుకునే వారికి కాలీఫ్లవర్ ఒక అద్భుతమైన ఆహారం. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. అందువల్ల, దీనిని అన్నానికి బదులుగా తినవచ్చు. 100 గ్రాముల కాలీఫ్లవర్‌లో దాదాపు 25 గ్రాముల కేలరీలు ఉంటాయి. దీన్ని మీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీరు త్వరగా బరువు తగ్గేందుకు ఇది తోడ్పడుతుంది.
ఆపిల్స్: ఆపిల్స్ లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. 100 గ్రాముల ఆపిల్ లో దాదాపు 52 గ్రాముల కేలరీలు ఉంటాయి. అందువల్ల, ఇది ఆకలిని నియంత్రిస్తుంది అలాగే రోజంతా మీకు అవసరమైన శక్తిని అందిస్తుంది. పనీర్: పనీర్‌ను సోయా పాలతో తయారు చేస్తారు. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ముఖ్యంగా కొవ్వు, కాల్షియం, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. 100 గ్రాముల టోఫులో దాదాపు 76 గ్రాముల కేలరీలు ఉంటాయి. ఇది కూడా మీ ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. డ్రై ఫ్రూట్స్: బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్, పిస్తా, బ్రెజిల్ నట్స్ , వేరుశెనగ వంటి గింజలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. డ్రై ఫ్రూట్స్‌లో అసంతృప్త కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. 100 గ్రాముల గింజల్లో దాదాపు 550-600 కేలరీలు ఉంటాయి. అందువల్ల, బరువు తగ్గాలనుకునే వారికి అవి తగినంత పోషకాలు , శక్తిని అందిస్తాయి. బీన్స్, పప్పులు: బీన్స్ ,పప్పులు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాలు. వీటిలో ముఖ్యంగా ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. 100 గ్రాముల బీన్స్, పప్పులు దాదాపు 333 కేలరీలు కలిగి ఉంటాయి. ఇవి ఆరోగ్యంతో పాటు అవసరమైన మేర బరువు తగ్గడానికి ఉపయోగపడుతాయి.

## వీటిని తిన్నారంటే ఎముకలు నుజ్జు కావడం ఖాయం!

కాల్షియం.. ఒంట్లో ఎముకలు, దంతాలను బలంగా ఉంచడమే కాకుండా రక్తపోటు, కండరాల నియంత్రణ, కణాల పనితీరును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. అయితే ఎముకలను బలహీనపరిచే కొన్ని ఆహారాలు ఉన్నాయి. కాల్షియం శరీరానికి చాలా ముఖ్యమైన ఖనిజం. ఇది ఒంట్లో ఎముకలు, దంతాలను బలంగా ఉంచడమే కాకుండా రక్తపోటు, కండరాల నియంత్రణ, కణాల పనితీరును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. అయితే ఎముకలను బలహీనపరిచే కొన్ని ఆహారాలు ఉన్నాయి. ముఖ్యంగా శీతల పానీయాలను నేటి కాలంలో చిన్నా పెద్దా అందరూ ఇష్టపడతారు. అయితే ఇవి తాగడం వల్ల ఒంట్లో కాల్షియం లోపానికి కారణమవుతాయి. ఈ పానీయాలలో ఫాస్పోరిక్ ఆమ్లం ఉంటుంది. ఇది శరీరంలో కాల్షియం శోషణను నిరోధిస్తుంది. దీని కారణంగా ఎముకలు క్రమంగా బలహీనపడతాయి. కాబట్టి శీతల పానీయాలు తాగడం తగ్గించాలి. ఎర్ర మాంసం (మేక మటన్), ప్రాసెస్ చేసిన మాంసం (ఉదా. సాసేజ్, బేకన్, హాట్ డాగ్స్) తీసుకోవడం వల్ల యూరిక్ యాసిడ్ సమస్యలు వస్తాయి. ఇది ఎముకలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఈ పదార్థం శరీరంలో కాల్షియం శోషణను ప్రభావితం చేస్తుంది. దీని కారణంగా ఎముకల ఆరోగ్యం క్షీణిస్తుంది.కేకులు, క్యాండీలు, కుకీలు వంటి తీపి, ప్రాసెస్ చేసిన బేకరీ ఆహారాల్లో శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి కాల్షియం శోషణకు ఆటంకం కలిగిస్తాయి. ఈ ఆహారాలు శరీరంలో మంటను కలిగిస్తాయి. అవి ఎముకలను బలహీనపరుస్తాయి. అందుకే తీపి ఆహారాలకు దూరంగా ఉండాలి. టీలో కెఫిన్ ఉంటుంది. ఇది శరీరంలో కాల్షియం శోషణను తగ్గిస్తుంది. మీరు ఎక్కువగా టీ తాగితే మీ ఎముకల ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. టీ లేదా కాఫీ అధికంగా తీసుకోవడం వల్ల ఎముకల నుంచి కాల్షియం తగ్గుతుంది. ఇది ఎముకలను బలహీనపరుస్తుంది. కాబట్టి టీ, కాఫీ తాగడం తగ్గించి, నీళ్లు, ఇతర కాల్షియం అధికంగా ఉండే పానీయాలు తీసుకోవాలి.ఆల్కహాల్ తాగడం వల్ల ఎముకలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆల్కహాల్ శరీరంలో కాల్షియం శోషణను తగ్గిస్తుంది. ఇది మీ ఎముకలను బలహీనపరుస్తుంది. ఇది పెళుసు ఎముకలకు కారణమవుతుంది. ఎముక పగుళ్ల రేటు పెరుగుతుంది. మీకు బలమైన ఎముకలు కావాలంటే మద్యం సేవించడం వెంటనే మానేయాలి. సమోసాలు, వేయించిన చికెన్, బజ్జీ వంటి నూనె పదార్థాలు రుచికి భలేగా ఉంటాయి. వీటిల్లోని కొవ్వు , అసమతుల్య కొవ్వులు శరీరంలో వాపుకు కారణమవుతాయి. దీనివల్ల శరీరంలో కాల్షియం శోషణ తగ్గుతుంది. ఎముకలు బలహీనపడతాయి. ఈ ఆహారాల వినియోగాన్ని కనిష్టంగా తగ్గించాలి. బదులుగా తేలికపాటి ఆహారం తీసుకోవాలి. తద్వారా మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

## పాక్ పేసర్ సంచలన బౌలింగ్.. చివరి ఓవర్‌లో 6 పరుగులు డిఫెండ్ చేశాడు..





**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ క్రికెటర్లు ప్రస్థుహం బిగ్ బాష్ లీగ్ లో ఆడుతూ బిజీగా ఉన్నారు. టీ20 వరల్డ్ కప్ ముందు ప్రాక్టీస్ గా బిగ్ బాష్ లీగ్ ఆడి ఫామ్ లోకి రావాలని భావిస్తున్నారు. అయితే టోర్నమెంట్ లో పాక్ ప్లేయర్స్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నారు. బాబర్, రిజ్వాన్ లాంటి స్టార్ క్రికెటర్లు ఘోరంగా విఫలమవుతున్నారు. ఇదిలా ఉంటే పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ జమాన్ ఖాన్ మాత్రం అద్భుతంగా రాణించి మ్యాచ్ గెలుపుకు కారణమయ్యాడు. చివరి ఓవర్ లో ప్రత్యర్థి జట్టు 6 పరుగులు చేయాల్సి ఉండగా.. కేవలం రెండు పరుగులు మాత్రమే ఇచ్చి 3 పరుగుల తేడాతో విజయాన్ని అందించాడు.

బుధవారం (జనవరి 12) హెూబర్ట్ హరికేన్స్, బ్రిస్బేన్ హీట్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన బ్రిస్బేన్ హీట్ నిర్ణీత 20 ఓవర్లలో 160 పరుగులు చేసింది. 161 పరుగుల టార్గెట్ లో హెూబర్ట్ హరికేన్స్ 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. దీంతో విజయానికి చివరి ఆరు బంతుల్లో ఆరు పరుగులు చేయాలి. ఇన్నింగ్స్ చివరి ఓవర్ బంతి తీసుకున్న జమాన్ ఖాన్ తన పదునైన యార్కర్లతో తొలి నాలుగు బంతులకు కేవలం ఒక పరుగు మాత్రమే ఇచ్చాడు. ఐదో బంతికి వికెట్ తీయడంతో చివరి బంతికి 5 పరుగులు చేయాల్సిన వచ్చింది. చివరి బంతికి ఒక పరుగు రావడంతో 3 పరుగుల తేడాతో బ్రిస్బేన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన బ్రిస్బేన్ హీట్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది.

నాథన్ మెక్‌స్వీనీ 32 బంతుల్లో 49 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. మాట్ రెన్షా 37 పరుగులతో రాణించాడు. హెూబర్ట్ బౌలర్లలో రిలే మెరెడిత్ మూడు వికెట్లు పడగొట్టాడు. రిషద్ హుస్సేన్, నాథన్ ఎల్లిస్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. 161 పరుగుల లక్ష్య ఛేదనలో హెూబర్ట్ హరికేన్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసి ఓడిపోయింది. బ్యూ వెబ్‌స్టర్(51) బెన్ మెక్‌డెర్మాట్ (59) హాఫ్ సెంచరీలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

## ఒంటరి పోరాటంతో వీరోచిత సెంచరీ.. టీమిండియా దిగ్గజాన్ని వెనక్కి నెట్టిన రాహుల్





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ జట్టుకు మరోసారి ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు. జట్టు మొత్తం విఫలమైన వేళ ఒంటరి పోరాటం చేసి భారీ స్కోర్ అందించాడు. వీరోచిత సెంచరీతో టీమిండియాను ఆదుకున్నాడు. బుధవారం (జనవరి 14) రాజ్ కోట్ వేదికగా నిరంజన్ షా స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్ లో కేఎల్ రాహుల్ 92 బంతుల్లోనే 112 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కేఎల్ ఇన్నింగ్స్ లో 11 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. ఈ సెంచరీతో రాహుల్ టీమిండియా దిగ్గజ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్ రికార్డ్ ను బ్రేక్ చేశాడు. రాహుల్ వన్డే కెరీర్ లో ఇది 8వ సెంచరీ. మిడిల్ ఆర్డర్ లో ఆడుతూ కేవలం 93 మ్యాచ్ ల్లోనే 8 సెంచరీలు పూర్తి చేయడం విశేషం. టీమిండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్ 7 సెంచరీలు చేయగా.. తాజా సెంచరీతో రాహుల్ ఈ దిగ్గజ క్రికెటర్ ను వెనక్కి నెట్టాడు. శ్రేయాస్ అయ్యర్ తర్వాత క్రీజ్ లోకి వచ్చిన రాహుల్..జట్టును ఆదుకునే బాధ్యత తీసుకున్నాడు. జడేజాతో కలిసి 73 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆ తర్వాత నితీష్ కుమార్ రెడ్డితో రాహుల్ మరో భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును ముందుకు తీసుకెళ్లాడు. ఒక వైపు వికెట్లు పడినా మరో ఎండ్ లో రాహుల్ ఒంటరి పోరాటం చేస్తూ జట్టు స్కోర్ ను 284 పరుగులకు చేర్చాడు.

**రాహుల్ సెంచరీతో ఇండియా భారీ స్కోర్:**

బుధవారం (జనవరి 14) రాజ్ కోట్ వేదికగా నిరంజన్ షా స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్ లో కేఎల్ రాహుల్ సెంచరీతో ఒంటరి పోరాటం చేసి టీమిండియాకు డీసెంట్ టోటల్ అందించాడు. రాహుల్ తో పాటు గిల్ (56) హాఫ్ సెంచరీతో రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. రాహుల్ 112 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ మూడు వికెట్లు పడగొట్టాడు. జేడెన్ లెన్నాక్స్, కైల్ జామిసన్, జకారీ ఫౌల్క్స్, మైఖేల్ బ్రేస్‌వెల్ తలో వికెట్ తీసుకున్నారు.

## ఇండియా, న్యూజిలాండ్ వన్డేకు బంగ్లాదేశ్ అంపైర్.. బీసీసీఐ, బీసీబీ ఒప్పుకున్నాయా..






**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, బంగ్లాదేశ్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. దేశాలతో పాటు క్రికెట్ లో కూడా ఇండియా, బంగ్లాదేశ్ జట్ల మధ్య మాటల యుద్ధం జరుగుతుంది. బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను ఐపీఎల్ 2026 నుంచి తొలగించిన తర్వాత బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్న టీ20 వరల్డ్ కప్ లో బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు ఆడేందుకు సిద్ధంగా లేమని గట్టిగా చెబుతుంది. ఐసీసీ బంగ్లా క్రికెట్ బోర్డును ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నా ఆ దేశ క్రికెట్ మాత్రం ఖరాఖండిగా ఆడేది లేదని గట్టిగా చెప్పుకొస్తుంది. ఇలాంటి సమయంలో ఊహించని సంఘటన ఒకటి చోటు చేసుకుంది.

ఇండియా, న్యూజిలాండ్ జట్ల మాదే ప్రస్తుతం రెండో వన్డే జరుగుతుంది. బుధవారం (జనవరి 14) రాజ్ కోట్ వేదికగా నిరంజన్ షా స్టేడియంలో ప్రారంభమైన ఈ మ్యాచ్ లో ఆన్ ఫీల్డ్ అంపైర్ బంగ్లాదేశ్ కావడం చర్చనీయాంశంగా మారింది. బంగ్లాదేశ్‌కు చెందిన అంపైర్ షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్ సైకత్ ప్రస్తుతం ఇండియాలోనే ఉన్నారు. తొలి వన్డేకు కూడా షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్ ఆన్ ఫీల్డ్ అంపైర్ గా ఉండడం విశేషం. ప్రస్తుతం జరుగుతున్న రెండో వన్డేలో కూడా కూడా ఆయన అంపైరింగ్ బాధ్యతలను స్వీకరించారు. అంతర్జాతీయ మ్యాచ్ జరిగేటప్పుడు అధికారులను ఐసీసీ నియమిస్తుంది. బీసీసీఐ గానీ దీజదీ ప్రమేయం ఉండదు.

ఐసీసీ నియమించడంతో రెండు జట్లు బోర్డులు ఎలాంటి నిర్ణయం తీసుకోవడానికి వీలు లేదు. దీంతో షర్ఫుద్దౌలా ఇబ్నే తన అంపైరింగ్ బాధ్యతలను కొనసాగిస్తున్నాడు. ఇబ్నే షాహిద్ సైకత్ మార్చి 2024 నుండి ఐసీసీ ఎలైట్ ప్యానెల్ అంపైర్‌గా ఉన్నారు. ఇప్పటివరకు ఈ బంగ్లాదేశ్ అంపైర్ 32 టెస్టులు, 119 వన్డేలు, 75 టీ20 మ్యాచ్ లకు అంపైరింగ్ చేశాడు. అంతేకాదు ప్రస్తుతం దీజదీ అంపైర్ విద్యా విభాగానికి అధిపతిగా ఉన్నాడు. ఈ బంగ్లా అంపైర్ భారత్ వేదికగా జరగబోయే టీ20 వరల్డ్ కప్ లో కూడా అంపైర్ గా చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**రాహుల్ సెంచరీతో ఇండియా భారీ స్కోర్:**

ఈ మ్యాచ్ విషయానికి వస్తే బుధవారం (జనవరి 14) రాజ్ కోట్ వేదికగా నిరంజన్ షా స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్ లో కేఎల్ రాహుల్ సెంచరీతో ఒంటరి పోరాటం చేసి టీమిండియాకు డీసెంట్ టోటల్ అందించాడు. రాహుల్ తో పాటు గిల్ (56) హాఫ్ సెంచరీతో రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. రాహుల్ 112 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ మూడు వికెట్లు పడగొట్టాడు. జేడెన్ లెన్నాక్స్, కైల్ జామిసన్, జకారీ ఫౌల్క్స్, మైఖేల్ బ్రేస్‌వెల్ తలో వికెట్ తీసుకున్నారు.

# బన్నీ 22 రెండు భాగాలు ఇదే సాక్ష్యం!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 22వ చిత్రం అట్లీ దర్శకత్వంలో భారీ కాన్వాస్ పై తెరకకెక్కుతోన్న సంగతి తెలిసిందే. బన్నీని ఏకంగా పాన్ వరల్డ్ మార్కెట్ కి కనెక్ట్ చేసే కంటెంట్ లో బన్నీని అట్లీ తీర్చిదిద్దుతున్నాడు. టెక్నికల్ కాన్సెప్ట్ తో తెరకెక్కుతోన్న చిత్రమిది. బన్నీ లుక్ టెస్ట్ కు సంబంధించి అట్లీ అంతర్జాతీయ స్టూడియోల్లోనే పని చేసాడు. ఇందులో బన్నీ మూడు పాత్రలు పోషిస్తున్నాడు. ఆ మూడు పాత్రలకు ముగ్గురు హీరోయిన్లు ఎంపికయ్యారు. మెయిన్ లీడ్ లో దీపికా పదుకొణె నటిస్తోంది. ఇదంతా తెలిసిన సమాచారమే. అయితే ఈ సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. కానీ అందులో వాస్తవాలు తెలియదు. నెట్టింట జరిగే ప్రచారం ఏది నిజం కాదు. మేకర్స్ అధికారికంగా వెల్లడించే వరకూ నమ్మే పరిస్థితి లేదు. అయితే వికీపీడియా



సమాచారం కొంత వరకూ వాస్తవంగా చెప్పొచ్చు. తాజాగా వికీపీడియాలో ఈ చిత్రాన్ని రెండు భాగాలు రిలీజ్ చేస్తున్నట్లు అప్ డేట్ అయింది. అంతకు ముందు అదే వికీలో 2028లో చిత్రం రిలీజ్ అవుతున్నట్లు షో అయింది. ఇప్పుడా స్థానంలో రెండు భాగాలు కనిపించడం ఆసక్తికరం. అయితే ఈ రెండింటికి ఓ రిలేషన్ కనెక్ట్ అవుతుంది. మొదటి భాగాన్ని ఈ ఏడాది ముగింపు లేదా? వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ చేసే అవకాశం ఉండొచ్చు.

అది బన్నీ 22 టైటిల్ తో రిలీజ్ అవుతుంది. రెండవ భాగం 23వ టైటిల్ తో 2028లో రిలీజ్ అవుతుంది? అన్న కోణంలో వికీపీడియాలో అలా అప్ డేట్ అయిందా? అన్న సందేహం చాలా మందిలో వ్యక్తమవుతుంది. ఏది ఏమైనా ఇప్పటికీ ఈ సినిమా రెండు భాగాలగా నెట్టింట ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే బన్నీ పాన్ ఇండియా మార్కెట్ ని దృష్టిలో పెట్టుకుని అట్లీ ఇలా ప్లాన్ చేస్తూ ఉండొచ్చు. అలాగే తాను రాసిన కథ కూడా ఒకే భాగం లో చెప్ప కథ కాకపోవడంతో రెండు భాగాలుగా రిలీజ్ ఛాన్స్ తీసుకుని ఉండొచ్చు. కారణం ఏదైనా? బన్నీ -పుష్ప 2- తో ఏకంగా 1800 కోట్ల వసూళ్లను సాధించడం అన్నది మేకర్స్ లో చాలా రకాల మార్పులకు దారి తీస్తోంది అన్నది కాదనలేని నిజం.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతోంది. షూట్ మొదలైన నాటి నుంచి ముంబైలోనే చిత్రీకరణ జరుగుతోంది. అక్కడ స్టూడియోలకే అట్లీ ప్రాధాన్యత ఇచ్చి పని చేస్తున్నాడు. బన్నీ సొంత పరిశ్రమైన టాలీవుడ్ లో...అట్లీ పుట్టిన గడ్డ అయిన చెన్నైలో ఒక్క షెడ్యూల్ అయినా చేస్తాడా? అన్నది చూడాలి. ఈ చిత్రాన్ని 600 కోట్ల బడ్జెట్ తో సన్ పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది.

## ఈషా రెబ్బా యొక్క పింక్ పర్ఫెక్షన్: టైమ్‌లెస్ చీర సొగసు



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965